ప్రజల కోసం.. ప్రకృతి కోసం.. సామాన్యుల గొంతుగా.. సామాజిక సమరంగా..

# ధర్మఘంటి

TELTEL/2012/47103

జాతీయ తెలుగు దిన పత్రిక

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 297 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | శుక్రవారం 23 జనవరి 2026 | పేజీలు : 8 | వెల : 3

**Circulated by:** Nalgonda, Hyderabad, Warangal, Ranga Reddy, Medak, Khammam, Adilabad, Nizamabad, Mahabub Nagar, Karimnagar

## సరికొత్త రికార్డుల దిశగా దూసుకెళుతున్న వెండి!

వెండి ధరలు దూసుకెళుతున్నాయి. పెట్టుబడిదారుల ఆసక్తిని ఆకర్షిస్తూ ఈ తెల్లని లోహం సరికొత్త రికార్డులను తాకుతోంది. ఈ జనవరి నెలలోనే ఇప్పటివరకు 22 శాతం మేర వెండి ధర పెరిగింది. ప్రధాన పెట్టుబడి సాధనాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తోంది. ప్రస్తుతం కిలో వెండి ధర రూ. 3 లక్షల మైలురాయికి అత్యంత చేరువలో ఉంది.గత శుక్రవారం ఎంసీఎక్స్‌లో కిలో వెండి ధర రూ. 2,87,762 వద్ద ముగిసింది.


## భారత కంపెనీలకు పోటీతత్వమే కీలకం

అయిదు రోజుల పాటు దావోస్ జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సమావేశాలకు భారత్ నుంచి వ్యాపార ప్రముఖులు హాజరు కానున్నారు. కంపెనీలకు ఖర్చు, స్థాయి, సామర్థ్యాల్లో పోటీతత్వాన్ని తీసుకురావడమే కీలకంగా మారిందని కన్సల్టెన్సీ సంస్థ బీసీజీ ఇండియా అధిపతి రాహుల్ జైన్ తెలిపారు. 2030 నాటికి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలిచే అవకాశం ఉందన్నారు.



## ఝార్ఖండ్‌లో మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ

- ఎన్‌కౌంటర్‌లో 15 మంది నక్సల్స్ మృతి
- మావోయిస్టుల ఏరివేత ముమ్మరం
- సారండా అడవుల్లో భద్రతా దళాల వేట
- 2026 మార్చి నాటికి దేశాన్ని మావోయిస్ట్ రహితంగా మార్చాలన్నది కేంద్రం లక్ష్యం



## లోయలో పడిన ఆర్మీ వాహనం..

- 10 మంది సైనికులు మృతి
- జమ్మూకశ్మీర్ లోని దోడా జిల్లాలో ఘోర ప్రమాదం
- 200 అడుగుల లోతులోకి పడిపోయిన బుల్లెట్ ప్రూఫ్ వాహనం
- గాయపడిన సైనికులు మిలిటరీ ఆసుపత్రికి తరలింపు

# ఫ్యూచర్ సిటీలో ఏఐ డేటా సెంటర్



- రూ.5వేల కోట్లతో పెట్టుబడి
- దావోస్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఎండీతో సీఎం భేటీ
- ఏటా హైదరాబాద్‌లో ఔజుఖీ ఫాలోఅప్ సదస్సు నిర్వహించాలని విజ్ఞప్తి
- ఫ్యూచర్ సిటీలో ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు చేయనున్న యూపీసీ వోల్ట్
- హైదరాబాద్‌లో మానవ వనరులు
- రూ.623 కోట్ల పెట్టుబడి.. ష్నైడర్ ఎలక్ట్రిక్ విస్తరణ

దావోస్

స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇవాళ వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఎండీ జెరెమీ జర్గెన్స్‌తో భేటీ అయ్యారు. ఏటా హైదరాబాద్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఫాలో అప్ సదస్సు నిర్వహించాలని కోరారు. ముఖ్యమంత్రి ప్రతిపాదనపై స్పందించిన వరల్డ్ ఎకనమిక్ ఫోరం బృందం వివిధ దేశాల నుంచి ప్రతిపాదనలు వస్తున్నాయని, త్వరలో నిర్ణయం తీసుకుంటామని

- మిగతా3లో



## దావోస్.. డెస్టినేషన్ మీటింగ్ అడ్డలా మారింది

- రాష్ట్ర బీజేపీ చీఫ్ రామచందర్ రావు
- సింగరేణి నైనీ కోల్ బ్లాక్ టెండర్ల అవకతవకలపై విచారణ జరగాల్సిందే
- కాంగ్రెస్ నేతలు దావోస్ వెళ్లి ఏం చేస్తున్నారు
- బీజేపీ అగ్రనేతలతో రెండు ఉమ్మడి జిల్లాలకు ఒకటి చొప్పున ఐదు భారీ బహిరంగ సభలకు ప్లాన్ చేస్తున్నాం
- జేపీ నడ్డా, రాజ్‌నాథ్ సింగ్ లాంటి వారి సభల కోసం బీఎల్ సంతోష్‌కి ప్రతిపాదనలు పంపాం

హైదరాబాద్

తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్ కావాలని బీజేపీపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని ఆరోపించారు రాష్ట్ర బీజేపీ చీఫ్ రామచందర్ రావు. సింగరేణి నైనీ కోల్ బ్లాక్ టెండర్ల అవకతవకలపై విచారణ జరగాల్సిందేనని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేతలు దావోస్ వెళ్లి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ పదాధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ తీరుపై ప్రధానంగా చర్చించారు. రాష్ట్ర కమిటీ సభ్యులకు

- మిగతా3లో

## రైతుల తర్వాత ఇప్పుడు కార్మికులా?

- నల్ల చట్టాల మాదిరిగానే కొత్త కుట్ర
- అదానీ, అంబానీల కోసమే ఇదంతా
- మహాత్మా గాంధీ పేరును చెరిపేసే ప్రయత్నం
- కొన్నేళ్ల క్రితం మోదీ ప్రభుత్వం మూడు నల్ల వ్యవసాయ చట్టాలను తెచ్చింది
- బడ్జెట్ సమావేశాల్లో తేల్చుకుంటాం: మల్లికార్జున ఖర్గే



## సీరియల్‌లా ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ

- మేము ఏ తప్పూ చేయలేదు ఎవరికీ భయపడేది లేదు
- మాజీ మంత్రి కేటీఆర్
- ఫోన్ ట్యాపింగ్ ప్రభుత్వాలు చేయవు పోలీసు వ్యవస్థ చేస్తుంది
- సిట్ విచారణకు కచ్చితంగా హాజరవుతానన్న కేటీఆర్
- ఫోన్ ట్యాపింగ్‌లు ప్రభుత్వాలు చేయవని, పోలీసు వ్యవస్థ చేస్తుంది
- ఆర్ఆర్ ట్యాక్స్, బొగ్గు కుంభకోణంపై మాత్రం ఎలాంటి సిట్ ఉండదు
- రాష్ట్రం ఫిర్యాదు చేస్తే సీబీఐ దర్యాప్తునకు ఆదేశిస్తాం



హైదరాబాద్

ఫోన్ ట్యాపింగ్ కేసులో రేపు సిట్ విచారణకు కచ్చితంగా హాజరవుతానని, పోలీసు అధికారులను కూడా తాను కొన్ని ప్రశ్నలు అడుగుతానని మాజీమంత్రి కేటీఆర్ తెలిపారు. తన ఫోన్ ట్యాప్ అవుతుందా? అని సిట్ అధికారులను అడుగుతానని చెప్పారు. తాము ఏ తప్పూ చేయలేదుని, ఎవరికీ భయపడేది లేదని తేల్చి చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో ఆయన స్పందించారు. ఈ మేరకు సిరిసిల్లలో విలేకరుల

- మిగతా3లో




## అంతరిక్షం అంటే నక్షత్రాలు, గ్రహాలే కాదు

- దేశాల హద్దులు లేకుండా మనమంతా ఒకే గ్రహంపై ఉన్నామన్న భావన కలుగుతుంది
- దిల్లీ ఐఐటీలో ఏర్పాటు చేసిన 'ది మేకింగ్ ఆఫ్ యాన్ ఆస్ట్రోనట్' ప్రోగ్రామ్‌లో సునీతా విలియమ్స్ ప్రసంగం - స్పేస్ సైన్స్, తన అనుభవాన్ని పంచుకుని విద్యార్థులకు ప్రేరణ కలిగిస్తూ
- "ప్రస్తుతం మానవ అంతరిక్ష పరిశోధనకు చాలా ప్రత్యేకమైన సమయం
- నిజ జీవితంలో ఉన్నట్లే ప్రతి స్పేస్ మిషన్‌కూ ఎత్తుపల్లాలు ఉంటాయి
- కానీ ప్రతీ అనుభవం మనల్ని రాబోయే సవాళ్లను ఎదుర్కొనేందుకు మెరుగుపరుస్తుంది

# మహాలక్ష్మి పథకం కోసం స్మార్ట్‌కార్డ్

- మహాలక్ష్మి పథకాన్ని మరింత సమర్థంగా అమలు చేయనున్న ఆర్టీసీ
- మహిళలకు స్మార్ట్‌కార్డులు జారీ చేసేందుకు కార్యాచరణ
- 5 లక్షల మందితో పైలట్ ప్రాజెక్టు
- ప్రతి ప్రయాణికురాలికి 16 అంకెల యూఐడీ నంబర్
- అర్హత లేని ప్రయాణికుల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు అవకాశం
- ప్రయాణ దూరం, రూట్, సమయాలపై కచ్చితమైన సమాచారం ఉంటుంది
- గ్రామం, మండలం, జిల్లా, జోన్ వారీ వినియోగ సమాచారం లభ్యమవుతుంది



హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్న విషయం తెలిసిందే. పథకం అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఎంతోమంది మహిళలు సద్వినియోగం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో మరింత సమర్థంగా అమలు చేసేందుకు తెలంగాణ ఆర్టీసీ స్మార్ట్‌కార్డుల జారీకి సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించిన కార్యాచరణ వివరాలను ఆ సంస్థ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. చిప్‌తో కూడినటు వంటి ఈ స్మార్ట్‌కార్డుల తయారీకి రూ.75 కోట్లు అందించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్టీసీ విజ్ఞప్తి చేసింది. స్మార్ట్‌కార్డ్ జారీలో భాగంగా ప్రతి ప్రయాణికురాలికి 16 అంకెల యూఐడీ నంబర్ ఇస్తారు. కార్డు ముందుభాగం ఎడమ వైపు లబ్ధిదారు పేరు, గ్రామం, మండలం, జిల్లా తదితర వివరాలు ఉంటాయి. కుడివైపు ఫోటో ఉంటుంది. వెనుక భాగంలో ఉచిత బస్సు పథకానికి సంబంధించిన నియమ నిబంధనలు పొందుపరిచారు. తెలంగాణ

- మిగతా3లో

## సంపాదకీయం

# గ్రీన్‌లాండ్‌లో ట్రంప్‌కి కావలసిందేమిటి?

ప్రపంచ భద్రతకు గ్రీన్‌లాండ్ కీలకం, వెనక్కి తగ్గేది లేదంటున్నారు ట్రంప్. వెనిజువెలా తర్వాత ట్రంప్ గ్రీన్‌లాండ్‌పై కన్నేయడంతో ప్రపంచం నివ్వెరపోతోంది. ఇదిలా ఉంటే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఓ వైపు యూరప్ దేశాలతో వ్యాపారం కోసం ఒప్పందాలు చేసుకుంటూ.. మరోవైపు వారిపైనే సుంకాలు విధిస్తానని బెదిరింపులకు దిగడంతో ట్రంప్‌కు ఆయా దేశాలు షాకిచ్చాయి. అమెరికాతో కుదుర్చుకుంటున్న ట్రాన్స్ అట్లాంటిక్ వాణిజ్య ఒప్పందానికి బ్రేక్ వేశాయి. వెనెజువెలా అధ్యక్షుడు మదురోపై దాడిచేసి ఎత్తుకొచ్చిన ఘటనను వారికి గుర్తు చేస్తున్నారు. అయితే యూరప్ దేశాలు మాత్రం ఈ బెదిరింపులకు లొంగేందుకు సిద్ధంగా లేవు. దీంతో గ్రీన్‌లాండ్‌పై ట్రంప్ బెదిరింపులకు నిరసనగా..యూరోపియన్ పార్లమెంట్ అమెరికాతో గత జులైలో సంతకం చేసిన వాణిజ్య ఒప్పందం అమలును తాత్కాలికంగా నిలిపేసింది. ట్రంప్, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్ మధ్య గతజులైలో వాణిజ్య ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం ఇయు వస్తువులపై అమెరికా సుంకాలను 15 శాతానికి పరిమితం చేయాలని నిర్ణయించారు. బ్లాక్ అమెరికన్ ఎగుమతులపై సుంకాలను కూడా తగ్గించారు.అయితే ఇప్పుడు గ్రీన్‌లాండ్ కబ్జా కోసం చేస్తున్న ప్రయత్నాలతో తాజా పరిణామాలు ట్రంప్‌కి షాకిచ్చాయనే చెప్పాలి. ఆర్కిటిక్ ద్వీపమైన గ్రీన్‌లాండ్‌లో మోహరింపు కోసం దళాలను పంపిన యూరోపియన్ దేశాలపై ట్రంప్ అదనంగా 10% సుంకాన్ని ప్రకటించారు. జూన్ 1 నుండి ఇది 25 శాతానికి పెరుగుతుందని, గ్రీన్‌లాండ్ పూర్తి కొనుగోలు కోసం ఒక ఒప్పందం కుదిరే వరకు అమలులో ఉంటుందని తెలిపారు. గ్రీన్‌లాండ్ పేరు వెనుక కారణం చారిత్రక మార్కెటింగ్ వ్యూహంగానే భావించాలి. దీనిపేరుకు విరుద్ధంగా ఇది నాలుగింట మూడు వంతులు మంచుతో కప్పబడి ఉంది, అయినప్పటికీ పురాతన కాలంలో పచ్చగా ఉండేదని, ప్రస్తుతం ఖనిజ వనరులు, వ్యూహాత్మక ప్రాముఖ్యత, పునరుత్పాదక ఇంధన వనరులు వంటి కారణాల వల్ల దీనికి ప్రాముఖ్యత పెరిగింది. గ్రీన్‌లాండ్ ప్రాంతం ఆర్కిటిక్ ప్రాంతంలో ఉన్నందున, ఇది అమెరికాకు రక్షణ వ్యూహాల్లో ముఖ్యమైనది. ఇక్కడ విలువైన ఖనిజాలు అంటే గ్రాఫైట్, లిథియం, టైటానియం వంటివి, రత్నాలు విరివిగా లభిస్తాయి. ప్రపంచంలోనే అత్యధిక శాతం పునరుత్పాదక ఇంధనాన్ని ముఖ్యంగా జలవిద్యుత్‌కి ఇది ఎంతో ఉపయోగకరమయింది. ప్రపంచంలోనే అతిపెద్ద ద్వీపం, డెన్మార్క్ రాజ్యానికి స్వయం 1979లో డెన్మార్క్ దీనికి స్వాతంత్ర్యాన్ని ప్రసాదించింది. ప్రపంచంలోని అతి పెద్ద దీవి ఇది. అంటార్కిటికా తరువాత అత్యధికంగా ఐస్‌పొరతో నిండిన భూభాగం ఇదే. ట్రంప్ గ్రీన్‌లాండ్ స్వాధీన హెచ్చరికల నేపథ్యంలో తాము డెన్మార్క్ యూనియన్‌లోనే కొనసాగుతామని గ్రీన్‌లాండ్ ప్రధాని జెన్స్ ఫ్రెడెరిక్ నీల్సన్ విస్పష్ట ప్రకటన చేశాడు. అమెరికా, డెన్మార్క్‌లలో ఏ దేశంతో కొనసాగుతారని తమకు ఎంపిక అవకాశం ఇస్తే తాము యూరోపియన్ యూనియన్‌లో భాగంగానే ఉంటామన్నారు. అంతర్జాతీయ సంబంధాలను ఎప్పుడూ కూడా ఒక వ్యాపార ఒప్పందంగా భావించడం ట్రంప్ వైఖరిని స్పష్టం చేసింది. ఎవరైతే తన నిర్ణయాలకు మద్దతు ఇస్తారో వారికి సుంకాల నుంచి రాయితీలు ఇవ్వడం, వ్యతిరేకించే వారిపై పెనాల్టీలు వేయడం అనే ఎక్స్ఛేంజ్ లాజిక్‌ను ఆయన అనుసరిస్తున్నాడు. జాతీయ భద్రత అనే కార్డును ట్రంప్ ఇక్కడ బలంగా వాడుతున్నాడు. ఆర్కిటిక్ మహాసముద్రంలో రష్యా, చైనా ఉనికి పెరుగుతున్న సమయంలో గ్రీన్‌లాండ్ అమెరికాకు ఒక రక్షణ కవచంలా పనిచేస్తుందని అంతర్జాతీయ నిపుణులు చెబుతున్నారు. ట్రంప్ వ్యాఖ్యలపై నూక్‌లో చరిత్రలోనే అతిపెద్ద నిరసనలు చెలరేగాయి. 'గ్రీన్‌లాండ్ అమ్మకానికి లేదు' అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సంస్కృతిని, స్వయం ప్రతిపత్తిని కాపాడుకుంటామని గ్రీన్‌లాండ్ వాసులు స్పష్టం చేశారు. గ్రీన్‌లాండ్‌కు మద్దతుగా ఆ దేశంలో యూరోపియన్ కంట్రీస్ తమ సైనిక సిబ్బందిని మోహరించాయి. జర్మనీ 13 మంది సిబ్బందితో కూడిన నిఘా బృందాన్ని పంపింది. నార్వే ఇద్దరు సైనిక సిబ్బందిని, నెదర్లాండ్స్ ఒక నావికాదళ అధికారిని గ్రీన్‌లాండ్‌కు పంపాయి. అదే విధంగా యుకె కూడా ఒక సైనిక బృందాన్ని గ్రీన్‌లాండ్‌కు తరలించింది. ఫ్రాన్స్ 15మంది, స్వీడన్ ముగ్గురు, ఫిన్లాండ్ ఇద్దరు సైనికులను పంపాయి. యూరోపియన్ యూనియన్ దేశాలు అమెరికాకు వ్యతిరేకంగా గ్రీన్‌లాండ్‌లో సైన్యాన్ని మోహరించడం ప్రపంచ

# దేశభక్తికి ప్రతిరూపం నేతాజీ

భారతదేశ స్వాతంత్ర్య సమరంలో అహింసా మార్గంలోనే మాత్రమే కాదు పోరాట (సాయుధ) మార్గంనూ బ్రిటర్లపై పోరాడుదామని పిలుపిచ్చిన సమర సేనాని నేతాజీ సుభాష్. వలసవాదాన్ని ప్రతిఘటించడంలో ధైర్యంగా పోరాడటం చేయడంలో సుభాష్ చంద్రబోస్‌కు చేసిన కృషి అపూర్వం, అనన్య సామాన్యం, అజరామరం. ఇండియన్ సివిల్ సర్వీసెస్‌కు ఎంపికైనప్పటికీ తృణప్రాయంగా ఉద్యోగాన్ని వదులుకొని దేశానికి స్వాతంత్ర్యం తేవడమే ప్రథమ కర్తవ్యం అని ఉద్యమంలోకి అడుగుపెట్టిన స్వాతంత్ర్య పిపాసి. భారతీయుడు గౌరవప్రద జీవితాన్ని గడపేలా చేసేందుకు తనను తాను కట్టుబడి ఉన్న ఒక అద్భుతమైన వ్యక్తి."ఆజాద్ హిందూ ఫైజ్"ను స్థాపించి భారత్‌కు స్వాతంత్ర్యం తీసుకు రావడంలో కీలకపాత్ర వహించాడు. స్వాతంత్ర్యం రావాలంటే సొంత సైన్యంతో పాటు ఇతర దేశాల సహకారం కూడా అవసరమని భావించాడు. సుభాష్ బాబు మేథో పరాక్రమం, సంస్థాగత నైపుణ్యాలకు కూడా ప్రసిద్ధి చెందారు. ప్రతి భారతీయుడు గౌరవప్రదమైన జీవితాన్ని గడపేలా చేసేందుకు గాను తనను తాను కట్టుబడి ఉన్న ఒక అద్భుతమైన వ్యక్తి. సుభాష్ బాబు మేథో పరాక్రమం, సంస్థాగత నైపుణ్యాలకు కూడా ప్రసిద్ధి చెందారు. 2021నుండి నేతాజీ జన్మదినమైన జనవరి 23న ప్రతి సంవత్సరం అంతర్జాతీయ స్థాయిలో 'పరాక్రమ దివస్'గా జరపాలని కేంద్రం ప్రభుత్వం నిర్ణయించింది. భారత దేశానికి స్వాతంత్ర్యం రావడానికి అహింస మార్గంలో గాంధీ మార్గంలో కొందరు నాయకుల పోరాటం ఎంత ముఖ్యమో, సుభాస్ బోస్ పోరాట పటిమ అంతే ప్రధానం. తన జీవితంలో స్వార్థం లేకుండా దేశ స్వాతంత్ర్య సాధనే పరమార్థం గా, 12 దేశాలు తిరిగి అతి పెద్ద సైనిక బలగాన్ని ఏర్పాటు చేసి బ్రిటీష్ సామ్రాజ్యానికి వణుకు పుట్టించిన ఒక గొప్ప యుద్ధ వీరుడు సుభాష్ చంద్రబోస్. నివృత్తి కాని సందేహంగా ఆయన అదృశ్యం జరగక పోయి ఉంటే 1947 కంటే రెండు సంవత్సరాల ముందే స్వాతంత్ర్యం వచ్చి ఉండేదని చాలా మంది నమ్ముతారు. సుభాష్ చంద్రబోస్ జనవరి 23, 1897 లో ప్రభావతి దేవి, జానకి నాద్ బోస్ దంపతులకు కటక్‌లో జన్మించాడు. బాల్యం నుండే ఎక్కడ అన్యాయం జరిగిన ఎదురు నిలిచి అడిగేవాడు. ఇంటర్ చదివే రోజుల్లో "స్వేచ్ఛా సేవ సంఘ్" అనే సంస్థ ఏర్పాటు చేసి యువకులకు సమాజ సేవ, ధ్యానం, మానసిక ఆరోగ్యం కోసం వ్యాయామం వంటి అనేక అంశాల పైన ఉపన్యాసాలు ఇచ్చేవాడు. బోస్ కు స్వామి వివేకానంద అంటే ఎంతో ఇష్టం. ఇక 1919లో ఇండియన్ సివిల్ సర్వీసెస్ ఉత్తమ ర్యాంక్ సాధించి శిక్షణ కోసం ఇంగ్లాండ్ వెళ్ళాడు. 1920 లో ఇంగ్లాండ్ లో జరిగిన పరీక్షలో మెరిట్‌లో ఉత్తీర్ణుడైనాడు. అయితే జలియన్ వాలా భాగ్ వార్త తెలిసిన అతడికి మనసులో ఆవేదన కలిగి దానిని మధ్యలోనే వదిలేసి 1921 లో ఇండియా తిరిగి వచ్చాడు. తరువాత గాంధీజీ కలిసి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ లో చేరాడు. చిత్తరంజన్ దాస్ వద్ద పనిచేసే వాడు. ప్రిన్స్ ఆఫ్ వేల్స్ భారత దేశానికి వచ్చినప్పుడు నిరసన తెలిపినందుకు ఆర్నెల్లు జైలు శిక్ష విధించారు. ఇక అయన జైలు నుండే కలకత్తా శాసన సభకు ఎన్నికయ్యాడు. జైలులో నిరాహార దీక్ష వల్ల ఆరోగ్యం క్షీణించడం చూసి బ్రిటిష్ ప్రభుత్వం కొన్ని ఆంక్షలు విధిస్తు ఆయనను విడుదల చేసింది. ఆ తర్వాత బెంగాల్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, అఖిల భారత కాంగ్రెస్ సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. అలా దేశమంతా పర్యటిస్తూ ఆయన చేసే ప్రసంగాలకు లక్షలాది మంది ప్రేరితులయ్యారు. ఉప్పు సత్యాగ్రహ సమయంలో బోస్ ను నిర్బంధించడం కాకుండా దేశ బహిష్కరణ కూడా చేసారు. ఆ సందర్భంలో అయన యూరప్ లో పర్యటించి హిట్లర్, ముస్సోలిని వంటి మహనీయులను కలిసాడు. అయితే బోస్ హిట్లర్ ని కలసిన సందర్భంలో ఒక సంఘటన జరిగింది. హిట్లర్ కోసం వేచి చూస్తుండగా ఒక వ్యక్తి వచ్చి విషయం ఏమిటి అని అడుగగా నేను మీ బాస్ హిట్లర్ తో మాట్లాడాలని జవాబిచ్చాడు. అయితే కొద్దిసేపటికి వచ్చిన హిట్లర్ బోస్ తో చర్చలు చేసి వెళుతుండగా నీ వద్దకు "ముందుగా వచ్చిన వ్యక్తి హిట్లర్ కాదని నీకెలా తెలిసింది అని ప్రశ్నించిగా, నా భుజాన్ని తట్టే ధైర్యం హిట్లర్ కు తప్ప మరెవ్వరికీ లేదని" ఆయన జవాబిచ్చాడు. అయితే 1934 వ సంవత్సరంలో సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొని జైలు పాలై, ఆరోగ్యం దెబ్బతినడంతో చికిత్స నిమిత్తం ఆయనని ఆస్ట్రియాకు తరలించారు. ఇలా ఆస్ట్రియలో చికిత్స పొందుతున్న ఆయన యూరప్‌లో ఉన్న భారతీయ విద్యార్థులను ఏకం చేసి, వారు స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొనేలా చేయాలని బోస్ భావించాడు. "ద ఇండియన్ స్ట్రగుల్" అనే పుస్తకం రాసే సందర్భంలో ఇంగ్లీష్ వచ్చి టైప్ చేయగలిగే ఒక వ్యక్తిగా పరిచయమైన 23 ఏళ్ల ఎమిలీ షెంకెల్ అనే ఆస్ట్రియా యువతిని తన సహాయకురాలిగా నియమించు కోగా, ఎమిలీ 1934 జూన్ నుంచి బోస్‌తో కలిసి పని చేయగా, వారి మధ్య ప్రేమ చిగురించిందని చెపుతారు. స్వాతంత్ర్యం తప్ప వేరే ఆలోచన లేని బోస్ 1934–36 లో జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు అయినాక దేశమంతా తిరుగుతూ తన ఉపన్యాసాలతో దేశంలోనే అత్యంత ప్రజాధారణ కలిగిన నాయకుడయ్యాడు. ఇలా గొప్ప నాయకుడిగా ఉన్న సమయంలో కాంగ్రెస్ లో అంతర్గతగా జరిగిన కుట్రల కారణంగా 1939 లో ఆయనను కాంగ్రెస్ నుండి బహిష్కరించారు. ఆ తరువాత వెంటనే ఫార్వర్డ్ బ్లాక్ అనే పార్టీ ని స్థాపించి దేశం అంతటా పర్యటించగా ఆయనకి మద్దతుగా కొన్ని లక్షల్లో జనాలు అయన వెంట నడిచారు. ఇలా ఉద్యమ కారుడిగా ప్రజల్లో చైతన్యం నింపుతుండగా 1941 అరెస్ట్ చేసి తప్పనిసరి పరిస్థితుల్లో విడుదల చేసి గృహ నిర్బంధంలో ఉంచారు. కానీ అయన పథకం ప్రకారం హమ్మద్ జియా ఉల్ హక్ అనే మారు పేరుతో పాస్ పోర్ట్ సంపాదించి తప్పించుకుని తన వ్యక్తి గత సేవకుడు భగత్ రామ్ కు రహమత్ ఖాన్ అని పేరు పెట్టి కాబుల్ కి వెళ్ళాడు. అక్కడ ఉత్తం చంద్ మల్హోత్రా అనే వ్యాపారి ఆయనకి ఆశ్రయం కల్పించగా అక్కడ ఉంటూనే రష్యా, జర్మని, ఇటాలి దేశ రాయబారులతో మంతనాలు చేసాడు. 1941 మార్చ్ 18 న అక్కడి నుండి ఒర్లాండ్ అనే మారు పేరుతొ సమర్ఖండ్, మాస్కో ల మీదుగా బెర్లిన్ చేరుకొని జపాన్, ఇటలి, జెర్మని లకు చెందిన సైన్యాధికారులను కలుసు కున్నాడు. ఇలా చేరుకున్న బోస్ ను వారు స్వతంత్ర భారత రాయబారిగా గుర్తించారు. ఆ తరువాత బోస్ అక్కడే ఆజాద్ హింద్ ఫౌజ్ స్థాపించాడు. 1941 ఫిబ్రవరి 27 న బోస్ రేడియోలో ఇచ్చిన ప్రసంగం యావత్ దేశాన్ని కదిలించింది. ప్రపంచ యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో జపాన్ లోని ఆజాద్ హింద్ ఫౌజ్ సభ్యులు బోస్ ను అక్కడికి ఆహ్వానించగా 45 రోజుల పాటు జలాంతర్గామిలో ప్రయాణించి అక్కడ మత్సుడ అని పేరు మార్చు కున్నాడు. అక్కడ బోస్ ఇచ్చిన స్ఫూర్తిదాయకమైన ఉపన్యాసాలతో హింద్ ఫౌజ్ లో తండోప తండాలుగా సైనికులు చేరారు. ఇక్కడ మహిళలకు ప్రత్యేకంగా ఝాన్సీ లక్ష్మీ బాయి రెజిమెంట్ ను ఏర్పాటు చేసి మహిళలకు యుద్ధ శిక్షణ నివ్వడం మొదలు పెట్టారు. ఇలా ఎంతో శక్తివంతమైన సైన్యాన్ని తయారుచేసి చలో ఢిల్లీ అనే నినాదంతో ప్రత్యక్ష యుద్ధానికి దిగి జపాన్ సహకారంతో ఇంఫాల్, అండమాన్, నికోబార్ లను జయించి అక్కడ స్వతంత్ర భారత పతాకాన్ని ఎగురవేసి ముందుకు సాగుతుండగా ఆయనకి కష్టాలు మొదలయ్యాయి. తనకు అండగా నిలిచినా జపాన్ దేశం యుద్ధంలో ఓటమికి చేరువైంది. ఇక బర్మాలో వరదల కారణంగా ఆరోగ్యం క్షీణిస్తూ అనేక మంది సైనికులు మరణించారు. ఆ సమయంలో రష్యా దాడికి దిగి, అణుబాంబు వేయడంతో జపాన్ అతలాకుతలం అయింది. అప్పటివరకు తనకు అండగా ఉన్న జపాన్ అలా అవ్వడంతో బోస్ నిస్సహాయు డైనాడు. ఆ తరువాత సింగపూర్, రంగూన్ సైనిక దళాలకు బ్రిటిష్ దళాలు దగ్గరయ్యాయి. 1945వ సంవత్సరం ఆగస్టు భారత జాతీయ సైన్యానికి సహకరించిన జపాన్ సైనిక దళాలు బ్రిటిష్ సైనిక దళాలకు శరణుజొచ్చాయి. దీనితో నేతాజీ సింగపూర్‌ను వీడి వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. 1945 ఆగస్టు 18 వ తేదీన తైపీలో జరిగిన విమాన ప్రమాదంలో అయన మరణించి నట్లుగా రేడియో లో ప్రకటించారు.ఇక తైవాన్ కి సంబంధించిన ఎయిర్ క్రాష్ లో చంపేశారని కొందరు, ఆగస్ట్ 1945 తర్వాత నేతాజీ రష్యాలో ఉన్నాడని చెప్పడం వల్ల అతను చనిపోలేదని మరికొందరు, సుభాష్ చంద్రబోస్ మారువేశంలో మన దేశం లోనే ఉన్నాడని ఇలా ఎన్నో రకాలుగా చెప్పుకునేవారు. సైన్యానికి శిక్షణ ఇచ్చేప్పుడు... "నేను మీకు కేవలం ఆకలి, దాహం, కష్టం, మృత్యువును మాత్రమే ఇవ్వగలను. నాకు మీ రక్తాన్ని ఇవ్వండి. మీకు స్వతంత్రాన్ని ఇస్తాను"... అని సైన్యంలో విశ్వాసాన్ని చిగురించేలా చేసేవాడు. దేశం కోసం ఎవరు చేయని విధంగా అహింస వలన కాదు, పోరాడితేనే స్వాతంత్ర్యం వస్తుందని కట్టు బట్టల్తో జపాన్ వెళ్లి ఇండియన్ ఆర్మీని సిద్ధం చేసి బ్రిటిష్ సైన్యానికి గుండెల్లో రైళ్లు పరిగెత్తించి చివరికి స్వాతంత్ర్య చూడ కుండానే కనుమరుగైన యోధుడు బోస్. నేతాజీ సుభాస్ చంద్రబోస్ యొక్క విలువైన వారసత్వాన్ని, చరిత్రను పరిరక్షించడానికి భారత ప్రభుత్వం అనేక రకాల చర్యలను చేపట్టింది. న్యూఢిల్లీలోని ఎర్రకోట వద్ద నేతాజీపై మ్యూజియం ఏర్పాటు చేశారు. దీనిని 23.01.2019న ప్రధాని ప్రారంభించారు. దేశంలో చారిత్రాత్మక విక్టోరియా మెమోరియల్ భవనంలో కోల్‌కతాలో నేతాజీపై లైట్ అండ్ సౌండ్ షో శాశ్వత ప్రదర్శన ఏర్పాటు చేయడానికి ప్రణాళిక చేయ బడింది. అండమాన్, నికోబార్‌లోని 3 ద్వీపాలకు పేరు మార్చి ప్రధాని మోదీ రాస్ ద్వీపానికి నేతాజీ సుభాష్ "చంద్రబోస్ ద్వీపంగా" పేరు మార్చారు.

# జనతా పార్టీ ఆవిర్భావ నేపథ్యం

49 ఏళ్ళ క్రితం ఇదే రోజున అంటే 1977 జనవరి 23న 'జనసంఘ్', 'భారతీయ లోక్‌దళ్', కాంగ్రెస్ (ఓ), 'స్వతంత్ర పార్టీ', 'సోషలిస్టు పార్టీ'లు కలిసి నేటి భారతీయ జనతా పార్టీ పూర్వపు భాగస్వామియైన 'జనతాపార్టీ'గా ఏర్పడ్డాయి. ఈ నేపథ్యాన్ని పరిశీలిస్తే.. 1951 అక్టోబర్ 21న ఢిల్లీలో శ్యాంప్రసాద్ ముఖర్జీ భారతీయ జనసంఘ్ పార్టీని ఏర్పాటు చేశాడు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ భావనలపై ఏర్పాటు చేసిన ఈ పార్టీకి ఎన్నికల చిహ్నంగా దీపం గుర్తు లభించింది. 1952లో జరిగిన పార్లమెంటు ఎన్నికలలో ఈ పార్టీకి 3 లోక్‌సభ స్థానాలు లభించాయి. అందులో ఒక స్థానం పార్టీ స్థాపకుడైన శ్యాంప్రసాద్ ముఖర్జీ విజయం సాధించింది. 1967 తరువాత ఈ పార్టీ బలపడింది. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ భావనలపై ఆధారపడిన పార్టీ కావడంతో ఈ పార్టీ హిందూ జాతీయవాద లక్షణాలను కలిగిఉంది. ఈ పార్టీలో ప్రముఖ స్థానాలను కలిగిన నాయకులు కూడా ఆర్.ఎస్.ఎస్ కార్యకర్తలే. 1964లో ఏర్పడిన విశ్వ హిందూ పరిషత్తు ఈ పార్టీకి సన్నిహితంగా ఉంది. జవహర్ లాల్ నెహ్రూ కాలంలో ఆయన సోషలిస్టు భావనలకు విసుగు చెందిన పలు భారతీయ జాతీయ కాంగ్రెస్ నేతలు ఈ పార్టీ పట్ల ఆకర్షితులయ్యారు. రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలలో ఈ పార్టీ ఉనికి నిలుపుకుంది. 1975లో దేశంలో ఇందిరా గాంధీ ప్రభుత్వం అత్యవసర పరిస్థితి విధించడంతో విపక్షాలకు చెందిన పలు నేతలను ఎలాంటి కారణం లేకుండానే జైళ్ళకు తరలించారు. అదే కాలంలో భారతీయ జనసంఘ్ ప్రముఖ నేతలు కూడా జైలుజీవితం గడిపారు. 1977లో అత్యవసర పరిస్థితిని తొలిగించి ఎన్నికలు జరుపడంతో దేశంలో మారిన రాజకీయ సమీకరణాల వలన భారతీయ జనసంఘ్‌తో పాటు భారతీయ లోక్‌దళ్, కాంగ్రెస్ (ఓ), సోషలిస్ట్ పార్టీలు కలిసి ఉమ్మడిగా జనతా పార్టీని ఏర్పాటు చేసుకున్నాయి. 1951లో శ్యాంప్రసాద్ ముఖర్జీ చే స్థాపించబడిన జనసంఘ్ 1977లో జనతా పార్టీలో విలీనం చేయబడింది. ఎన్నికలలో ఈ పార్టీ విజయం సాధించడంతో భారతదేశంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన తొలి కాంగ్రెసేతర ప్రభుత్వంగా జనతా ప్రభుత్వం పేరు సంపాదించింది. మురార్జీ దేశాయ్ నేతృత్వం వహించిన జనతా ప్రభుత్వంలో పూర్వపు జనసంఘ్ నేతలైన అటల్ బిహారీ వాజపేయికి విదేశాంగ మంత్రిత్వ శాఖ లభించగా, లాల్ కృష్ణ అద్వానీకి సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ లభించింది. జనతా ప్రభుత్వం విచ్ఛిన్నం కావడంతో 1980



లోక్‌సభ ఎన్నికల ముందు జనసంఘ నేతలు జనతా పార్టీ నుండి బయటకు వచ్చి భారతీయ జనతా పార్టీ పేరుతో ఎప్రిల్ 6న కొత్త రాజకీయ పార్టీని స్థాపించారు. ప్రస్తుతం భారతీయ జనతా పార్టీ భారతదేశంలో ప్రముఖ జాతీయ రాజకీయ పార్టీలలో ఒకటి. రాజకీయ కురు పితామహుడు అటల్ బిహారీ వాజపేయి భారతీయ జనతా పార్టీకి తొలి అధ్యక్షుడిగా పనిచేశారు. 1980లో ప్రారంభించిన ఈ పార్టీ దేశములోని హిందూ అధికసంఖ్యాక వర్గం యొక్క మత సాంఘిక, సాంస్కృతిక విలువల పరిరక్షణను ధ్యేయంగా చెప్పుకుంటుంది. సాంప్రదాయ సాంఘిక నియమాలు, దృఢమైన జాతీయ రక్షణ దీని భావ జాలాలు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రధానపాత్ర పోషిస్తున్న సంఘ్ పరివార్ కుటుంబానికి చెందిన వివిధ రకాల హిందూ జాతీయవాద సంస్థలు భారతీయ జనతా పార్టీకి కార్యకర్తల స్థాయిలో గట్టి మద్దతు ఇస్తున్నాయి. 1989 తరువాత ఈ పార్టీ బలపడింది. అటల్ బిహారీ వాజపేయి 3 సార్లు ప్రధానమంత్రి పదవిని కూడా చేపట్టినారు. భాజపా, అనేక ఇతర పార్టీల మద్దతుతో 1999 నుండి 2004 వరకు భారతదేశ ప్రభుత్వము భారత కేంద్ర ప్రభుత్వాన్ని పాలించింది. దాని సీనియర్ నాయకులైన అటల్ బిహారీ వాజపేయి ప్రధాని గాను, లాల్ కృష్ణ అద్వానీ ఉప ప్రధాన మంత్రి గానూ పనిచేశారు. జాతీయ ప్రజాస్వామ్య కూటమిలో ప్రధాన పార్టీ అయిన భాజపా, భారత పార్లమెంటులో ప్రధాన ప్రతిపక్షముగా 2014 మే వరకు కొనసాగింది. సార్వత్రిక ఎన్నికలలో లోక్ సభ లోని 543 స్థానాలకు మునుపెన్నడూ లేనన్ని 281 స్థానాలు గెలుచుకున్న భాజపా (మిత్ర పక్షాలతో కలిసి జాతీయ ప్రజాస్వామ్య కూటమికి 337 స్థానాలు) నరేంద్ర మోడీ నాయకత్వంలో అధికారం చేబట్టింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో లోక్ సభ ఎన్నికల్లో 303 స్థానాల్లో విజయం సాధించింది. 2024 ఎన్నికల్లో 543 స్థానాలలో అధికారంలో ఉన్న ఎన్‌డీఏ కూటమి 293 స్థానాలతో మెజారిటీ సాధించింది. ఇందులో బీజేపీ పార్టీ స్వంతంగా గెలుచుకున్న 240 సీట్లు ఉన్నాయి, ప్రతిపక్ష ఇండియా కూటమికి 234 సీట్లు వచ్చాయి, ఇందులో కాంగ్రెస్ పార్టీకి స్వంతంగా గెలుచుకున్న 99 స్థానాలు ఉన్నాయి. 2024 జూన్ 9న, భారతీయ జనతా పార్టీ మెజారిటీని కోల్పోయినప్పటికీ, జాతీయ ప్రజాస్వామ్య కూటమికి నాయకుడిగా ఎన్నికై, ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ ప్రమాణ స్వీకారం చేశారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో మళ్లీ అధికారం చేపట్టింది. ప్రస్తుతం మూడవ సారి నరేంద్ర మోడీ ప్రధానిగా ప్రభుత్వంగా కొనసాగుతున్నది.

ధర్మఘంట

# రైతుల తర్వాత ఇప్పుడు కార్మికులా?



కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం పేదల పొట్టకొట్టేలా వ్యవహరిస్తోందని, గతంలో రైతులపై ప్రయోగించిన అస్త్రాలనే ఇప్పుడు నిరుపేద కార్మికులపై ప్రయోగిస్తోందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి, దాని స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకురావడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆయన ఆరోపించారు. గురువారం న్యూఢిల్లీలో జరిగిన 'జాతీయ ఉపాధి హామీ కార్మికుల సదస్సు'లో పాల్గొన్న రాహుల్, మోదీ సర్కార్ తీరును ఎండగట్టారు. గతంలో నల్ల వ్యవసాయ చట్టాలను తెచ్చి రైతులను ఇబ్బంది పెట్టినట్లే, ఇప్పుడు కొత్త చట్టంతో కూలీలను ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు.

**రైతుల్లాగే పోరాడాలి**

నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతులు పోరాడినట్లు కార్మికులు ఉద్యమించాలని రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. "కొన్నేళ్ల క్రితం మోదీ ప్రభుత్వం మూడు నల్ల వ్యవసాయ చట్టాలను తెచ్చింది. అప్పుడు దేశంలోని రైతులంతా ఏకమయ్యారు. ప్రభుత్వంపై ఉమ్మడిగా ఒత్తిడి తెచ్చారు. దీంతో కేంద్రం దిగిరాక తప్పలేదు. ఆ చట్టాలను వెనక్కి తీసుకుంది. ఇప్పుడు మీ వంతు వచ్చింది. కార్మికులంతా ఏకమైతేనే ప్రభుత్వం దిగి వస్తుంది. కొత్తగా తెచ్చిన వీబీ-జీ రామ్ జీ చట్టాన్ని రద్దు చేసేదాకా పోరాడాలి" అని రాహుల్ పిలుపునిచ్చారు. దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్నారని రాహుల్ విమర్శించారు. "మోదీ కోరుకుంటున్న 'భారతదేశ మోడల్' చాలా ప్రమాదకరమైనది. దేశంలోని ఆస్తులన్నీ కొద్దిమంది చేతుల్లోనే ఉండాలి. పేద ప్రజలంతా అదానీ, అంబానీలపై ఆధారపడి బతకాలి. ఇదే బీజేపీ విధానం. ఒక రాజు మాత్రమే అన్ని నిర్ణయాలు తీసుకునేలా వ్యవస్థను మారుస్తున్నారు. పేదలకు హక్కులు ఉండకూడదన్నదే వారి ఉద్దేశం" అని రాహుల్ దుయ్యబట్టారు.

**పంచాయతీల అధికారాలకు కత్తెర**

ఉపాధి హామీ పథకం కాన్సెప్ట్‌ను చంపేస్తున్నారని రాహుల్ ఆవేదన వ్యక్తం చేశారు. "యూపీఏ హయాంలో మేం తెచ్చిన ఉపాధి హామీ చట్టం పేదలకు హక్కు కల్పించింది. ఎవరికైతే పని అవసరమో వారికి కచ్చితంగా పని దొరకాలి. ఈ పథకం అమలు బాధ్యత పంచాయతీ రాజ్ వ్యవస్థ చేతిలో ఉండేది. కానీ ఇప్పుడు మోదీ ప్రభుత్వం ఆ కాన్సెప్ట్‌ను చంపేస్తోంది. కొత్త చట్టం ప్రకారం, పని ఎవరికి ఇవ్వాలి? నిధులు ఎవరికి ఇవ్వాలి? అనేది కేంద్రమే నిర్ణయిస్తుంది. బీజేపీ పాలిత రాష్ట్రాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. కార్మికులకు దక్కాల్సిన డబ్బును కాంట్రాక్టర్లకు, అధికారులకు మళ్లిస్తారు" అని రాహుల్ ఆరోపించారు.

**'పేరు కూడా గుర్తురావడం లేదు'**

కొత్త చట్టం పేరుపై రాహుల్ సెటైర్లు వేశారు. కేంద్రం తెచ్చిన 'వికసిత్ భారత్ - గ్యారెంటీ ఫర్ రోజ్గార్ అజీవికా మిషన్' పేరును పలకడానికి రాహుల్ ఇబ్బంది పడ్డారు. "ఆ చట్టం పేరు నాకు గుర్తురావడం లేదు. ఏంటది?" అని సదస్సులో ఉన్నవారిని అడిగారు. అంత క్లిష్టమైన పేరు పెట్టి, అసలు పథకాన్ని నీరుగారుస్తున్నారని ఎద్దేవా చేశారు.

**మహాత్ముడిని మర్చిపోయేలా - ఖర్గే**

ఈ సదస్సులో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ప్రసంగించారు. "ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేయడం అంటే, మహాత్మా గాంధీ పేరును ప్రజల జ్ఞాపకాల నుంచి చెరిపేయడమే. గ్రామ స్వరాజ్ అనే భావనను దెబ్బతీయడమే వీరి లక్ష్యం. కొత్త చట్టాన్ని అమలు చేయకుండా అడ్డుకోవా ల్సిన బాధ్యత మన అందరిపై ఉంది. త్వరలో జరగబోయే పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తుతాం. దీనిపై ప్రభుత్వం అంతు చూస్తాం. గట్టిగా పోరాడతాం" అని ఖర్గే స్పష్టం చేశారు.

**మట్టితో ప్రతిజ్ఞ**

సదస్సుకు దేశం నలుమూలల నుంచి వచ్చిన ఉపాధి హామీ కార్మికులు తమ వెంట పిడికెడు మట్టిని తీసుకొచ్చారు. రాహుల్ గాంధీ, ఖర్గేల సమక్షంలో ఆ మట్టిని మొక్కల్లో వేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. తమ హక్కుల కోసం పోరాడతామని ప్రతిజ్ఞ చేశారు. కాగా కాంగ్రెస్ పార్టీ జనవరి 10 నుంచి 'ఎమ్‌జీఎన్‌ఆర్‌ఈజీఏ బచావో సంగ్రామ్' పేరుతో దేశవ్యాప్త ఉద్యమాన్ని చేపట్టింది. 45 రోజుల పాటు ఈ నిరసనలు కొనసాగుతాయి. కొత్త చట్టాన్ని రద్దు చేసి, పాత ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేస్తోంది. పని హక్కును కాపాడాలని, పంచాయతీలకే అధికారాలు ఇవ్వాలని కోరుతోంది.

# అసెంబ్లీ నుంచి గవర్నర్ గెహ్లాట్ వాకౌట్!
# గందరగోళంలో శాసనసభ శీతాకాల సమావేశాలు!

**చెన్నై :** గవర్నర్ అసెంబ్లీకి హాజరు కాకపోతే తదుపరి చట్టపరమైన చర్యల కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించడానికి సిద్ధరామయ్య ప్రభుత్వం సిద్ధమైంది. అయితే, అధికార కాంగ్రెస్ నాయకుల అంచనాలకు భిన్నంగా, గవర్నర్ అసెంబ్లీకి వచ్చి తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రసంగంలోని మొదటి, చివరి పేరాల్లోని కొన్ని పంక్తులను మాత్రమే చదివి, ఆ తర్వాత వెళ్లిపోయారుకర్ణాటక రాజకీయ సంక్షోభంలో చిక్కుకుంది. జనవరి 22న జరగనున్న రాష్ట్ర శాసనసభ ఉమ్మడి సమావేశంలో ప్రసంగించడానికి గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ నిరాకరించారు. అసెంబ్లీ సమావేశాలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రసంగంలోని సుమారు 11 పేరాలపై గవర్నర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈలోగా, గవర్నర్ ప్రసంగం లేకుండా అసెంబ్లీ సమావేశం చట్టబద్ధంగా ప్రారంభం కావచ్చో లేదో పరిశీలిద్దాం.కేంద్ర ప్రభుత్వం పథకం పేరు మార్చడాన్ని నిరసిస్తూ కర్ణాటక ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశం గవర్నర్, రాష్ట్ర ప్రభుత్వం మధ్య వివాదానికి దారితీసింది. గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ అసెంబ్లీ సమావేశానికి హాజరవుతారా లేదా అనే దానిపై అనిశ్చితి నెలకొంది. అయితే, గవర్నర్ అక్కడికి చేరుకుని ప్రభుత్వ ప్రసంగం పూర్తి కాపీని చదవకుండానే వెళ్లిపోయారు. పాలక పార్టీ ఎమ్మెల్యేలు తీవ్రంగా నిరసన వ్యక్తం చేసి నినాదాలు చేశారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తరువాత దీనిని ప్రజాస్వామ్యానికి చీకటి దినంగా పేర్కొంటూ ఒక ప్రకటన విడుదల చేశారు. దీంతో శాసనసభ గందరగోళంలో పడింది.అంతుకుముందు సిద్ధరామయ్య ప్రభుత్వం తయారు చేసిన ప్రసంగం నుండి 11 అంశాలను తొలగించాలని గవర్నర్ సూచించారు. అయితే, ప్రభుత్వం దీనిని తిరస్కరించింది. అందువల్ల, ప్రసంగం చేయడానికి గవర్నర్ హాజరు కావడం సందేహాస్పదంగా మారింది. గవర్నర్ అసెంబ్లీకి హాజరు కాకపోతే తదుపరి చట్టపరమైన చర్యల కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించడానికి సిద్ధరామయ్య ప్రభుత్వం సిద్ధమైంది. అయితే, అధికార కాంగ్రెస్ నాయకుల అంచనాలకు భిన్నంగా, గవర్నర్ అసెంబ్లీకి వచ్చి తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రసంగంలోని మొదటి, చివరి పేరాల్లోని కొన్ని పంక్తులను మాత్రమే చదివి, ఆ తర్వాత వెళ్లిపోయారు.గవర్నర్ వెళ్లిపోతుండగా, ఎమ్మెల్సీ బికె హరిప్రసాద్ ఆయనను ఆపడానికి ప్రయత్నించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గవర్నర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో అసెంబ్లీలో గందరగోళం నెలకొంది. స్పీకర్ యుటి ఖాదర్, స్పీకర్ హ్వొరట్టి, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గవర్నర్‌కు వీడ్కోలు పలికారు. గవర్నర్ కారు ఎక్కగానే, ఎమ్మెల్సీ ఇవాన్ డిసౌజా, మరికొందరు రాజ్యాంగాన్ని ఉల్లంఘించిన గవర్నర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఇదిలావుంటే, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 176 గవర్నర్ ప్రసంగం అవసరమైన పరిస్థితులను నిర్దేశిస్తుంది. గవర్నర్ శాసనసభ లేదా శాసనసభ ఉభయ సభలను ఉద్దేశించి రెండు ప్రత్యేక సందర్భాలలో ప్రసంగించాల్సి ఉంటుంది: సార్వత్రిక ఎన్నికల తర్వాత మొదటి సమావేశం, ప్రతి క్యాలెండర్ సంవత్సరంలో మొదటి సమావేశం. ఈ సందర్భాలలో గవర్నర్ ప్రసంగం కేవలం ప్రతీకాత్మకం కాదు, రాజ్యాంగపరమైన అవసరం. ఈ ప్రసంగం ఉద్దేశ్యం శాసన సభ సమావేశాన్ని ఏర్పాటు చేయడానికి గల కారణాలను తెలియజేయడం, ఎన్నికైన ప్రభుత్వ విధాన ప్రాధాన్యతలను పేర్కొనడం జరుగుతుంది. అయితే ఈ ప్రసంగం లేకుండా, సమావేశాన్ని చట్టబద్ధంగా ప్రారంభించడాన్ని గుర్తించే రాజ్యాంగ లాంఛనం అసంపూర్ణంగా ఉంటుంది.సమావేశం సంవత్సరంలో మొదటి సమావేశం లేదా ఎన్నికల తర్వాత మొదటి సమావేశం అయితే, గవర్నర్ ప్రసంగం లేకుండా అసెంబ్లీ చట్టబద్ధంగా శాసనసభ కార్యకలాపాలను ప్రారంభించదు. అటువంటి సమావేశంలో తీసుకున్న ఏదైనా చర్యను కోర్టులో సవాలు చేయవచ్చు. రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించవచ్చు. అయితే, సంవత్సరంలో మొదటి సమావేశం కాని వర్షాకాలం లేదా శీతాకాల సమావేశాలు వంటి సంవత్సరంలోని ఇతర సమావేశాలకు, గవర్నర్ ప్రసంగం అవసరం లేదు.రాజ్యాంగబద్ధంగా తప్పనిసరి అయిన సమయంలో గవర్నర్ ప్రసంగం లేకుండా శాసనసభ కార్యకలాపాలు ప్రారంభమైతే, అది తీవ్రమైన చట్టపరమైన బలహీనతను సృష్టిస్తుంది. అటువంటి సమావేశంలో ఆమోదించిన బిల్లులు, చర్చలు, ఆమోదించిన తీర్మానాలను న్యాయవ్యవస్థ ముందు ప్రశ్నించవచ్చు. కోర్టు మొత్తం సమావేశాన్నే చెల్లదని, దాని ఫలితాలను చెల్లదని ప్రకటించవచ్చు.నిజానికి, 1966 కలకత్తా హైకోర్టు తీర్పు ప్రకారం, గవర్నర్ ప్రసంగంలో కొంత భాగాన్ని చదివినా లేదా అధికారికంగా సభ ముందుకు తెచ్చినా, అది రాజ్యాంగ ఉల్లంఘనగా కాకుండా విధానపరమైన అక్రమంగా పరిగణిస్తారు. అలాంటి చర్య స్వయంచాలకంగా సమావేశాన్ని చెల్లుబాటు కాదు. అయితే, ముఖ్యమైన సమయంలో సభను ఉద్దేశించి ప్రసంగించడానికి పూర్తిగా నిరాకరించడం చాలా తీవ్రమైనది. రాజ్యాంగబద్ధంగా ప్రశ్నార్థకం. ఇదిలావుంటే, గవర్నర్ మొదటి, చివరి పేరాలు మాత్రమే చదివారు కాబట్టి, ఆయన ప్రసంగాన్ని చదివారని భావిస్తున్నారు. సమావేశాన్ని నిర్వహించడంలో ఎటువంటి సమస్య ఉండదని కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి.



# దళపతి విజయ్, కమల్‌హాసన్ పార్టీలకు గుర్తులు కేటాయించిన ఈసీ

తమిళగ వెట్రి కజగం(టీవీకే అధినేత, దళపతి విజయ్, మక్కల్ నీది మయ్యం అధినేత కమల్ హాసన్ పార్టీలకు కేంద్ర ఎన్నికల సంఘం అధికారికంగా గుర్తులను కేటాయించింది. విజయ్ పార్టీకి 'విజిల్' గుర్తును కేటాయించగా, కమల్ హాసన్ పార్టీకి 'బ్యాటరీ టార్చ్' గుర్తును ఖరారు చేసింది. ఈ నేపథ్యంలో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఇద్దరు అగ్ర కథానాయకులు ఇప్పుడు రాజకీయ వేదికపై తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఈ మేరకు గురువారం తమిళనాడు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌కు ఆదేశాలు జారీ చేసింది. రిజిస్టర్డ్ గుర్తింపు లేని రాజకీయ పార్టీల జాబితా కింద ఈ గుర్తులను కేటాయించారు. ఎలక్షన్ సింబల్స్ ఆర్డర్, 1968లోని పారా 10బీ నిబంధనల ప్రకారం ఈ పార్టీలకు ఈసీ గుర్తులను కేటాయించింది. రాబోయే తమిళనాడు, బంగాల్, కేరళ, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో (2025-26) ఈ పార్టీలు ఈ గుర్తులపై పోటీ చేస్తాయి. తమ అభ్యర్థులకు కామన్ సింబల్ కేటాయించాలన్న పార్టీల విజ్ఞప్తిని ఈసీ ఆమోదించింది.

**'విజిల్'తో విజయ్ సౌండ్**

విజయ్ ఎంట్రీతో తమిళనాడు పాలిటిక్స్ మారిపోయాయి. యువతలో, మాస్ వర్గాల్లో విజయ్‌కు విపరీతమైన క్రేజ్ ఉంది. ఇప్పుడు ఆయన పార్టీ గుర్తుగా 'విజిల్' రావడం అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. ఇది విజయ్ పార్టీకి తొలి అసెంబ్లీ ఎన్నికలు కావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. కమల్ హాసన్ పార్టీ వీచీవీకి మళ్లీ 'బ్యాటరీ టార్చ్' దక్కింది. గతంలోనూ కమల్ ఇదే గుర్తుపై పోటీ చేశారు. చీకటిని పారద్రోలి వెలుగును నింపే గుర్తుగా కమల్ దీనిని ప్రచారం చేసుకుంటున్నారు. డీఎంకే, అన్నాడీఎంకేలకు ప్రత్యామ్నాయంగా ఎదగాలని కమల్ భావిస్తున్నారు.

**నిబంధనలు ఏం చెబుతున్నాయి?**

ఈ గుర్తుల కేటాయింపులో కొన్ని షరతులు కూడా ఉన్నాయి. ఈ పార్టీలు పోటీ చేయని నియోజకవర్గాల్లో, ఈ గుర్తులు ఇతర స్వతంత్ర అభ్యర్థులకు 'ఫ్రీ సింబల్'గా అందుబాటులో ఉంటాయి. అలాగే భవిష్యత్తులో ఈ గుర్తులను శాశ్వతంగా దక్కించుకోవాలంటే, ఈ పార్టీలు మొత్తం అసెంబ్లీ సీట్లలో కనీసం 5 శాతం స్థానాల్లో పోటీ చేయాలి. లేకపోతే ఈ గుర్తులను కోల్పోయే ప్రమాదం ఉంది. మరోవైపు ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే అప్పుడే ప్రచార వేగం పెంచింది. పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి తొలి విడత మేనిఫెస్టోను ప్రకటించారు. జనవరి 17న ఆయన కీలక హామీలు ఇచ్చారు. 'కులవిళక్కు పథకం' కింద మహిళలకు ఆర్థిక సాయం ప్రకటించారు. రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబంలోని మహిళా పెద్దకు నెలకు రూ.2,000 నేరుగా బ్యాంకు ఖాతాలో వేస్తామని హామీ ఇచ్చారు. ఇది అధికార డీఎంకే ప్రభుత్వానికి గట్టి సవాలుగా మారింది.

**విజయ్‌కు సీబీఐ చిక్కులు**

రాజకీయంగా దూసుకెళ్తున్న విజయ్‌కు న్యాయపరమైన చిక్కులు ఎదురవుతున్నాయి. కరూర్ తొక్కిసలాట ఘటన ఆయన్ను వెంటాడుతోంది. ఈ కేసులో విజయ్ ఇప్పటికే సీబీఐ విచారణను ఎదుర్కొంటున్నారు. ఇది రాజకీయ కక్షసాధింపు అని విజయ్ అభిమానులు ఆరోపిస్తుండగా, చట్టం తన పని తాను చేసుకుపోతుందని అధికారులు అంటున్నారు. ఈ వివాదం ఎన్నికలపై ఎలాంటి ప్రభావం చూపుతుందో చూడాలి. తమిళనాడులో ఈ ఏడాది ప్రథమార్థంలోనే ఎన్నికలు జరగాల్సి ఉంది. అధికార డీఎంకే ప్రభుత్వాన్ని గద్దె దించడానికి విపక్షాలన్నీ ఏకమవుతున్నాయి. విజయ్, కమల్ రాకతో ఓట్లు చీలిపోయే అవకాశం ఉంది. కేంద్ర ఎన్నికల సంఘం ఇంకా అధికారిక షెడ్యూల్ విడుదల చేయలేదు. కానీ పార్టీలు మాత్రం అప్పుడే ప్రచార బరిలోకి దిగాయి.

## లోయలో పడిన ఆర్మీ వాహనం



జమ్మూకశ్మీర్ లోని దోడా జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఇండియన్ ఆర్మీకి చెందిన వాహనం లోయలో పడిపోయింది. చంబా-బందేర్వా హైవేపై ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 10 మంది సైనికులు ప్రాణాలు కోల్పోగా... పలువురు గాయపడ్డారు. ఆర్మీకి చెందిన బుల్లెట్ ప్రూఫ్ వాహనంలో 17 మంది ప్రయాణిస్తున్నారు. డ్రైవర్ వాహనాన్ని అదుపు చేయలేకపోవడంతో ప్రమాదం సంభవించింది. లోయలో సుమారు 200 అడుగుల లోతులోకి వాహనం పడిపోయింది. హై ఆల్టిట్యూడ్ పోస్టు వద్దకు వెళుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. వెంటనే ఆర్మీతో పాటు పోలీసులు సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడినవారిని ఉదంపూర్ మిలిటరీ ఆసుపత్రికి తరలించారు.

## ఝార్ఖండ్‌లో మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ



ఝార్ఖండ్‌లో మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. సింగ్‌భూం జిల్లాలో భద్రతా దళాలు జరిపిన ఆపరేషన్‌లో 15 మంది మావోయిస్టులు హతమయ్యారు. సారండా అటవీ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే, సింగ్‌భూం జిల్లాలోని సారండా అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో పోలీసులు, సీఆర్‌పీఎఫ్ కోబ్రా బలగాలు సంయుక్తంగా కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో భద్రతా దళాలపై మావోయిస్టులు కాల్పులకు తెగబడటంతో, బలగాలు దీటుగా ప్రతిఘటించాయి. ప్రస్తుతం ఆ ప్రాంతంలో కూంబింగ్ కొనసాగుతోంది. 2026 మార్చి నాటికి దేశాన్ని మావోయిస్ట్ రహితంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సహా మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల్లో భద్రతా బలగాలు నిర్మూలన చర్యలను ముమ్మరం చేశాయి. ఝార్ఖండ్‌లో జరిగిన ఈ తాజా ఎన్‌కౌంటర్‌ను కూడా ఈ ఆపరేషన్లలో భాగంగానే అధికారులు చూస్తున్నారు. మృతుల గుర్తింపు, స్వాధీనం చేసుకున్న ఆయుధాల వివరాలను అధికారులు అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఈ ఘటనతో మావోయిస్టుల ఏరివేత దిశగా మరో కీలక ముందడుగు పడినట్లయిందని భద్రతా వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

## అంతరిక్షం అంటే నక్షత్రాలు, గ్రహాలే కాదు




అంతరిక్షం నుంచి చూస్తే దేశాల సరిహద్దులు కనుమరుగై, మనమంతా ఒకే గ్రహంపై నివసిస్తున్నామన్న భావన కలిగిందని నాసా అంతరిక్ష రిటైర్డ్ వ్యోమగామి సునీతా విలియమ్స్ అన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ దిల్లీ (ఐఐటీ దిల్లీ)లో ఏర్పాటు చేసిన 'ది మేకింగ్ ఆఫ్ యాన్ ఆస్ట్రోనాట్ సునీతా విలియమ్స్ స్టోరీ' అనే కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ క్రమంలోనే ఆమె తన ప్రసంగంలో అంతరిక్ష విజ్ఞానంతో పాటు తన అనుభవాన్ని పంచుకుని విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. ఈ మేరకు ఆమె స్పేస్‌లో గడిపిన క్షణాలను వీడియో ద్వారా విద్యార్థులకు చూపించారు. కాగా, గతేడాది(2025) డిసెంబర్ 27న ఆమె పదవీ విరమణ చేసినట్లు అధికారికంగా ప్రకటించగా, ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్నారు.

**అంతరిక్షం అంటే నక్షత్రాలు, గ్రహాలే కాదు**

అంతరిక్షమంటే కేవలం నక్షత్రాలు, గ్రహాల పేరు మాత్రమే కాదని, మనిషి తనను తాను తెలుసుకునే అవకాశాన్ని కల్పిస్తుందని ఆమె నిరూపించారు. 27 ఏళ్లపాటు నాసాలో పనిచేసిన ఆమె మూడు సార్లు స్పేస్ వాక్ చేశారు. ఎన్నో అంతరిక్ష పరిశోధనలకు కృషి చేశారు.ల "ప్రస్తుతం మానవ అంతరిక్ష పరిశోధనకు చాలా ప్రత్యేకమైన సమయం. నిజ జీవితంలో ఉన్నట్లే ప్రతి స్పేస్ మిషన్‌కూ ఎత్తుపల్లాలు ఉంటాయి. కానీ ప్రతీ అనుభవం మనల్ని రాబోయే సవాళ్లను ఎదుర్కొనేందుకు మెరుగుపరుస్తుంది. అంతరిక్ష మిషన్లలోనూ ఎన్ని అత్యాధునిక వ్యవస్థ ఉన్నప్పటికీ, ఒక్కోసారి సమస్యలు ఎదురవుతుంటాయి. కొన్నిసార్లు వీటికి పరిష్కారాలు కూడా చాలా సులభంగానే ఉంటాయి. అయితే, మనం నేర్చుకున్న విద్యను సరైన సమయంలో, ఏకాగ్రతతో అన్వయించడమే ఆటంకాలను అధిగమించడానికి సరళతరం చేస్తుంది. ఇది నిజ జీవితంలోనూ పనిచేస్తుంది" అని ఆమె విద్యార్థులకు సూచించారు.

**స్పేస్ నుంచి చూస్తే**

గురుత్వాకర్షణ వల్ల ఆహార పదార్థాలు, మందులు, మానవ ప్రవర్తనలో వచ్చే మార్పుల గురించి ఆమె వివరించారు. గురుత్వాకర్షణ లేని స్పేస్‌లో నివసించడానికి, గ్రావిటీ ఉన్న భూమిపై జీవించడానికి విజ్ఞాన శాస్త్రం ఎప్పుడూ కొత్త దిశను చూపుతుందని చెప్పారు. అయితే, అంతరిక్షం నుంచి భూమిని చూసినప్పుడు దేశాల మధ్య సరిహద్దులు అదృశ్యమవుతాయని, మనమంతా ఒకే గ్రహం మీద నివసిస్తున్నామనే భావన కలుగుతుందని ఆమె చెప్పుకొచ్చారు. దీన్నే అవలోకన ప్రభావం (ఓవర్‌వ్యూ ఎఫెక్ట్) అంటారని ఆమె వివరించారు.

**భారతీయ ఆహారం ప్రత్యేక అనుభూతి**

అంతరిక్షంలో తోటి వ్యోమగాములతో కలిసి భారతీయ ఆహారాన్ని పంచుకోవడం అత్యంత సంతోషకరమైన, భావోద్వేగ క్షణమని ఆమె గుర్తుచేసుకున్నారు. అయితే, మనం చేసే పనిలో మన తోటి వారితో కలిసి నడవాలని సూచించారు. విజయానికి టీమ్‌వర్క్ ముఖ్యమని ఆమె తెలిపారు. తన బాల్యంలో క్రీడలు, ఈత ద్వారా నేర్చుకున్న టీమ్ వర్క్ అంతరిక్ష ప్రయాణాల్లోనూ తనకు ఎంతో ఉపయోగపడిందని సునీతా విలియమ్స్ వెల్లడించారు. కాగా, ప్రొఫెసర్ వీఎన్ వజిరానీ ఇన్ స్టిట్యూట్ లెక్చర్ సిరీస్‌లో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో సునీతా విలియమ్స్ పాల్గొన్నారు. ప్రొఫెసర్ వజిరానీ కుమారులు విజయ్, ఉమేష్ వజిరానీలు తమ తండ్రి జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఐఐటీ దిల్లీ డైరెక్టర్, అధ్యాపకులతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# సీరియల్‌లా ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ

-మొదటిపేజీ తరువాయి

సమావేశంలో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం నోటీసుల నేపథ్యంలో విలేకరులు ప్రశ్నలు అడగగా రేవంత్ రెడ్డి సిట్ అంటే సిట్ స్టాండ్ అంటే స్టాండ్ అనే పరిస్థితి ఉందని కేటీఆర్ చెప్పారు. రేవంత్‌రెడ్డికి పరిపాలన చేతకాదని ఏదో రూపంలో ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం స్కామ్, ఫోన్ ట్యాపింగ్ అంటూ డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం బావమరిది సృజన్ రెడ్డి బొగ్గు స్కామ్‌ను హరీశ్‌రావు ఉదయం బయటపెడితే, సాయంత్రం సిట్ నోటీసులు వచ్చాయన్నారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి కుమారుడు ప్రైవేటు భూములు కబ్జా చేస్తే మాత్రం దానిపై సిట్ ఉండదన్నారు.

**ఆర్ఆర్ ట్యాక్స్‌పై సిట్ ఉండదు**

అమృత్ టెండర్లలో సృజన్‌రెడ్డి కంపెనీకి అర్హత లేకపోయినా ప్రభుత్వం కాంట్రాక్టులు దక్కించుకున్నారని, ఈ విషయంలో కేంద్రమంత్రికి ఆధారాలు ఇచ్చామని ఇంతవరకు దానిపై దర్యాప్తు చేయలేదని కేటీఆర్ తెలిపారు. గచ్చిబౌలి భూముల్లో రూ.10 వేల కోట్ల కుంభకోణం జరిగినా, రేవంత్ రెడ్డి స్కామ్‌లపై కేంద్రం స్పందించట్లేదని కాపాడుతున్నారని ఆరోపించారు. ఆర్ఆర్ ట్యాక్స్, బొగ్గు కుంభకోణంపై మాత్రం ఎలాంటి సిట్ ఉండదని దుయ్యబట్టారు. రాష్ట్రం ఫిర్యాదు చేస్తే సీబీఐ దర్యాప్తునకు ఆదేశిస్తామని కిషన్‌రెడ్డి చెబుతున్నారని ఆక్షేపించారు. ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తే రాష్ట్రం కోరితే చేస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు.

ఫోన్ ట్యాపింగ్‌లు ప్రభుత్వాలు చేయవని, పోలీసు వ్యవస్థ చేస్తుందని కేటీఆర్ అన్నారు. మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్‌రెడ్డి, మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి, మాజీ హోం సెక్రటరీ రవిగుప్తా వంటి అధికారులను సిట్ ఎందుకు ప్రశ్నించట్లేదని ఆక్షేపించారు. కేవలం ప్రతిపక్ష నాయకులనే లక్ష్యంగా చేసుకుంటున్నారని మండిపడ్డారు. మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్ ఫోన్లు ట్యాప్ చేస్తున్నారని చెబితే దానిని ప్రభుత్వం ఖండించలేదని, ట్యాప్ చేయట్లేదని ప్రమాణం చేసి చెబుతారా? అని ప్రశ్నించారు.ఫోన్ ట్యాపింగ్ కేసులో సంబంధం లేని నేతలను ప్రశ్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి దావోస్ నుంచి వచ్చే వరకు తన పదవి



ఉప ముఖ్యమంత్రి, నల్గొండ బాంబులు ఎవరూ కూలుస్తారో అనేది ఆయన భయమన్నారు. అందుకే పదిరోజుల పాటు ఈ నోటీసులంటూ డ్రామాలాడుతూ సీఎం శునకానందం పొందుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

"రేవంత్‌రెడ్డి సిట్ అంటే సిట్, స్టాండ్ అంటే స్టాండ్. రేవంత్‌రెడ్డికి పరిపాలన చేతకాదు. అసమర్థ పాలన. ఏదో రూపంలో ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు. కాళేశ్వరం స్కామ్, ఫోన్ ట్యాపింగ్ అంటూ డ్రామాలు ఆడుతున్నారు. సీఎం బావమరిది సృజన్ రెడ్డి బొగ్గు స్కామ్‌ను హరీశ్‌రావు ఉదయం బయటపెడితే సాయంత్రం నోటీసులు వచ్చాయి. మంత్రి పొంగులేటి కుమారుడు ప్రైవేటు భూములు కబ్జా చేస్తే మాత్రం సిట్ ఉండదు" -కేటీఆర్, మాజీమంత్రి

**కార్తీకదీపంలా ఫోన్ ట్యాపింగ్ కేసు**

ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిపక్ష నేతల ఫోన్లు ట్యాప్ చేయట్లేదా? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏమీ లేదనే విషయం విచారణాధికారులకు కూడా తెలుసన్నారు. సిట్ విచారణలో అడిగిందే అడుగుతున్నారని, కార్తీకదీపం సీరియల్ సమయం గడుపుతున్నారని చెప్పారు. ప్రజలకు పనికొచ్చే ఒక్క పని ఈ రెండేళ్లలో రేవంత్ రెడ్డి సర్కారు చేయలేదన్నారు.ఫోన్ ట్యాపింగ్ క్రీడలో చివరకు బలి పశువులయ్యేది అధికారులేనని కేటీఆర్ అన్నారు. ప్రజల దీవెనతో వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ సీఎం అవుతారని, ఏ ఫోన్లు ట్యాప్ అయ్యాయో అప్పుడు అన్నీ బయటకు వస్తాయన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ఫోన్ ట్యాపింగ్ చేయట్లేదా? అధికారులు చెప్పాలని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీశ్‌రావును సాక్షిగానే పిలిచారని బాధితుడిగా పిలవలేద న్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పంచాయతీ ఎన్నికలకు మించిన ఫలితాలు వస్తాయని, జడ్పీ ఎన్నికలను తప్పించుకోవాలని ప్రభుత్వం చూస్తోందని కేటీఆర్ తెలిపారు. జిల్లా పరిషత్ ఎన్నికల్లో పరాభవం తప్పదని కాంగ్రెస్‌కు అర్థమైందని చెప్పారు. గతంలో జిల్లాలను అశాస్త్రీయంగా చేశారని ప్రభుత్వ పెద్దలు ఆరోపిస్తున్నారని, కేసీఆర్ ఏర్పాటు చేసిన జిల్లాలను రద్దు చేయాలని కుట్ర జరుగుతోందన్నారు. కేసీఆర్ ఆనవాళు చెరిపేయాలని చూస్తే గట్టిగా పోరాటం చేస్తామన్నారు. మున్సిపల్ ఎన్నికలకు బీఆర్ఎస్ సర్వసన్నద్ధంగా ఉందని, పార్టీ ఇన్‌ఛార్జ్‌లను నియమిస్తున్నట్లు తెలిపారు.

# సీటీలో రోడ్ల విస్తరణ

**హైదరాబాద్ :** హైదరాబాద్ వాసులకు హెచ్ఎండీఏ తీపి కబురు చెప్పింది. నగరం నుంచి ఓఆర్ఆర్ వరకు ట్రాఫిక్ లేని ప్రయాణానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. కొత్తగా ఎలివేటెడ్ కారిడార్లతో పాటు.. కొన్ని జాతీయ రహదారుల విస్తరణకు శ్రీకారం చుట్టింది. వ ఇప్పటికే చాలా వరకు ప్రాజెక్టులో మొదలు కాగా.. మరికొన్నింటికి టెండర్లను ఆహ్వానించింది. రద్దీగా ఉండే ప్రాంతాల్లో భూ స్థాయిలో 4 లైన్ల రోడ్డును.. దాంతో పాటే 6 లైన్ల రోడ్డుతో రెండు భాగాలుగా అనుసంధానం చేసే ప్రణాళికలను హెచ్ఎండీఏ చేపట్టింది. హైదరాబాద్ మహా నగరంలో నానాటికీ పెరుగుతున్న వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని.. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ప్రభుత్వం భారీ రహదారుల విస్తరణ పనులకు శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా నగరం మధ్యలో నుంచి ప్రయాణ సమయాన్ని తగ్గించేలా 6 లైన్ల రహదారుల నిర్మాణం.. ప్రస్తుతం ఉన్న 3 లైన్ల రోడ్లను 4 లైన్లుగా మార్చే పనులకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రణాళికలు సిద్ధం చేసింది.ఐటీ కారిడార్‌లో అత్యంత రద్దీగా ఉండే నానక్‌రాంగూడ నుండి గచ్చిబౌలి వరకు ఉన్న ప్రధాన రహదారిని విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఇక్కడ సర్వీసు రోడ్డు కాకుండా ప్రధాన మార్గం మూడు వరుసలుగా ఉంది. గచ్చిబౌలి జంక్షన్ వద్ద కొత్తగా నిర్మించిన ఫ్లైఓవర్ల కారణంగా వాహనాల రాకపోకలు పెరిగి ట్రాఫిక్ నిలిచిపోతోంది. ఈ సమస్యను పరిష్కరించడానికి ఈ రహదారిని 4 లైన్ల మార్గంగా మార్చనున్నారు. దీని కోసం ప్రభుత్వం సుమారు రూ. 26.50 కోట్ల నిధులను మంజూరు చేస్తూ పరిపాలనా అనుమతులు ఇచ్చింది. ఈ విస్తరణతో అవుటర్ రింగ్ రోడ్డుకు చేరుకోవడం ప్రయాణికులకు సులభతరం కానుంది.కోకాపేట, మణికొండ, పుప్పాలగూడ వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న



ప్రాంతాల్లో ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు ఎంజీఐటీ నుండి మణికొండ వరకు కొత్త రహదారిని నిర్మించనున్నారు. సుమారు 3.57 కిలోమీటర్ల పొడవునా నిర్మించే ఈ మార్గాన్ని పూర్తిస్థాయిలో 6 లైన్ల రహదారిగా తీర్చిదిద్దనున్నారు. రూ. 110 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్టులో రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు, వరద నీటి కాలువలు, ఆధునిక ల్యాండ్‌స్కేపింగ్‌ను ఏర్పాటు చేస్తారు. ఇది పూర్తయితే గండిపేట పరిసర ప్రాంతాల నుండి నగరంలోకి వచ్చే వాహనదారులకు పెద్ద ఉపశమనం లభిస్తుంది.బంజారాహిల్స్ ఐసీసీసీ టవర్ నుండి శిల్పా లేఅవుట్ వరకు ప్రతిపాదించిన ఎలివేటెడ్ కారిడార్ నగర రవాణా వ్యవస్థలో కీలక మలుపు కానుంది. రూ. 1,656 కోట్ల వ్యయంతో నిర్మించే ఈ కారిడార్ ద్వారా బంజారాహిల్స్ నుండి గచ్చిబౌలి వరకు ఎక్కడా సిగ్నల్స్ లేకుండా ప్రయాణించవచ్చు. ఈ మార్గంలో ఫిల్మ్ నగర్, టీహబ్, ఐటీసీ కోహినూర్ వంటి కీలక జంక్షన్ల వద్ద ప్రవేశ, నిష్క్రమణ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు. భూస్థాయిలో.. ఎలివేటెడ్ విధానంలో 4, 6 వరుసలుగా ఈ రహదారిని అభివృద్ధి చేయడం ద్వారా హైటెక్ సిటీ ప్రాంతం లో ట్రాఫిక్ సమస్యలు దాదాపుగా తొలగిపోనున్నాయి.

# ఎన్నికలకు రెడీ అవుతున్న పార్టీలు

**ఖమ్మం :** ఖమ్మం జిల్లాలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల వేడి మొదలైనది ఒకవైపు ఎండలు వేడి ఎక్కువవు తుంది మరోవైపు రాజకీయ వేడి ఎక్కువవుతుంది ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే ఖమ్మం జిల్లాలోని ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీలు ఏదులాపురం,వైరా, కల్లూరు మధిర,సత్తుపల్లి లో ఎన్నికలు ఇన్చార్జిలను నియమించుకున్నారు. మరోవైపు చాప కింద నీరు లాగా బలంగా ఉన్న కమ్యూనిస్టు పార్టీలైన సిపిఐ సిపిఎం పార్టీలు కూడా సమావేశాలు నిర్వహిస్తూ క్యాడర్ ని ఎన్నికలకు సిద్ధం చేస్తున్నారు వాళ్లకు బలంగా ఉన్నచోట పోటీ చేసి మిగతా చోట్ల ఎవరికి మద్దతు ఇవ్వాలని ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు మిగతా పార్టీలైన బిజెపి సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ సైతం పోటీలో సిద్ధంగా ఉన్నాము అంటూ క్యాడర్లో ఉత్సాహాన్ని నింపుతున్నారు.సర్పంచ్ ఎన్నికల ఫలితాలతో మంచి జోష్ లో ఉన్న కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల్లో కూడా అదే హవా కొన సాగించాలని, బిఆర్ఎస్ పార్టీ కూడా గత వైభవాన్ని దృష్టిలో ఉంచుకొని బాగా పనిచేసే మంచి ఫలితాలను సాధించాలని వ్యూహరచనలు చేస్తున్నాయి.మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ టిఆర్ఎస్ సీపీఐ సిపిఎం పార్టీలు మధ్య పోటీ ఉండగా, కాంగ్రెస్ సిపిఐ కలిసి పోటీ చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి, అదేవిధంగా బిఆర్ఎస్ సీపీఎం పార్టీలు కలిసి పోటీ చేసే ఆలోచనలు



ఉన్నట్లు కనిపిస్తున్నాయి అదే దిశగా పావులు కదుపుతున్నారు. ఖమ్మం జిల్లాలో అన్ని మున్సిపాలిటీల్లో క్లీన్ స్వీప్ చేయాలని కాంగ్రెస్ పార్టీకి చెందిన ముగ్గురు మంత్రులు సంకల్పంతో పనిచేస్తున్నారు.రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారి నియోజకవర్గంలో ఉన్న ఏదులాపురం మున్సిపాలిటీలో ఇప్పటికే మంత్రి పలుమార్లు పర్యటించి ఇన్చార్జిలని నియమించి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అలాగే ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పరిధిలో ఉన్న మధిర మున్సిపాలిటీలో అన్ని వార్డులతో సహా ఇన్చార్జిలను నియమించి వారితో చర్చించి దిశా నిర్దేశం చేస్తున్నారు. ఇకపోతే వైరా కల్లూరు సత్తుపల్లి మున్సిపాలిటీలలో మంచి పట్టు ఉన్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ఎమ్మెల్యే రాగమయి సత్తుపల్లి కాంగ్రెస్ నాయకులు దయానంద్ తో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పలుమార్లు చర్చించి వ్యూహాలను తయారు చేస్తున్నారు.మొత్తం మీద ముగ్గురు మంత్రులు కలిసి ఖమ్మం జిల్లాలో అన్ని మున్సిపాలిటీలలో అన్ని వార్డులతో సహా కైవసం చేసుకోవాలని మంచి పట్టుదలతో పని చేస్తున్నారు. మరోపక్క బిఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ మంత్రి అజయ్ కుమార్ వైరా పై దృష్టి పెట్టి కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపుతున్నారు. మధిరకు మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, లింగాల కమల్ రాజు విస్తృతంగా పర్యటించి కార్యకర్తలను సమాయత్తం చేస్తున్నారు. ఏదులాపురం మున్సి పాలిటీలో మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి,కల్లూరు సత్తుపల్లి కి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య లను ఇన్చార్జిలుగా నియమించి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యవేక్షిస్తున్నారు. ఇలా ఖమ్మం జిల్లాలోని పలు మున్సిపాలిటీల్లో జెండాలు ఎగురవేసేందుకు ఎవరి వ్యూహాల్లో వారు రచిస్తున్నారు. ఖమ్మం అంటే తెలుగుదేశం కంచుకోట అని, కనుక తెలుగు తమ్ముళ్లు ఎవరికి మద్దతిస్తే వాళ్లే గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనేది అందరూ భావిస్తున్నారు. ఇదే విషయాన్ని టిడిపి తమ్ముళ్లు పట్టు ఉన్నచోట పోటీ చేయాలని ఇప్పటికే పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్ళారు. ఇందుకు టీడీపీ నాయకులు దానికి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. ఈసారి ఖమ్మం జిల్లాలో టిడిపి కూడా పోటీలో ఉండే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

## యూనివర్సిటీ అధ్యక్షుడుగా సాగర్ల కర్ణాకర్ యాదవ్..

**ధర్మ ఘంట, జనవరి 22 నల్గొండ:** బీసీ విద్యార్థి సంఘం మహాత్మా గాంధీ యూనివర్సిటీ అధ్యక్షుడిగా సాగర్ల కర్ణాకర్ యాదవ్ ని నియమిస్తూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ గురువారం నియమక పత్రాన్ని అందజేశారు.బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నియమించినట్లు తెలిపారు.ఆయన వెంట బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నల్ల మధు యాదవ్ ఉన్నారు.అనంతరం జాతీయ అధ్యక్షులు మాట్లాడుతూ యూనివర్సిటీలో ఏలాంటి సమస్యలు ఉన్న అదేవిధంగా బీసీలకు 42% రిజర్వేషన్ గురించి పోరాడాలని సూచించారు.మహాత్మా గాంధీ యూనివర్సిటీ అంటే ఉద్యమాలకు పురిటి గడ్డ అని బీసీ రాజ్యాధికారం వచ్చేవరకు పోరాడాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్వి యూనివర్సిటీ అధ్యక్షుడు వాడపల్లి నవీన్, శ్రీశైలం,సర్దార్ నాయక్, వినయ్,తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన అధ్యక్షులు మాట్లాడుతూ నియామక పత్రం అందజేసిన జాతీయ అధ్యక్షులకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ సహకరించిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలియజేశారు. మాత్మ గాంధీ యూనివర్సిటీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జరుగుతున్న బీసీ ఉద్యమంలో పాల్గొని ఉద్యమాన్ని ఉధృతం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు.

## ఫ్యూచర్ సిటీలో ఏఐ డేటా సెంటర్

-మొదటిపేజీ తరువాయి

మేనేజింగ్ డైరెక్టర్ జెరెమీ జర్గెన్స్ తెలిపారు. చైనాలో ప్రతి ఏడాది సమ్మర్ దావోస్ జరుగుతోందని, సౌదీ అరేబియా కూడా ఆసక్తి ప్రదర్శిస్తోందని చెప్పారు. సీ4ఐఆర్ నెట్‌వర్క్ కోఆర్డినేషన్ హెడ్ మంజు జార్జ్‌తోనూ సీఎం భేటీ అయ్యారు. తెలంగాణ రైజింగ్ విజన్ లక్ష్యాలను రేవంత్ వివరించారు. 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే రోడ్‌మ్యాప్‌ను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావనకు తీసుకొచ్చారు. తెలంగాణ విజన్‌లోని విభిన్న కోణాలు పరస్పర సహకారానికి అవకాశం కల్పించేలా ఉన్నాయని జెరెమీ జర్గెన్స్ ప్రశంసించారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో తాము భాగస్వామ్యం పంచుకుంటామన్నారు. తెలంగాణ ఆర్థిక వృద్ధి ప్రయాణంలో కలిసి వస్తామనే సంకేతాలు ఇచ్చారు. హైదరాబాద్‌లో ప్రతిభావంతమైన మానవ వనరులున్నాయని ఆమె అభిప్రాయపడ్డారు.

**వీటికే మా ప్రాధాన్యత :** అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను సీఎం వివరించారు. స్కిల్ డెవలప్‌మెంట్, స్పోర్ట్స్‌కు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన బయోఏషియా 2024లో ప్రారంభించిన సెంటర్ ఫర్ ది ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్ పురోగతిపై చర్చించారు.

**ఏఐ డేటా సెంటర్ :** మరోవైపు దావోస్‌లో తెలంగాణకు మరో భారీ పెట్టుబడి లభించింది. కొత్తగా నిర్మించే ఫ్యూచర్ సిటీలో ఏఐ డేటా సెంటర్ నెలకొల్పనున్నట్లు యూపీసీ వోల్ట్ సంస్థ వెల్లడించింది. రూ.5 వేల కోట్ల పెట్టుబడితో 100 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వంతో ఎంవోయూ కుదుర్చుకుంది. ఈ ప్రాజెక్టుకు ఐదేళ్లలో క్రమంగా రూ.5 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఈ డేటా సెంటర్‌కు అవసరమైన విద్యుత్ సరఫరా కోసం 100 మెగావాట్ల సామర్థ్యంతో ప్రత్యేక పునరుత్పాదక విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణ దశలోనే రూ. 3 వేల మందికి పైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. డేటా సెంటర్ ప్రారంభమైన తర్వాత మరో 800 మందికిపైగా ఉద్యోగ అవకాశాలుంటాయని ప్రభుత్వం వెల్లడించింది.

ప్రపంచ ఆర్థిక సదస్సులో పెట్టుబడులను ఆకర్షిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఏపీ ఐటీ మంత్రి లోకేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం సీఎం రేవంత్ లోకేశ్‌కు జ్ఞాపికను అందజేశారు.

**రూ.623 కోట్ల పెట్టుబడి.. ష్నైడర్ ఎలక్ట్రిక్ విస్తరణ**

రాష్ట్రంలో ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా కంపెనీ తమ యూనిట్లను విస్తరించనుంది. శంషాబాద్, గాగిల్లాపూర్లలో రూ.623 కోట్ల పెట్టుబడితో విస్తరిస్తున్నట్లు వెల్లడించింది. ప్రపంచ ఆర్థిక వేదిక - 2026లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ష్నైడర్ కంపెనీ సీఈవో దీపక్ శర్మతో సమావేశమయ్యారు. విద్యుత్ రంగంలో వస్తున్న మార్పులు, విద్యుత్ స్టోరేజ్ ప్రాజెక్టులు, గ్రిడ్ ఆధునీకరణ, విద్యుత్ సామర్థ్యం పెంపు, ఇండస్ట్రియల్ పార్కులు, పట్టణ మౌలిక వసతులకు డిజిటల్ విద్యుత్ నిర్వహణ వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈ యూనిట్ల విస్తరణతో ఎలక్ట్రికల్ సేఫ్టీకి సంబంధించి ఎయిర్ సర్క్యూట్ బ్రేకర్లు, మోల్డెడ్ కేస్ సర్క్యూట్ బ్రేకర్లు, కాంటాక్టర్లు, పుష్ బటన్ల తయారీ సామర్థ్యం పెరుగనుంది. ష్నైడర్ ఎలక్ట్రిక్‌కు తెలంగాణలోనే 38 నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఉన్నాయి. పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురావడంలో కృషి చేసిన ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. 2047 నాటికి నెట్ జీరో అభివృద్ధి లక్ష్యాన్ని సాధించడంలో పర్యావరణ పరిరక్షణ కీలకమని ముఖ్యమంత్రి తెలిపారు. ఇంధన నిర్వహణ, ఆటోమేషన్, ఈవీ భాగాల తయారీలో స్మార్ట్ ఫ్యాక్టరీల విస్తరణపై మంత్రులు చర్చించారు. ప్రస్తుతం దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రాల్లో ఒకటిగా తెలంగాణ ఎదిగిందని మంత్రులు తెలిపారు.

## మహాలక్ష్మి పథకం కోసం ఆర్టీసీ 'స్మార్ట్‌కార్డ్'

-మొదటిపేజీ తరువాయి

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.5 కోట్ల మందికి ఈ స్మార్ట్‌కార్డులు జారీచేస్తారు. తొలిదశలో 5 లక్షల స్మార్ట్‌కార్డులతో పైలట్ ప్రాజెక్టు చేపడతామని ఆర్టీసీ పేర్కొంది. ఫలితాల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని ఆర్టీసీ పేర్కొంది. సమగ్ర కుటుంబ సర్వే వివరాల ఆధారంగా ఉచిత ప్రయాణికుల్ని గుర్తించనున్నట్లు ఆ సంస్థ వెల్లడించింది. దీంతో పాటు పౌరసరఫరాల శాఖ నుంచి పొందిన సమాచారాన్ని సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ)తో సమన్వయం చేసి వ్యాలిడేట్ డేటా ఇస్తుందని ఆర్టీసీ ప్రభుత్వానికి నివేదించింది.

**కార్డుతో ప్రయోజనాలివీ**

ప్రతి మహిళకు జారీచేయనున్న ఈ స్మార్ట్‌కార్డులతో పలు ప్రయోజనాలున్నాయి. ఆ వివరాలేంటో తెలుసుకుందాం. అర్హత లేని ప్రయాణికుల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు అవకాశం ప్రయాణ దూరం, రూట్, సమయాలపై కచ్చితమైన సమాచారం ఉంటుంది గ్రామం, మండలం, జిల్లా, జోన్ వారీ వినియోగ సమాచారం లభ్యమవుతుంది కండక్టర్లపై పనిభారం తగ్గనుంది. పేపర్ లెస్ టికెట్ ప్రయాణం కల్పించవచ్చు రద్దీగా రూట్ల వివరాలు తెలుస్తాయి. బస్సులు పెంచడం, తగ్గించడం ఆర్టీసీకి తేలికవుతుంది ఎంతమంది ఉచిత బస్సు పథకాన్ని వినియోగించుకుంటున్నారో తెలుస్తుంది

**బస్సులో ఆక్యుపెన్సీ రేషియో 95 శాతం**

మహిళల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకానికి ఆదరణ లభిస్తోంది. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో మహిళలకు భద్రతను, ఆర్థిక ప్రయోజనాన్ని ప్రభుత్వం అందిస్తోంది. గత ఏడాది జులై వరకు రాష్ట్రవ్యాప్తంగా 200 కోట్లకు పైబడి జీరో టికెట్లలను టీజీఎస్‌ఆర్టీసీ జారీ చేసింది. గతంలో ఆర్టీసీ బస్సుల్లో సీట్ల భర్తీ నిష్పత్తి(ఆక్యుపెన్సీ రేషియో) 67 శాతం మాత్రమే ఉండేది. ఫలితంగా ఆర్టీసీకి ప్రతినెలా భారీగా నష్టాలు వచ్చేవి. ప్రయాణికుల కోసం ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు ఎదురు చూసేరోజులను చూశాం. ఇప్పుడు ఈ మహాలక్ష్మి పథకం అమలు చేయడంతో సగటు ఓఆర్ ఏకంగా 95 శాతానికి పెరిగింది. మహిళలకు టీజీఆర్టీసీ ప్రస్తుతం 'జీరో' టికెట్లను జారీ చేస్తోంది. బస్ టికెట్ల ఛార్జీల్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రీయింబర్స్ చేస్తోంది. నెలకు రూ.358.79 కోట్ల చొప్పున 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.4,305.49 కోట్ల బడ్జెట్‌లో మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణానికి కేటాయించారు.

**టీజీఎస్‌ఆర్టీసీ తీసుకొచ్చిన సంస్కరణలు**

ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా టీజీఎస్‌ఆర్టీసీ అనేక సంస్కరణలను తీసుకొచ్చింది. ముఖ్యంగా డీజిల్ బస్సులను తగ్గిస్తూ ఎలక్ట్రిక్ వాహనాలను(ఈవీ) పెంచుతూ వస్తుంది. అలాగే బస్సుల గమ్యస్థానాలను తెలుసుకునేందుకు వీలుగా గమ్యం యాప్‌ను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. అలాగే టికెటింగ్ సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా, చిల్లర సమస్య రాకుండా ఉండేందుకు కండక్టర్ ద్వారానే స్మార్ట్ టికెట్ జారీ చేసేవిధానం తీసుకొచ్చారు. తాజాగా మహాలక్ష్మి పథకం లబ్ధదారులకు స్మార్ట్‌కార్డులను ప్రవేశపెట్టాలని ఆర్టీసీ యోచిస్తోంది.

ధర్మఘంట

# బెడ్ మీద కూర్చొని తింటున్నారా..?



మీకు మంచం మీద కూర్చుని టీవీ చూస్తూ భోజనం చేసే అలవాటు ఉందా..? అయితే మీరు తెలియకుండానే పెద్ద ప్రమాదాన్ని కొనితెచ్చుకుంటున్నారు. చూడటానికి ఇది చాలా సౌకర్యంగా అనిపించినా.. మీ జీర్ణవ్యవస్థను, నిద్రను, చివరికి మీ చర్మాన్ని కూడా ఇది దెబ్బతీస్తుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. చాలామందికి రాత్రిపూట లేదా ఖాళీ సమయాల్లో మంచం మీద కూర్చుని, టీవీ చూస్తూనో లేదా మొబైల్ వాడుతూనో భోజనం చేయడం అలవాటు. ఇది ఎంతో హాయిగా, సౌకర్యంగా అనిపించవచ్చు. కానీ ఈ చిన్న అలవాటు మీ ఆరోగ్యానికి ఎంతటి చేటు చేస్తుందో తెలుసా..? మంచం మీద తినడం వల్ల కలిగే అనర్థాలపై ఆరోగ్య నిపుణులు గట్టిగా హెచ్చరిస్తున్నారు. మనం ఆహారం తిన్నప్పుడు మన శరీరం నిటారుగా ఉండాలి. అప్పుడే ఆహారం అన్నవాహిక ద్వారా కడుపులోకి సులభంగా వెళుతుంది. మంచం మీద కూర్చున్నప్పుడు మనం నిటారుగా ఉండము, దీనివల్ల జీర్ణ రసాలు సరిగ్గా ఉత్పత్తి కావు. పడుకుని తినడం వల్ల ఆహారం అన్నవాహికలో ఇరుక్కుపోయే ప్రమాదం ఉంది. ఇది తీవ్రమైన ఎసిడిటీ, గ్యాస్, గుండెల్లో మంటకు దారితీస్తుంది. మంచం మీద తింటున్నప్పుడు మన దృష్టి ఆహారం మీద కంటే టీవీ లేదా మొబైల్ స్క్రీన్‌పైనే ఎక్కువగా ఉంటుంది. దీనిని మైండ్‌లెస్ ఈటింగ్ అంటారు. అంటే మనం ఎంత తింటున్నామో మన మెదడుకు సరిగ్గా తెలియదు. దీనివల్ల అవసరానికి మించి ఎక్కువగా తినేస్తాం. ఫలితంగా ఊబకాయం, మధుమేహం వంటి జీవనశైలి వ్యాధులు చుట్టుముట్టే ప్రమాదం ఉంది. మంచం మీద తిన్నప్పుడు మనకు తెలియకుండానే చిన్న చిన్న ఆహార కణాలు పరుపులు, దుప్పట్లపై పడతాయి. ఇవి కంటికి కనిపించవు కానీ, బ్యాక్టీరియా, ఇతర కీటకాలను ఆకర్షిస్తాయి. దీనివల్ల చర్మ సంబంధిత అలర్జీలు, ఉబ్బసం ఉన్నవారికి శ్వాసకోశ సమస్యలు పెరగవచ్చు. మంచం పరిశుభ్రంగా లేకపోవడం వల్ల నిద్రలేమి సమస్యలు తలెత్తుతాయి. మెదడుకు మంచం అంటే నిద్రపోయే చోటు అనే సంకేతం ఉంటుంది. కానీ మీరు అక్కడే తినడం, ల్యాప్‌టాప్ వాడటం చేస్తే.. అది విశ్రాంతి తీసుకోవాల్సిన చోటా లేక పని చేయాల్సిన చోటా అని మెదడు గందరగోళానికి గురవుతుంది. దీనివల్ల

# ఆకు కాదిది ఔషధ గని



వాము ఆకులు యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీబయాటిక్ లక్షణాలను కలిగి ఉంటాయి. ఇవి దీర్ఘకాలిక ఆరోగ్యానికి అమృతంగా పనిచేస్తాయి. జలుబు, గొంతులో గరగరతో బాధపడుతున్నవారికి వామ కులతో రసం చేసుకుని తాగితే కఫం అంతా క్లియర్ అవుతుంది.ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, మీరు వాము ఆకులను నమలడం వల్ల, ఉబ్బరం, గ్యాస్, మలబద్ధకం వంటి జీర్ణ సమస్యలను దూరంగా ఉంచడంలో మీకు సహాయపడుతుంది. వాము ఆకులను నీటిలో మరిగించి తాగడం వల్ల శ్వాసకోశ సమస్యలు దూరంగా ఉంటాయని అనేక పరిశోధనల్లో వెల్లడైంది. ఈ ఆకు తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది.వాము ఆకులు మరిగించిన నీటిలో ఇంగువ, నల్ల ఉప్పు కలిపి తీసుకుంటే, అది కడుపు నొప్పి నుండి తక్షణ ఉపశమనం కలిగిస్తుంది. ఇవి అనాల్జేసిక్ లక్షణాలను కలిగి ఉంటాయి. ఇవి పంటి నొప్పి, తలనొప్పి, శరీర నొప్పుల నుండి ఉపశమనం కలిగిస్తాయి. ఆకులను మెత్తగా చేసి, ప్రభావిత ప్రాంతానికి లేపంగా అప్లై చేయటం వల్ల మంచి ఫలితం ఉంటుంది. వాము ఆకులతో చట్నీ కూడా తయారు చేసుకోవచ్చు. చట్నీ చేయడానికి, ఆకులను వెల్లుల్లి, పచ్చిమిర్చి, కొద్దిగా నిమ్మరసంతో కలిపి తయారు చేసుకోవాలి. ఇలా క్రమం తప్పకుండా వామాకుల రసం రోగనిరోధక శక్తిని పెంచుతుంది. అనేక తీవ్రమైన వ్యాధుల్ని నివారిస్తుంది. రోజూ రెండు ఆకులు నమలడం వల్ల శరీరంలో మెటబాలిజం రేటు పెరుగుతుంది. వాము ఆకుల రసం తీసుకోవడం ఆర్థరైటిస్ రోగులకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఇందులో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఇది కీళ్ల నొప్పులు, వాపుల్ని తగ్గించడంలో సాయపడుతుంది. ఇది బరువు తగ్గించడంలో సహాయపడుతుంది. కళ్లను ఆరోగ్యంగా ఉంచుతుంది. వాము ఆకుల రసం తాగడం వల్ల కళ్లకు కూడా ఎంతో మేలు జరుగుతుంది. ఇందులో విటమిన్ ఎ పుష్కలంగా ఉంటుంది. ఇది ఆరోగ్యకరమైన కళ్లు, కంటి చూపును నిర్వహించడానికి అవసరం. క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల కంటి చూపు మెరుగుపడుతుంది. వాము ఆకు కీళ్ల నొప్పులు, వాపులను తగ్గించడంలో సహాయపడుతుంది. వాము ఆకులో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్స్, ప్రోటీన్స్ తదితర ఖనిజాలు శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. సీజనల్‌గా వచ్చే జలుబు, దగ్గు సమస్యలను దూరం చేస్తుంది. వాము ఆకు తింటే జీవక్రియ సక్రమంగా జరుగుతుంది. ఈ ఆకు తింటే అధిక రక్తపోటు సైతం నియంత్రణలోకి వస్తుంది.

# రోజుకు 7 గంటల కంటే తక్కువ నిద్రపోతున్నారా?



నేటి జీవనశైలిలో చాలామంది సరైన నిద్రకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. పని ఒత్తిడి, మొబైల్ వినియోగం, టీవీ, సోషల్ మీడియా వంటి అలవాట్ల కారణంగా రోజుకు 7 గంటల కంటే తక్కువ నిద్రపోవడం సాధారణమైపోయింది. అయితే, ఈ అలవాటు మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో మనిషి చాలా ఆరోగ్యకరమైన విషయాలకు దూరమవుతున్నాడు. అందులో ప్రధానమైనది నిద్ర. మారుతున్న జీవనశైలి, ఉద్యోగ సమయాలు ఇందుకు కారణమవుతున్నాయి. ఉద్యోగాలు చేస్తున్నవారు రాత్రి వేళల్లోనూ పనిచేయడం, ఇంట్లో ఉంటే ఫోన్లు, టీవీలకు అతుక్కుపోయి సమయానికి నిద్రపోవడం లేదు. రాత్రి ఆలస్యంగా నిద్రపోవడం, ఉదయం ఆలస్యంగా మేల్కోవడం అనేవి రెండూ కూడా మనిషి ఆరోగ్యానికి హానికరమైనవేనని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. రాత్రి సమయంలో 7 గంటల కంటే తక్కువగా నిద్రపోయే వారిలో అనేక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని చెబుతున్నారు. అందుకే రాత్రి సమయంలో తప్పనిసరిగా 7 గంటలపాటు నిద్రకు సమయం కేటాయించాలని సూచిస్తున్నారు. నిద్ర తక్కువైతే ఎలాంటి ఆరోగ్య సమస్యలు వస్తాయి? నిద్ర అనేది శరీరానికి విశ్రాంతి మాత్రమే కాదు. శరీర కణాలు పునరుద్ధరించబడతాయి. మెదడు జ్ఞాపకశక్తిని బలోపేతం చేస్తుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. హార్మోన్లు సమతుల్యం అవుతాయి. అందుకే పెద్దవారికి రోజుకు కనీసం 7?8 గంటల నిద్ర తప్పనిసరి అని వైద్యులు సూచిస్తున్నారు. మానసిక ఆరోగ్యంపై ప్రభావం.. తక్కువ నిద్ర వల్ల ఒత్తిడి (ాబితీవబబ) పెరుగుతుంది. ఆందోళన, డిప్రెషన్ వంటి సమస్యలు రావచ్చు. చిరాకు, కోపం ఎక్కువవుతాయి. గుండె సంబంధిత సమస్యలు.. నిద్ర లోపం దీర్ఘకాలంగా ఉంటే.. అధిక రక్తపోటు, గుండెపోటు ప్రమాదం, స్ట్రోక్ వచ్చే అవకాశం పెరుగుతుంది. షుగర్, బరువు పెరగడం.. తక్కువ నిద్ర వల్ల ఇన్సులిన్ పనితీరు తగ్గుతుంది. ఆకలి పెంచే హార్మోన్లు ఎక్కువవుతాయి. ఊబకాయం (ాఎవబతిబిఎ), టైప్–2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. రోగనిరోధక శక్తి తగ్గిపోవడం.. నిద్ర సరిపోకపోతే శరీరం వైరస్‌లు, ఇన్ఫెక్షన్లను ఎదుర్కొనే శక్తిని కోల్పోతుంది. దీంతో తరచూ జలుబు, జ్వరం, అలసట లాంటివి వస్తుంటాయి. జ్ఞాపకశక్తి, పనితీరు తగ్గడం.. తక్కువ నిద్ర ఏకాగ్రతను తగ్గిస్తుంది. జ్ఞాపకశక్తి బలహీనమవుతుంది. పని లేదా చదువులో పని తీరు పడిపోతుంది.

# జామకాయ వీరికి యమ డేంజర్



జామపండును పేదవాడి యాపిల్ అని అంటారు. తక్కువ ధరలో దొరికే ఈ పండులో ఉండే పోషకాలు చూస్తే ఆశ్చర్యపోవాల్సిందే. అయితే అందరికీ ఈ పండు ఆరోగ్యాన్ని ఇవ్వదు. ఈ సూపర్‌ఫ్రూట్ అందరికీ సరిపడదు అన్న విషయం మీకు తెలుసా..? కొందరిలో ఇది జీర్ణ సమస్యలకు, మరికొందరిలో అలెర్జీలకు కారణమవుతుంది. ప్రకృతి మనకు ప్రసాదించిన అద్భుతమైన సూపర్‌ఫ్రూట్స్‌లో జామపండు ఒకటి. కేవలం రుచిలో మాత్రమే కాదు పోషకాల విషయంలోనూ ఇది మేటి. జామపండులో విటమిన్ సి, డైటరీ ఫైబర్, పొటాషియం, శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఒక జామపండులో నారింజ కంటే ఎక్కువ విటమిన్ సి ఉంటుంది. ఇది శరీర రోగనిరోధక శక్తిని పెంచి, ఇన్ఫెక్షన్ల నుంచి రక్షిస్తుంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మం ముడతలు పడకుండా కాపాడి, యవ్వనంగా కనిపించేలా చేస్తాయి. అధికంగా ఉండే ఫైబర్ మలబద్ధకాన్ని నివారిస్తుంది. ప్రేగుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. దీని గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటం వల్ల షుగర్ ఉన్నవారు మితంగా తీసుకుంటే మేలు జరుగుతుంది. అయితే ఆరోగ్యానికి అమృతంలా పనిచేసే జామపండు.. కొంతమందికి మాత్రం ఇబ్బందులను తెచ్చిపెడుతుంది. జామలో ఫ్రక్టోజ్, విటమిన్ సి అధికంగా ఉంటాయి. శరీరం గ్రహించగలిగే దానికంటే ఎక్కువ విటమిన్ సి తీసుకున్నప్పుడు అది ప్రేగులలో కిణ్వ ప్రక్రియకు దారితీసి గ్యాస్, కడుపు ఉబ్బరాన్ని కలిగిస్తుంది. ముఖ్యంగా నిద్రపోయే ముందు జామపండు తింటే ఈ సమస్య మరింత పెరుగుతుంది. జామపండు గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటం వల్ల షుగర్ ఉన్నవారికి ఇది మంచిదే. కానీ అతిగా తింటే మాత్రం రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరగవచ్చు. డయాబెటిస్ ఉన్నవారు రోజుకు 1–2 చిన్న పండ్లకు మాత్రమే పరిమితం అవ్వడం మంచిది. ఎఖా వంటి సున్నితమైన జీర్ణశయాంతర సమస్యలు ఉన్నవారికి జామలోని అధిక ఫైబర్ చికాకు కలిగించవచ్చు. దీనివల్ల కడుపు తిమ్మిరి, విరేచనాలు లేదా అధిక అపానవాయువు వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇలాంటి వారు తొక్క తీసి తినడం లేదా వండిన రూపంలో తీసుకోవడం ఉత్తమం. జామ ఆకులలోని కొన్ని బయోయాక్టివ్ సమ్మేళనాలు సున్నితమైన చర్మం ఉన్నవారికి అలెర్జీని కలిగించవచ్చు. దీనివల్ల చర్మం ఎర్రబడటం, దురద లేదా మంట రావచ్చు. చర్మ సమస్యలు ఉన్నవారు జామను వాడే ముందు నిపుణుల సలహా తీసుకోవాలి. జామపండును ఖాళీ కడుపుతో కాకుండా భోజనంతో పాటు లేదా స్నాక్ లాగా చిన్న భాగాల్లో తీసుకోవడం మంచిది. ఏ పండైనా మితంగా తీసుకున్నప్పుడే అది ఔషధంగా పనిచేస్తుంది. మీకు పైన పేర్కొన్న ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉంటే, జామను మీ డైట్‌లో చేర్చుకునే ముందు పోషకాహార నిపుణుడిని సంప్రదించండి.

ధర్మఘంట

# మానవతా సేవలను మరింత విస్తృతం చేయాలి

**రాజ్ భవన్ లో రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి మొదటి సమావేశం లో గవర్నర్**

**హైదరాబాద్ :** రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి మొదటి సమావేశం లోక్ భవన్ (రాజ్ భవన్ )లో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశం లో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ మరియు రాష్ట్ర రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు విష్ణుదేవ్ వర్మ పాల్గొన్నారు.లోక్ భవన్లో నిర్వహించిన రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి మొదటి సమావేశంలో రాష్ట్ర గవర్నర్, రెడ్ క్రాస్ అధ్యక్షులు జిష్ణుదేవ్ వర్మ గారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయం అని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు అందించే మానవతా సేవలను మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. యువత, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో రెడ్ క్రాస్ కార్యకలాపాలను గ్రామస్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. ఆరోగ్యం, విపత్తు నిర్వహణ, రక్తదానం, పోషణ వంటి రంగాల్లో రెడ్ క్రాస్ పాత్రను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.రాష్ట్రంలో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ సేవా కార్యక్రమాలపై ఈ సందర్భంగా సమగ్రంగా చర్చ జరిగింది. ముఖ్యంగా రాష్ట్ర ఏజీఎం ను త్వరలో ఏర్పాటు రెడ్ క్రాస్ సొసైటీ యాక్టివిటీస్ విస్తరణ, రక్తదాన శిబిరాల నిర్వహణ ద్వారా దేశవ్యాప్తంగా ప్రథమ స్థానంలో నిలిచేలా కార్యాచరణ శాశ్వత సభ్యత్వ నమోదు పెంపుపై ప్రత్యేక దృష్టి వంటి అంశాలపై స్పష్టమైన దిశానిర్దేశం జరిగింది. జూనియర్, యూత్ రెడ్ క్రాస్ను మరింత బలోపేతం చేసి యువతను సేవా కార్యక్రమాల వైపు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో రెడ్ క్రాస్ సొసైటీని



బలోపేతం చేయడానికి తన వంతు పూర్తి కృషి చేస్తానని గవర్నర్ గారు స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల నిర్మూలన అవగాహన సదస్సులు నిర్వహించాలి ఈ సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ మరియు తెలంగాణ రెడ్ క్రాస్ సొసైటీ ఇంఛార్జ్ చైర్మన్ యం. దాన కిషోర్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి అనితారామచంద్రన్ ఐఏఎస్, విమెన్ అండ్ చైల్డ్ డెవలప్మెంట్ డైరెక్టర్ శృతి ఓజా ఐఏఎస్, మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్ సెక్రటరీ ఆయెషా మస్రత్ ఖణం ఐఏఎస్, ఎడ్యుకేషనల్ స్పెషల్ సెక్రటరీ : జి. వెంకటేశ్వర్లు, ఐఏఎస్ వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ మరియు రాష్ట్ర పాలక మండలి సభ్యులు సాయి చౌదరి పాల్గొని, వికారాబాద్ జిల్లాలో జరుగుతున్న రెడ్ క్రాస్ సేవా కార్యక్రమాలు, శాశ్వత సభ్యుల జాబితా, నివేదికను గవర్నర్ కి వివరించారు.ఈ సమావేశంలో పలు జిల్లాల రెడ్ క్రాస్ చైర్మన్లు, రాష్ట్ర పాలక మండలి సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# స్వలాభం కోసమే హుస్నాబాదును కరీంనగర్‌లో కలిపేందుకు మంత్రి పొన్నం కుట్రలు!

**మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్**

**హుస్నాబాద్ :** ఆర్డిఓ, ఎసిపి కార్యాలయాల ఏర్పాటు కోసం కాంగ్రెస్ నాయకులు ధర్నాలు చేయలేదా,టిఆర్ఎస్ హయాం లో తప్ప ఈ రెండేళ్లలో హుస్నాబాద్ లో జరిగిన అభివృద్ధి ఏమీ లేదు.కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించింది.అందుకే ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ బాకీ కార్డును పంపిణీ చేస్తున్నాం.వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నాం. బిఆర్ఎస్ పార్టీ ఇంటింటి ప్రచార కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్.తన రాజకీయ లబ్ధి కోసమే హుస్నాబాద్ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ ను కరీంనగర్ లో విలీనం చేసేందుకు కుట్రలు చేస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్ ఆరోపించారు. గురువారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లోని హనుమకొండ రోడ్డు నుంచి సిద్దిపేట రోడ్డు వరకు స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేశారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ. గతంలో హుస్నాబాద్, కోహెడ, అకన్నపేట మండలాలను అశాస్త్రీయంగా, ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా సిద్దిపేట జిల్లాలో కలిపారని మంత్రి పొన్నం మాట్లాడడం ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనం అన్నారు. జిల్లాల ఏర్పాటు సమయంలో ఈ మూడు మండలాల్లో గ్రామాల వారీగా గ్రామసభలు నిర్వహించి ప్రజాభిప్రాయం మేరకే శాస్త్రీయంగానే సిద్దిపేటలో కలిపామనేది ఆయన తెలుసుకోవాలన్నారు. ఏ జిల్లాకు మారినప్పటికీ మాకు ఆర్డిఓ, ఏసీపీ కార్యాలయాలు ఉంటే చాలు అని స్వయంగా కాంగ్రెస్ నాయకులు ధర్నాలు చేశారనేది గుర్తు పెట్టుకోవాలన్నారు. కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ధర్నా టెంట్ వద్దకు వెళ్లి తానే



స్వయంగా హామీ ఇచ్చానని, ఇది ఇక్కడి కాంగ్రెస్ నాయకులకు తెలియదా అని ప్రశ్నించారు. కరీంనగర్ లో కలపాలని ప్రజలు ఎవరు కోరుకోవడం లేదని, మంత్రి తన ప్రయోజనం కోసం మాత్రమే కొత్త వివాదానికి తెరలేపుతూ ప్రజల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నాడని అన్నారు. మరోసారి కరీంనగర్ లో విలీనం అనే మాట ఎత్తితే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ప్రజలకు బాకీ పడ్డ సొమ్మును కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించాల్సిందేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేయడంతో పాటు వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేయాలని కోరుతూ ఇంటింటి ప్రచారం ప్రారంభించినట్లు సతీష్ కుమార్ వివరించారు. హుస్నాబాద్ పట్టణ ప్రజల మద్దతుతో, కార్యకర్తల కృషితో మూడోసారి కచ్చితంగా హుస్నాబాద్ మున్సిపల్ లో గులాబీ జెండాను ఎగరవేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# పేదల భూములు చట్టవిరుద్ధంగా లాక్కుంటున్న రేవంత్ సర్కార్

ల్యాండ్ పూలింగ్ పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చట్ట విరుద్ధంగా పేదల భూములను లాక్కుంటుందని బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. భూములు ఎందుకోసం తీసుకుంటున్నారు, ఏం కంపెనీలు పెడతారు,ఎలాంటి అభివృద్ధి చేస్తారో చెప్పకుండా పేదలను మోసం చేసి అన్యాయంగా విలువైన భూములను ఆక్రమించాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి ప్రజా ప్రయోజనాలు లేనపుడు ప్రభుత్వం పేదల భూములు సేకరించడం చట్టవిరుద్ధమన్నారు. షాబాద్ మండలంలోని రేగడిదొస్వాడ, మక్తగూడెం, తాళ్లపల్లి, తిమ్మారెడండిగూడెం గ్రామాలకు చెందిన ఎస్సీల అసైన్డ్ భూములు బలవంతంగా లాక్కోవడాన్ని వ్యతిరేకిస్తూ జరిగిన సమావేశం లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ఈశా ఫౌండేషన్ కోసం భూములు ఇవ్వడానికి పేదల భూములే దొరికాయా? అందుకోసం ఫ్యూచర్ సిటీలో 100 ఎకరాలు కేటాయించవచ్చు కదా అని నిలదీశారు. ధనవంతులు విశ్రాంతి తీసుకోవడానికి నిర్మించే ఆశ్రమాల కోసం పేద ఎస్సీల భూములు కావాలా అంటూ నిలదీశారు. రేవంత్ రెడ్డి మేమూ భూస్వాములమేనని చెప్పుకున్నారు,మరి వాళ్ల భూములను ఈశా ఫౌండేషన్ వారికి ఇవ్వొచ్చు కదా అని ప్రశ్నించారు. ఈశా ఫౌండేషన్ వల్ల ఇక్కడి పేదలకు జరిగే లాభం ఏంటని అడిగారు. పేదలకు ఉద్యోగాలిస్తారా,చదువు చెప్తారా? హాస్పిటల్ నిర్మిస్తారా అంటూ ధ్వజమెత్తారు.దానివల్ల పేదలకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. చేవెళ్ల సాక్షిగా మల్లిఖార్జున ఖర్గే సమక్షంలో, పేదల అసైన్డ్ భూములకు పట్టాలు ఇస్తామని ప్రకటించి అధికారంలోకి వచ్చాక, లగచర్లలో అల్లుడి ఫార్మా కంపెనీ కోసం గిరిజనుల భూమిని లక్కోవాలని చూశారని, ఇపుడు సద్గురు బాబా కోసం రేవంత్ బాబా ఎస్సీల భూములు లాక్కోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. కేసిఆర్



పేదలను పుట్టినప్పటి నుండి కేసిఆర్ కిట్ ఇచ్చి,గురుకులాలు పెట్టి డాక్టర్లను తయారు చేసి, పేదలకు మూడు ఎకరాల భూమి ఇచ్చి,దళిత బంధుతో వ్యాపారస్తులుగా తయారు చేయాలని చూశారన్నారు. కానీ రేవంత్ రెడ్డి మాత్రం పేదల భూములు లాక్కొని నిరాశ్రయులను చేసి,అడ్డా కూలీలుగా మార్చాలని చూస్తున్నారని విమర్శించారు. కంపెనీలు పెట్టుకోవడానికి హైదరాబాద్ చుట్టుపక్కల వేల ఎకరాల భూమి అందుబాటులో ఉన్నా,రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎస్సీల భూమిని లాక్కొని వారి పొట్టకొట్టాలని చూస్తున్నారన్నారు. కంపెనీల కోసం కేటాయించిన భూములను హిల్ట్ పాలసీ కింద తక్కువ ధరకు అమ్ముకోవాలని చూస్తున్నారన్నారు. ఎన్నికల ముందు మాయమాటలు చెప్పి,అధికారంలోకి వచ్చాక రేవంత్ రెడ్డి సెక్రటేరియట్ లో పెట్టే ప్రతి సంతకం, పేదలకు వ్యతిరేకంగానే చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ,మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఒడిషాలో బొగ్గు కాంట్రాక్టు కోసం మహిళా ఐఏఎస్ అధికారిని గురించి చెడుగా ప్రచారం చేశారన్నారు. దీనిని ప్రశ్నించినందుకు,గోదావరి,కృష్ణా జలాల్లో తెలంగాణ ప్రాంతానికి అన్యాయం జరుగుతుందని మాట్లాడినందుకు మాజీ మంత్రి హరీష్ రావుకు నోటీసులు ఇచ్చి, 9 గంటల పాటు విచారణ పేరుతో వేధించారన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఎస్సీ ఎస్టీల అసైన్డ్ భూములకు పట్టా బుక్ జారీచేసి,పేదలకు భూములపై సర్వ హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. వెంటనే షాబాద్ మండలంలోని రేగడిదోస్వాడలో భూమి సేకరణకు ప్రయత్నం చేస్తే, లగచర్ల స్ఫూర్తిగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం, భూమి మార్కెట్ విలువకు 3 రెట్లు నష్టపరిహారం చెల్లించాలన్నారు. అంతేకాకుండా భూమికి బదులు భూమే కావాలని డిమాండ్ చేశారు. అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్లి పేదలకు న్యాయం జరిగేదాక పోరాడుతామన్నారు. రేగడిదోస్వాడ, మక్తగూడెం, వెంకన్నగూడెం, తాళ్లపల్లి,తిమ్మారెడ్డి గూడెం గ్రామాల భూములు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. అవసరమైతే రైతులను చంపి భూములుగా లాక్కోండన్నారు. 70 ఏళ్ల నుండి భూమిని సాగు చేస్తున్న రైతులను అకస్మాత్తుగా వెళ్లమంటే ఎలా వెళ్తారన్నా షాబాద్ మాజీ జడ్పిటిసి అవినాష్ రెడ్డి నాయకత్వంలో జరిగిన సమావేశంలో సీనియర్ నాయకులు శ్రీనివాస్ గౌడ్,దేశమల్ల ఆంజనేయులు,విజయ్ ఆర్య,మాజీ సర్పంచ్ లు,ఎంపిటిసి లు తదితరులు పాల్గొన్నారు.

## రేకుర్తి సమ్మక్ -సారక్క జాతరకు పటిష్ట బందోబస్తు

**సీపీ గౌష్ ఆలం**

**కరీంనగర్ :** రేకుర్తిలో జనవరి 28 నుండి 31 వరకు అత్యంత వైభవంగా జరగనున్న సమ్మక్క–సారక్క జాతరను పురస్కరించుకొని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం గురువారం బందోబస్తు ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. జాతర జరిగే ప్రాంతాన్ని సందర్శించిన సీపీ, బందోబస్తు మ్యాప్‌ను పర్యవేక్షించి అధికారులకు దిశానిర్దేశం చేశారు.?ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ. జాతరకు వచ్చే వేలాది మంది భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన భద్రత కల్పించాలని అధికారులను ఆదేశించారు. అమ్మవార్ల గద్దెల వద్ద భక్తుల రద్దీని నియంత్రించేందుకు పటిష్టమైన బారికేడింగ్









ఏర్పాటు చేయాలన్నారు. జాతర ప్రాంగణంలో నిరంతర నిఘా కోసం ప్రత్యేక పోలీస్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి, భక్తులకు అవసరమైన సహాయం అందించాల న్నారు. జాతర సమయంలో వాహనాల రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పార్కింగ్ స్థలాలను కేటాయించి, రాక పోకలను క్రమబద్ధీకరిం చాలని సూచించారు. భక్తుల దర్శనం సజావుగా సాగేలా ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు క్షేత్రస్థాయిలో సిబ్బందిని సమన్వయం చేసుకోవాలన్నారు.?అనంతరం ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు సీపీ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.?ఈ కార్యక్రమంలో ఏసీపీ విజయకుమార్ ఇన్‌స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్ మరియు ఇతర పోలీసు అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.

## బై పాస్ రోడ్ విస్తరణ పనుల్లో జాప్యంపై హెచ్ఎండిఏ అధికారులపై జగ్గారెడ్డి, నిర్మల ఆగ్రహం

**బైపాస్ రోడ్ విస్తరణ పనులు వేగవంతం చేయాలని ఆదేశం**

**ఆగ మేఘాల మీద కదిలిన యంత్రాంగం**

**ఐబి కాంపౌండ్ వాల్ కూల్చి వేసి, చెట్లను నరికి రోడ్ విస్తరణ పనులు ప్రారంభించిన అధికారులు**

**సంగారెడ్డి :** సంగారెడ్డి పట్టణం లోని బైపాస్ రోడ్ విస్తరణ పనుల్లో జాప్యం పై ఊఓఆం అధికారులపై జగ్గారెడ్డి, నిర్మల ఆగ్రహం వ్యక్తం చేశారు. విస్తరణ పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. దీంతో. గురువారం ఉదయం నుండే అధికారులు ఆగ మేఘాలపై పనులు ప్రారంభించారు. ఐబి ప్రహారీ గోడ ను జేసిబి ల సహాయంతో కూల్చి వేశారు. రోడ్ కు అడ్డంగా ఉన్న చెట్లను నరికి వేసి రోడ్ వెడల్పు పనులు ప్రారంభించారు. పనులకు అంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు ఐబి గెస్ట్ హౌస్ నుండి సంగారెడ్డి మండల పరిషత్ కార్యాలయం వరకు భారీకేడ్లను ఏర్పాటు చేసి రాకపోకలను నియంత్రించారు. విస్తరణ పనులు వేగవంతం కావడం పై పట్టణ వాసులు సంతోషం వ్యక్తం చేశారు. విస్తరణ పనులు పూర్తయితే ఐబి గెస్ట్ హౌస్ నుండి మొదలుకొని బస్వేశ్వర విగ్రహం వరకు ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవని పట్టణ వాసులు ఆశాభావం వ్యక్తం చేశారు. టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జార్జ్, నాయకులు షఫీ హాఫీజ్, కిరణ్ గౌడ్ లు ఐబి వద్ద పనులను పర్యవేక్షించారు.

## ఉస్మానియాలో 'ప్రజాస్వామ్య గొంతుకల అణచివేత'

**ప్రొఫెసర్ మనోహర్ అక్రమ సస్పెన్షన్‌పై**

**గవర్నర్‌కు డాక్టర్ శ్రవణ్ దాసోజు ఫిర్యాదు**

**హైదరాబాద్ :** ఉస్మానియా విశ్వవిద్యాలయ (రాజ) ప్రస్తుత పాలన తీరుపై మాజీ ఎమ్మెల్సీ, సీనియర్ నేత డాక్టర్ శ్రవణ్ కుమార్ దాసోజు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కెమిస్ట్రీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ బి. మనోహర్‌ను అక్రమంగా, ఏకపక్షంగా సస్పెండ్ చేయడం "భావప్రకటనా స్వేచ్ఛను క్రూరంగా అణచివేయడమే" అని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరుతూ తెలంగాణ గవర్నర్, రాష్ట్ర విశ్వవిద్యాలయాల ఛాన్సలర్‌కు గురువారం ఆయన ఒక వినతిపత్రాన్ని సమర్పించారు.జనవరి 12, 2026 నాటి సస్పెన్షన్ ఉత్తర్వు కేవలం పరిపాలనాపరమైన లోపం కాదని, ఇది విశ్వవిద్యాలయంలో భయాందోళనలను సృష్టించేందుకు అధికార దుర్వినియోగానికి పాల్పడడమేనని డాక్టర్ శ్రవణ్ మండిపడ్డారు.'నిశ్శబ్ద జైళ్లు'గా మారుతున్న విశ్వవిద్యాలయాలువిశ్వవిద్యాలయాల్లో నెలకొన్న ప్రస్తుత గందరగోళ పరిస్థితిపై డాక్టర్ శ్రవణ్ ఆవేదన వ్యక్తం చేశారు. "విశ్వవిద్యాలయాలు సమాజానికి నైతిక దిక్సూచిలా (అనీనిబఇతివనిఇవ ఐవవజూవతీబ) ఉండాలి. కానీ, నేడు వాటిని నిశ్శబ్దానికి నిలయాలుగా, బానిసత్వానికి వేదికలుగా మారుస్తున్నారు," అని ఆయన విమర్శించారు. పరిపాలనలో జరుగుతున్న లోపాలపై గొంతు ఎత్తినందుకు ఒక సీనియర్ ప్రొఫెసర్‌ను సస్పెండ్ చేయడం నియంతృత్వ పోకడ అని, ఇది ప్రశ్నించే తత్వాన్ని నేరంగా పరిగణించడమేనని ఆయన దుయ్యబట్టారు. విద్యా సంస్థలను "రోబోటిక్ మిషన్లు"గా మార్చవద్దని హెచ్చరించారు.

## ఇంకా తేలని టీజీపీఎస్సీ గ్రూప్ 1 వివాదం.. హైకోర్టు తీర్పు మళ్లీ వాయిదా!

**హైదరాబాద్ :**



తెలంగాణ రాష్ట్ర గ్రూప్ 1 నియామకాలకు సంబంధించి హైకోర్టు తీర్పు మళ్లీ వాయిదా పడింది. తీర్పు కాపీ సిద్ధం కాలేదని, ఫిబ్రవరి 5న తుది తీర్పు వెల్లడించనున్నట్లు గురువారం (జనవరి 22) డివిజన్ బెంచ్ వెల్లడించింది. టీజీపీఎస్సీ గ్రూప్ 1 నియామకాలపై గతంలో సింగిల్ బెంచ్ స్టే ఇచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై టీజీపీఎస్సీతో పాటు, గ్రూప్ 1 పోస్టులకు ఎంపికైన పలువురు అభ్యర్థులు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. ఆ అప్పీళ్లను విచారన జరిపిన ధర్మాసనం స్టే ఎత్తి వేసింది. గతంలోనే విచారణ పూర్తి చేసింది కూడా. నియామకాలు తుది ఉత్తర్వులకు లోబడి ఉంటాయని విచారణ సమయంలో తెలిపింది. అనేక మలుపులు తిరిగిన గ్రూప్ 1 మెయిన్స్ ఎగ్జామ్‌లో ఇప్పటికే నియామకాలు కూడా పూర్తయ్యాయి. మొత్తం 562 మందికి రేవంత్ సర్కార్ నియామక పత్రాలు సైతం అందజేసింది. దీనిపై తీర్పు ఈ రోజు వెలువడాల్సి ఉండగా.. ఫిబ్రవరి 5వ తేదీకి అది వాయిదా పడింది.టీజీపీఎస్సీ గ్రూప్ 1 పరీక్షల నిర్వహణలో అవకతవకలు జరిగాయని, తిరిగి మూల్యాంకనం చేయాలని పలువురు అభ్యర్థులు హైకోర్టులో పిటీషన్లు వేశారు. విచారణ జరిపిన సింగిల్ బెంచ్ పారదర్శకత లోపించిందన్న కారణంతో గ్రూప్ 1 మార్కుల తుది జాబితా, జనరల్ ర్యాంకులను రద్దు చేసింది. ఫలితాలు రద్దుచేసి, తిరిగి మూల్యాంకనం చేయాలని హైకోర్టు సింగిల్ బెంచ్ తీర్పు ఇచ్చింది. జవాబుపత్రాలను పునర్ మూల్యాంకనం చేయలేనిపక్షంలో మళ్లీ పరీక్షలు నిర్వహించాలని సింగిల్ జడ్జి తీర్పు వెలువరించింది. అయితే ఆ తీర్పును సవాలు చేస్తూ టీజీపీఎస్సీతోపాటు, ఇప్పటికే గ్రూప్ 1 నియామక పత్రాలు అందుకున్న పలువురు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. ఈ అప్పీళ్లపై హైకోర్టు గతంలోనే విచారణ పూర్తి చేసి, తీర్పు రిజర్వ్ చేసింది. గురువారం తీర్పు వెలువరించాల్సి ఉండగా.. అది మళ్లీ ఫిబ్రవరి 5కి వాయిదా పడింది.

# బిజినెస్

## సామాన్యుల కోసం ఎస్బీఐలో బెస్ట్ పొదుపు స్కీమ్




రోజు వారీ కూలీలు, నిర్మాణ రంగంలోని కార్మికులు రోజంతా కష్టపడి వచ్చిన కొద్ది డబ్బుతో తమ కుటుంబాన్ని పోషించుకుంటారు. వారు పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టడం అసాధ్యమనే చెప్పాలి.దీంతో కూలీ డబ్బుల్లోంచి కొంత తీసి ఇంట్లో దాచుకుంటుంటారు. అయితే ఇంట్లో దాయడం వల్ల దొంగతనం జరగడం, ఎలుకల బెడత వంటివి ఉంటాయి. అలాంటి సామాన్య ప్రజలు చిన్న మొత్తాల్లో పొదుపు చేసుకునేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) అద్భుతమైన పొదుపు పథకం అందిస్తోంది. పొదుపు ఖాతాను మించిన వడ్డీ రేటు ఆఫర్ చేస్తోంది. అదే ఎస్‌బీఐ రికరింగ్ డిపాజిట్ స్కీమ్. నిర్ణీత కాలానికి చిన్న మొత్తాల్లో పొదుపు చేసుకునేందుకు ఈ రికరింగ్ డిపాజిట్ స్కీమ్ అవకాశం కల్పిస్తుంది. తమ ఆర్థిక లక్ష్యాన్ని చేరుకునేందుకు చేయూతనిస్తుంది. ఈస్కీమ్ కనీస మెచ్యూరిటీ కాలం 12 నెలలు. గరిష్ఠంగా 120 నెలలు (5 సంవత్సరాలు) పొదుపు చేసేందుకు అవకాశం ఉంటుంది. దేశంలోని అన్ని ఎస్‌బీఐ బ్యాంకు బ్రాంచీల్లో ఈ రికరింగ్ డిపాజిట్ స్కీమ్ అందుబాటులో ఉంటుంది.నెలవారీ కనీస డిపాజిట్ రూ.100 మాత్రమే. ఆ తర్వాత ఎంత మొత్తమైనా పొదుపు చేసుకోవచ్చు. అయితే, ప్రతి నెలా టైమ్‌కి డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. గడువులోగా డబ్బులు కట్టకపోతే పెనాల్టీ ఉంటుంది. వరుసగా ఆరు నెలలు డిపాజిట్ చేయకపోతే అకౌంట్ మూసేస్తారు. ఖాతాదారుకు అందులోని డబ్బులను తిరిగి ఇచ్చేస్తారు.

ఎస్‌బీఐ రికరింగ్ డిపాజిట్ స్కీమ్‌లో నెలకు రూ.100 లేదా రూ.500 చొప్పున పొదుపు చేయాలని మీరు అనుకుంటే ఆర్‌డీ ఖాతా తెరవాల్సి ఉంటుంది.మీరు 5 సంవత్సరాల మెచ్యూరిటీ వ్యవధి ఎంచుకుంటే అప్పుడు వడ్డీ రేటు 6.50 శాతం ఉంటుంది. 60 ఏళ్ల వయసు దాటిన సీనియర్ సిటిజన్లు అయితే వడ్డీ రేటు 7 శాతంగా ఉంటుంది. 5 సంవత్సరాల తర్వాత ఎంత వస్తుందో ఆన్‌లైన్ కాలిక్యులేటర్ ద్వారా ముందే లెక్కగట్టవచ్చు. నెలకు రూ.100 చొప్పున పొదుపు చేసిన వారికి 5 ఏళ్ల తర్వాత మీ డిపాజిట్ మొత్తం రూ.6 వేలు అవుతుంది. దానిపై వడ్డీ రూ.1,106 వస్తుంది. అంటే అసలు వడ్డీ కలిపి మొత్తం రూ.7,106 వస్తాయి. ఇక నెలకు రూ.500 చొప్పున పొదుపు చేశారు అనుకుందాం. 5 సంవత్సరాల తర్వాత మీ డిపాజిట్ మొత్తం రూ.30 వేలు అవుతుంది. వడ్డీ రూ.5,528 వస్తుంది. మొత్తంగా అసలు, వడ్డీ కలిపి రూ. 35,528 వస్తాయి. అదే నెలకు రూ.1000 జమ చేస్తే చేతికి అసలు, వడ్డీ కలిపి రూ.71,057 వరకు లభిస్తాయి. సీనియర్ సిటిజన్లు అయితే 7 శాతం వడ్డీ లభిస్తుంది.

## భారత్‌తో త్వరలోనే భారీ వాణిజ్య ఒప్పందం



స్విట్జర్లాండ్‌లోని దావోస్ వేదికగా జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్- 2026 సదస్సు లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాల్గొన్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన భారత్-అమెరికా మధ్య జరగబోయే వాణిజ్య ఒప్పందం, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని ప్రశంసిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. మోదీపై తనకు అపారమైన గౌరవం ఉందన్నారు. ఆయన తనకు మంచి స్నేహితుడు మాత్రమే కాదు, ఒక అద్భుతమైన నాయకుడని కితాబిచ్చారు. ఇరు దేశాల మధ్య ఉన్న సంబంధాలు మోదీ నాయకత్వంలో మరింత బలోపేతం అయ్యాయని ఆయన పేర్కొన్నారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం (ıతీజీటవ ఆవజీశ్రీ) గురించి ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు. తాము భారత్‌తో ఒక అద్భుతమైన ఒప్పందాన్ని కుదుర్చుకోబోతున్నాం. దీనిపై చర్చలు తుది దశకు చేరుకున్నాయని అన్నారు. ఈ ఒప్పందం ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థలకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని కామెంట్ చేశారు. ప్రపంచ దేశాలతో వాణిజ్యపరమైన సవాళ్లు ఉన్నప్పటికీ, భారత్‌ను అమెరికా ఒక నమ్మకమైన మరియు వ్యూహాత్మక భాగస్వామిగా చూస్తోందని ట్రంప్ స్పష్టం చేశారు. 2030 నాటికి ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 500 బిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యంగా ఈ కొత్త ఒప్పందం ఉండబోతోందని సమాచారం. కాగా, గతంలో కొన్ని సుంకాల (ıజీతీతిటటబ) విషయంలో విభేదాలు వచ్చినప్పటికీ, ట్రంప్ తాజా వ్యాఖ్యలతో ఆ అడ్డంకులు తొలగిపోయి, త్వరలోనే చారిత్రాత్మక వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## డాక్టర్ రెడ్డీస్ లాభం రూ.1,210 కోట్లు




డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ ఏకీకృత ఖాతాల ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.8,726.8 కోట్ల ఆదాయం, రూ.1,210 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఈపీఎస్ రూ.14.53గా నమోదైంది. 2024-25 ఇదే కాలంలో ఆదాయం రూ.8,358.6 కోట్లు, నికర లాభం రూ.1,413 కోట్లుగా ఉన్నాయి. దీంతో పోలిస్తే ఈసారి ఆదాయం 4.4 శాతం పెరిగింది. నికర లాభం 14 శాతం క్షీణించింది. బ్రాండెడ్ ఔషధాల మార్కెట్లో బలమైన వృద్ధి నమోదైనప్పటికీ, అమెరికాలో లెనాలిడోమైడ్ విక్రయాలు తగ్గడం, కొత్త లేబర్ కోడ్ నిబంధనల వల్ల ఏర్పడిన అదనపు ఖర్చుల కారణంగా నికర లాభంలో క్షీణత నమోదైనట్లు కంపెనీ పేర్కొంది. '2025-26 మూడో త్రైమాసికంలో మా వృద్ధికి బ్రాండెడ్ వ్యాపారాల్లో కొనసాగుతున్న జోరు అనుకూలంగా నిలిచింది. విదేశీ మారక ద్రవ్య విలువలు మద్దతుగా నిలిచాయి. ఇది లెనాలిడోమైడ్ విక్రయాల తగ్గుదల ప్రభావాన్ని భర్తీ చేసింది. మా వాటాదారులకు దీర్ఘకాలిక విలువను సృష్టించేందుకు మా భవిష్యత్తు వ్యూహాలను అమలు చేయడం, కార్యాచరణ సామర్థ్యాన్ని పెంచుకోవడంపై దృష్టి సారించాం' అని ఫలితాల సందర్భంగా డాక్టర్ రెడ్డీస్ సహ ఛైర్మన్, ఎండీ జీవీ ప్రసాద్ అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-డిసెంబరు మధ్య కాలంలో డాక్టర్ రెడ్డీస్ రూ.26,077 కోట్ల ఆదాయంపై రూ.4,065 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే 9 నెలల కాలంలో ఆదాయం రూ.24,047 కోట్లు, నికర లాభం రూ.4,060 కోట్లుగా ఉంది.

## వరుస షాకులిచ్చి.. భారీగా పడిపోయిన బంగారం ధరలు!




బ్రేకుల్లేకుండా దూసుకెళ్లిన బంగారం ధరలు నేడు శాంతించాయి. గత మూడ్రోజులుగా వరుస షాకులు తిన్న మహిళలకు నేడు కాస్త ఊరట లభించింది. ఇక ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా మహిళలు బంగారు అభరణాలు ధరిస్తారు. ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాల్లోని మహిళలందరూ బంగారానికి ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తారు. అనేక రకాల డిజైన్లతో లక్షల్లో విలువ చేసే కమ్మలు, నెక్లెస్లు, బ్యాంగిల్స్ వంటివి కొనుగోలు చేస్తుంటారు. ఆడవాళ్లకు ప్రతిరోజూ షాపింగ్ చేసినా బోర్ కొట్టదనడంలో ఎటువంటి సందేహం లేదని చెప్పవచ్చు. కాగా గోల్డ్ రేట్లు ఎప్పుడెప్పుడు తగ్గుతాయా? అంటూ మహిళలు వేయి కళ్లతో ఎదురుచూస్తుంటారు. కాస్త పసిడి ధరలు తగ్గుముఖం పట్టగానే బంగారం షాపుల్లో ఎగబడుతారు. అయితే ఇటీవల బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు జరుగుతోన్న విషయం తెలిసిందే. ఈ రేట్లతో మహిళల్లో ఓసారి ఉత్సాహం నెలకొనగా... మరోసారి నిరాశకు గురవుతుంటారు. ముఖ్యంగా ఈ మధ్య కాలంలో బంగారం రేట్లు భారీగా పెరుగుతున్నాయి. కొంచెం తగ్గగానే డబుల్, త్రిబుల్ ధర పెరుగుతుంది. ఇవాళ గోల్డ్ ప్రియులకు కాస్త ఊరట లభించింది. నిన్న 22 క్యారెట్లు.. 10 గ్రాముల బంగారం రూ.1,43,550 ఉండగా.. నేడు రూ. 2,100 తగ్గి రూ. 1, 41, 450గా ఉంది. ఇక నిన్న 24 క్యారెట్లు 10 గ్రాముల బంగారం ధర రూ.1,56,600 గా ఉంది. నేడు రూ.2,290 తగ్గి రూ.1,54, 310 గా ఉంది. కాగా ఈ నేపథ్యంలో నిన్నటి ధరతో పోలిస్తే ఇవాళ పసిడి ధరల్లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి.

## మా తుది నిర్ణయం ఇదే బంగ్లాదేశ్ సంచలన ప్రకటన




బంగ్లాదేశ్ పంతం వీడలేదు. భారత్‌లో టీ20 ప్రపంచకప్-2026 ఆడే విషయమై తమ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని మరోసారి పునరుద్ఘాటించింది. అయితే, అంతర్జాతీయ క్రికెట్ మండలి తమ విషయంలో న్యాయంగా వ్యవహరిస్తుందనే నమ్మకం ఉందని తెలిపింది.

శ్రీలంకకు మార్చాలని కాగా భారత్- బంగ్లాదేశ్ మధ్య రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో భద్రతా కారణాలు సాకుగా చూపుతూ.. బంగ్లాదేశ్ తమ ప్లేయర్లను భారత్‌కు పంపడానికి నిరాకరిస్తోంది. భారత్‌కు బదులు తమ మ్యాచ్‌ల వేదికలను శ్రీలంకకు మార్చాలని ఐసీసీకి విజ్ఞప్తి చేసింది. అయితే, బంగ్లాదేశ్ చెప్పినట్లు భారత్‌లో బంగ్లాదేశ్ ఆటగాళ్లు, ఇతర సిబ్బందికి వచ్చిన ముప్పేమీ లేదని ఐసీసీ బుధవారం స్పష్టం చేసింది.

కుండబద్దలు బద్దలు కొట్టిన ఐసీసీ

మరో 24 గంటల సమయం ఇస్తున్నామని.. ఒకవేళ వరల్డ్‌కప్ నుంచి బంగ్లాదేశ్ వైదొలగానుకుంటే.. ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్‌ను ఆడిస్తామని ఐసీసీ కుండబద్దలు కొట్టింది. ఈ నేపథ్యంలో గురువారం బంగ్లా క్రికెట్ బోర్డు అధ్యక్షుడు అమినుల్ ఇస్లాం స్పందిస్తూ.. తమ ప్రభుత్వంతో చర్చించిన తర్వాతే తుది నిర్ణయం వెలువడుతుందని పేర్కొన్నాడు.

తాజా సమాచారం ప్రకారం.. భారత్‌లో టీ20 ప్రపంచకప్-2026 మ్యాచ్‌లు ఆడవద్దని బంగ్లాదేశ్ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. బంగ్లా జాతీయ జట్టు ఆటగాళ్లు, దేశ క్రీడా, యువజన శాఖ మంత్రి ఆసిఫ్ నజ్రుల్‌తో సమావేశం అనంతరం బోర్డు తమ వైఖరిని వెల్లడించింది.

### నమ్మకాన్ని కోల్పోవడం లేదు

ఈ మేరకు మీడియా సమావేశంలో నజ్రుల్ మాట్లాడుతూ.. "ప్రపంచకప్ టోర్నీకి అర్హత సాధించేందుకు మా క్రికెటర్లు ఎంతగానో కష్టపడ్డారు. అయితే, ఇండియాలో మా భద్రతపై అనుమానాలు అలాగే ఉన్నాయి. ఏవో కొన్ని పరిశీలన (ఐసీసీ)లు చేసి ముప్పు లేదనే నిర్ణయానికి రాకూడదు. ఇప్పటికీ మేము నమ్మకాన్ని కోల్పోవడం లేదు. టోర్నీకి మా జట్టు సిద్ధంగా ఉంది. ఐసీసీ మా అభ్యర్థనను మన్నించి.. న్యాయమైన నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నాం. మమ్మల్ని శ్రీలంకలో ఆడేందుకు అనుమతిస్తారని ఆశాభావంతో ఉన్నాము" అని పేర్కొన్నాడు.

### కచ్చితంగా ఐసీసీ వైఫల్యమే

ఇక బీసీబీ అధ్యక్షుడు అమినుల్ ఇస్లాం మాట్లాడుతూ.. "మేము ఐసీసీతో మరోసారి చర్చలు జరుపుతాము. వరల్డ్‌కప్‌లో ఆడాలని మాకు ఉంది. కానీ భారత్‌లో మాత్రం ఆడబోము. ఈ విషయంపై పోరాటం చేస్తాం. ఐసీసీ బోర్డు మీటింగ్‌లో కొన్ని షాకింగ్ నిర్ణయాలు తీసుకున్నారు. ఐపీఎల్ నుంచి ముస్తాఫిజుర్ తొలగింపు విషయం చిన్నదేమీ కాదు. మా మ్యాచ్‌ల విషయంలో బీసీసీఐదే తుది నిర్ణయం అన్నట్లుగా వ్యవహారం ఉంది. భారత్‌లో ఆడలేమని అంటే మా అభ్యర్థనను ఐసీసీ తిరస్కరించింది. క్రికెట్‌కు రోజురోజుకీ ఆదరణ పెరుగుతోంది. ఒలింపిక్స్ వరకు ఈ క్రీడ వెళ్లింది. కానీ మేము మాత్రం ఇక్కడే ఉండిపోయాము. ఇది కచ్చితంగా ఐసీసీ వైఫల్యమే" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశాడు.

## వివాదాస్పదంగా ప్రోమో వీడియో..

## రెచ్చగొడుతున్న పాక్ క్రికెట్ బోర్డు



ముంబై: పాకిస్థాన్ క్రికెట్ బోర్డు పోస్టు చేసిన ఓ ప్రోమో వీడియో వివాదాస్పదంగా మారింది. వరల్డ్‌కప్ ప్రిపరేషన్‌లో భాగంగా ఆస్ట్రేలియా జట్టు పాక్‌లో పర్యటించనున్నది. ఈ నేపథ్యంలో ఆ రెండు జట్ల మధ్య మూడు టీ20 మ్యాచ్‌లు జరగనున్నాయి. అయితే ఆ సిరీస్‌ను ప్రమోట్ చేసేందుకు పాక్ క్రికెట్ బోర్డు ఓ ప్రోమో వీడియోను పోస్టు చేసింది. ఆ వీడియోలో చివరి సీన్లు వివాదాస్పదంగా ఉన్నాయి. ఆసీస్‌తో సిరీస్ సందర్భంగా ఆ దేశ అభిమాని ఒకరు పాక్‌కు వెళ్తారు. ఆ తర్వాత ఓ కారులో అతను మ్యాచ్ చూసేందుకు వెళ్తాడు. కారు దిగిన తర్వాత ఆ ఆస్ట్రేలియా అభిమాని డ్రైవర్‌కు హ్యాండ్‌షేక్ ఇవ్వకుండానే ముందుకు కదిలిపోతాడు. షేక్‌హ్యాండ్ ఇవ్వడం మరిచిపోయావా, బహుశా పొరుగు దేశం వద్దే ఆగిపోయినట్లు ఉన్నావని ఆ టూరిస్టుతో డ్రైవర్ అంటాడు. ఆ వీడియోలో పాక్ ప్లేయర్ ఆఘా గతిథ్యం గురించి వివరిస్తాడు. ఇండియాను టార్గెట్ చేస్తూ ఆ ప్రోమో వీడియోను రూపొందించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. పెహల్గామ్ దాడి తర్వాత ఇండియా, పాక్ దేశాల మధ్య మ్యాచ్ జరిగిన సమయంలో ఇరు దేశాల కెప్టెన్లు కరచాలనం చేసుకోలేదు. ఆసియాకప్ టోర్నీలో కెప్టెన్ సూర్య పాక్ క్రికెటర్‌కు షేక్‌హ్యాండ్ ఇవ్వలేదు. దాదాపు మూడు సందర్భాల్లో రెండు దేశాల మధ్య ఈ పరిస్థితి ఎదురైంది. షేక్‌హ్యాండ్ ఇవ్వలేదని టోర్నీ నుంచి కూడా నిష్క్రమిస్తామని పాక్ హెచ్చరించిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుతం ఆసీస్‌తో సిరీస్ ఉన్న నేపథ్యంలో రూపొందించిన ప్రోమోలో పాక్ ఆ అంశాన్ని ఎత్తిచూపే ప్రయత్నం చేసింది. పాకిస్థాన్ రెచ్చగొట్టే రీతిలో వ్యవహరిస్తున్నట్లు ఆన్‌లైన్‌లో విమర్శలు వస్తున్నాయి.

# స్పోర్ట్స్

## టీ20 లీగ్ ఫ్రాంచైజీ యజమానిగా గ్లెన్ మాక్స్‌వెల్




టీ20 క్రికెట్‌లో పెద్ద సంఖ్యలో పుట్టుకొస్తున్న దేశవాళీ లీగ్‌లలో మరో కొత్త టోర్నీ చేరింది. 'యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్' (ఈటీపీఎల్) పేరుతో ఈ టోర్నమెంట్ జరగనుంది. ఈ టోర్నీ నిర్వహణ కోసం అంతర్జాతీయ క్రికెట్ మండలి (×జజ) అధికారికంగా ఆమోద ముద్ర వేసింది. 'రూల్స్ గ్లోబల్' అనే సంస్థతో కలిసి ఐర్లాండ్ క్రికెట్ బోర్డు ఈ లీగ్‌ను నిర్వహిస్తుంది.

### అభిషేక్ బచ్చన్ సైతం

ప్రముఖ బాలీవుడ్ నటుడు అభిషేక్ బచ్చన్‌తో పాటు పలువురు ఇతర వ్యాపారవేత్తలు 'రూల్స్ గ్లోబల్'లో భాగస్వాములుగా ఉన్నారు. లీగ్‌కు సంబంధించి ఇప్పటికే మూడు జట్ల కొనుగోలు పూర్తయింది. దిగ్గజ క్రికెటర్ స్టీవ్ వా ఆమ్‌స్టర్‌డామ్ ఫ్రాంచైజీకి యజమాని కాగా... మూడు ఒలింపిక్ పతకాలు, రెండుసార్లు ప్రపంచకప్‌లు గెలిచిన జట్లలో సభ్యుడైన ఆస్ట్రేలియా హాకీ దిగ్గజం జేమీ డ్వేయర్ కూడా స్టీవ్‌వాతో పాటు సహ యజమానిగా ఈ జట్టుతో చేతులు కలపడం విశేషం.

### యజమానిగా గ్లెన్ మ్యాక్స్‌వెల్


ఇక ఎడిన్‌బర్గ్ టీమ్‌ను న్యూజిలాండ్ మాజీ క్రికెటర్లు నాథన్ మెకల్లమ్, కైల్ మిల్స్ కలిసి సొంతం చేసుకున్నారు. బెల్‌ఫాస్ట్ టీమ్‌కు ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ యజమానిగా వ్యవహరిస్తున్నాడు. ఈ ఏడాది ఆగస్టులో లీగ్ జరుగుతుంది. ఇటీవలి కాలంలో యూరోప్‌లో కూడా క్రికెట్ బాగా ప్రజాదరణ పొందుతున్న నేపథ్యంలో ఈటీపీఎల్ విజయవంతం అవుతుందని నిర్వాహకులు ఆశిస్తున్నారు.

ధర్మఘంట

# ఉస్తాద్ భగత్ సింగ్‌లో పవన్ కళ్యాణ్ హుక్ స్టెప్ ఫ్యాన్స్‌కు డబుల్ ట్రీట్!



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న అప్‌కమింగ్ మూవీ 'ఉస్తాద్ భగత్ సింగ్' చుట్టూ రోజుకో కొత్త అప్‌డేట్ హల్‌చల్ చేస్తోంది. శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాకు హరీశ్ శంకర్ దర్శకత్వం వహిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం పవన్ కళ్యాణ్ ఇప్పటికే తనకు సంబంధించిన షూటింగ్ పార్ట్‌ను పూర్తి చేసినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయట. మేకర్స్ ఈ సినిమాను ఏప్రిల్ 23 లేదా 24 తేదీల్లో థియేటర్లలోకి తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ రెండు డేట్స్‌లో ఒకటి మాత్రం ఫైనల్ అని అంటున్నారు. రిలీజ్ డేట్‌తో పాటు ఇప్పుడు మరో ఇంట్రెస్టింగ్ టాక్ పవన్ ఫ్యాన్స్‌ను మరింత ఉత్సాహపరుస్తోంది. ఇటీవల 'మన శంకర వర ప్రసాద్ గారు' సినిమాలో మెగాస్టార్ చిరంజీవి వేసిన హుక్ స్టెప్స్ ఎంతటి వైరల్ అయ్యాయో తెలిసిందే. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకూ అందరూ ఆ స్టెప్స్‌కు ఫిదా అయిపోయారు. సోషల్ మీడియాలో రీల్స్, షార్ట్స్‌తో ఆ హుక్ స్టెప్ ట్రెండ్‌గా మారిపోయింది. ఇలాంటి హుక్ స్టెప్‌ను ఇప్పుడు పవన్ కళ్యాణ్‌తో కూడా చేయించేందుకు 'ఉస్తాద్ భగత్ సింగ్' టీమ్ ప్లాన్ చేస్తున్నట్లు టాక్. ఇందుకోసం ప్రత్యేకంగా ఓ సాంగ్‌ను రెడీ చేస్తున్నారట. దర్శకుడు హరీశ్ శంకర్, ఆస్కార్ అవార్డు విన్నర్ చంద్రబోస్, సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ కలిసి పవన్ కోసం స్పెషల్ హుక్ స్టెప్ సాంగ్‌ను డిజైన్ చేస్తున్నారని సమాచారం. తాజాగా హరీశ్ శంకర్, చంద్రబోస్ కలిసి ఉన్న ఫోటోలు కూడా బయటకు రావడంతో ఈ టాక్‌కు మరింత బలం చేకూరింది. ఈ వార్త నిజమైతే పవన్ కళ్యాణ్ స్టైల్‌లో హుక్ స్టెప్స్ థియేటర్లలో ఫ్యాన్స్‌ను ఊపేస్తాయనే చెప్పాలి. ఇప్పటికే పవన్ మాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా ఈ సినిమా ఉంటుందని అంచనాలు ఉండగా, ఇప్పుడు ఈ హుక్ స్టెప్ సాంగ్ ఫ్యాన్స్‌కు స్పెషల్ అట్రాక్షన్‌గా మారనుందని భావిస్తున్నారు. పవన్ డాన్స్ స్టెప్స్‌కు థియేటర్లు రచ్చరచ్చే అవుతాయని సోషల్ మీడియాలో అభిమానులు ఇప్పటి నుంచే కామెంట్స్ చేస్తున్నారు. మొత్తానికి 'ఉస్తాద్ భగత్ సింగ్' ఒక్కో అప్‌డేట్‌తో అంచనాలను మరింత పెంచేస్తోంది.






## 'డేవిడ్ రెడ్డి'తో స్ట్రాంగ్ రీఎంట్రీకి సిద్ధమైన మంచు మనోజ్.. రిపబ్లిక్ డేకు ఫస్ట్ లుక్ విడుదల!

మంచు మనోజ్ అభిమానులకు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న శుభవార్త అందింది. కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉన్న మనోజ్, ఇప్పుడు తన కొత్త సినిమాతో పవర్‌ఫుల్ రీఎంట్రీ ఇవ్వడానికి సిద్ధమవుతున్నారు. ఆయన నటిస్తున్న తాజా యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు 'డేవిడ్ రెడ్డి' అనే ఇంటెన్స్ టైటిల్ ఖరారైంది. ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే ఇండస్ట్రీలో మంచి బజ్ ఏర్పడగా, తాజాగా మనోజ్ చేసిన ప్రకటన అభిమానుల్లో ఉత్సాహాన్ని మరింత పెంచింది. జనవరి 26, 2026న, రిపబ్లిక్ డే సందర్భంగా 'డేవిడ్ రెడ్డి' సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేయనున్నట్లు మనోజ్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఈ అప్‌డేట్‌తో ఆయన అభిమానులు ఆనందంలో మునిగిపోయారు. జాతీయ పండుగ రోజున ఫస్ట్ లుక్ రిలీజ్ చేయడం సినిమాకు ప్రత్యేక హైప్‌ను తీసుకువచ్చే అంశంగా మారింది. ఈ సినిమా మనోజ్ కెరీర్‌లో ఒక కీలక మలుపుగా నిలవబోతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికే విడుదలైన ప్రీ-లుక్ పోస్టర్ సినిమాకి ఉన్న టోన్‌ను స్పష్టంగా చూపించింది. ముఖంపై రక్తంతో నిండిన గుడ్డ, కళ్లలో ఉగ్రతతో కనిపిస్తున్న మనోజ్ లుక్ చూసి ఇది పూర్తిస్థాయి మాస్, వైలెంట్ యాక్షన్ మూవీ అని అర్థమవుతోంది. ఇప్పటివరకు మనోజ్ చేసిన పాత్రలకు భిన్నంగా, ఈసారి మరింత రా అండ్ ఇంటెన్స్ క్యారెక్టర్‌లో కనిపించబోతున్నారని అభిమానులు అంచనా వేస్తున్నారు. పోస్టర్ నుంచే సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. ఈ సినిమాకు హనుమ రెడ్డి యక్కంటి దర్శకత్వం వహిస్తుండగా, వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్ బ్యానర్‌పై మొటుకూరి భరత్, నల్లగంగుల వెంకట్ రెడ్డి నిర్మిస్తున్నారు. సాంకేతికంగా కూడా ఈ చిత్రం హై స్టాండర్డ్స్‌లో తెరకెక్కుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా సంగీతం విషయానికి వస్తే, 'కేజీఎఫ్' సినిమాతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రవి బస్రూర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. ఆయన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఈ మూవీకి మరింత బలాన్ని చేకూర్చనుందని అంచనా. మనోజ్ తన పోస్ట్‌లో "దీ=ఖూూా జు=ూా దీజు+×చీూ" అనే క్యాప్షన్‌ను ఉపయోగించడం కూడా సినిమాపై ఆసక్తిని పెంచింది. ఈ ఒక్క లైన్‌తోనే 'డేవిడ్ రెడ్డి' ఎంత రఫ్, రియలిస్టిక్ యాక్షన్‌తో రూపొందుతోందో చెప్పేశారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, హ్యాష్‌ట్యాగ్స్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతూ సినిమాపై హైప్‌ను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్లాయి. ఇప్పుడు అందరి చూపు జనవరి 26, 2026న విడుదలయ్యే ఫస్ట్ లుక్‌పైనే ఉంది.



# వాలైంటైన్స్ డే స్పెషల్.. బిగ్ స్క్రీన్‌పై చైతూ-సాయిపల్లవి లవ్ స్టోరీ

నాగ చైతన్య,సాయి పల్లవి జంటగా నటించిన చిత్రం 'లవ్‌స్టోరీ'. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో వచ్చిన ఈ ప్రేమకథా చిత్రం బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిచింది. 2021లో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఈ చిత్రంలో చైతూ, సాయిపల్లవి నటనకు ఫ్యాన్స్ ఫిదా అయిపోయారు. ఈ సినిమా చైతూ కెరీర్‌లో బ్లాక్‌బస్టర్ టాక్‌ను సొంతం చేసుకుంది. తాజాగా ఈ లవ్ ఎంటర్‌టైనర్‌ను మరోసారి బిగ్ స్క్రీన్‌పైకి తీసుకొస్తున్నారు. ఈ ఏడాది వాలైంటైన్స్ డే సందర్భంగా థియేటర్లలో రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ విషయాన్ని హీరో నాగచైతన్య ట్విటర్ ద్వారా వెల్లడించారు. నా హృదయానికి హత్తుకున్న సినిమా లవ్ స్టోరీ.. ఈ ఏడాది ఫిబ్రవరి 14న మరోసారి థియేటర్లలో సందడి చేయనుందని తెలిపారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ లవ్ స్టోరీ మూవీ పోస్టర్‌ను పంచుకున్నారు. ఇది చూసిన అక్కినేని అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. లవర్స్ డే రోజున థియేటర్లలో మరోసారి లవ్ స్టోరీ చూసేందుకు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

## పవన్ కల్యాణ్‌తో సినిమాపై క్లారిటీ.. త్వరలోనే 10వ మూవీ..



దర్శకుడిగా వరుస బ్లాక్‌బస్టర్లు కొడుతున్న అనిల్ రావిపూడి.. 10వ సినిమా ఎవరితో? అని ఇప్పటికే చర్చ మొదలైంది. కొంతకా లంగా మన శంకర వరప్రసాద్ విజయాన్ని ఆస్వాదిస్తున్న ఆయన తాజాగా తన నెక్స్ట్ సినిమాపై అప్‌డేట్ ఇచ్చాడు. చిరంజీవి, నయనతార ప్రధాన పాత్రలో నటించిన మన శంకరవర ప్రసాద్‌గారు మూవీ తాజాగా రూ.300 కోట్ల క్లబ్‌లో చేరింది.

**సరైన నిర్ణయం తీసుకోకపోతే**

ఈ సందర్భంగా అనిల్ రావిపూడి మాట్లాడుతూ.. ఇది నాకు కాస్త కష్టమైన సమయం. ఎందుకంటే సంక్రాంతికి వస్తున్నాం బ్లాక్‌బస్టర్ తర్వాత నేను చేసిన సినిమా ఒక ఎత్తయితే.. ఇప్పుడు రెండు భారీ హిట్స్ తర్వాత సినిమా అంటే కాస్త గందరగోళం ఏర్పడే అవకాశం ఉంది. ఏం చేయాలి? ఎలా చేయాలి? అనే ఆలోచనలు ఎక్కువైపోతాయి. ఇప్పుడు సరైన నిర్ణయం తీసుకోకపోతే దారి తప్పిపోతాం. అందుకే పదిరోజులు గ్యాప్ ఇచ్చాను. తాజాగా వైజాగ్ టూర్‌లో ఒక ఆలోచన వచ్చింది. ఈసారి టైటిల్ ప్రకటన నుంచే ఒక విచిత్రమైన జర్నీ మొదలుకాబోతోంది. ఇది చూసి చాలామంది వామ్మో, ఇదేంట్రా బాబూ అనుకుంటారు. మరికొందరు హమ్మయ్య, ఇంకో సినిమాతో వస్తున్నాడు అనుకుంటారు. కచ్చితంగా ఒక మ్యాజిక్ అయితే జరగబోతోంది. టైటిల్ మాత్రం విచిత్రంగా ఉంటుంది. త్వరలోనే ఆ టైటిల్ ప్రకటిస్తాను.

**పవన్ కల్యాణ్‌తో కాదు!**

ఈ సినిమాలో నటీనటులను ఎవర్నీ అనుకోలేదు. కథ లైన్ మాత్రమే ఫిక్స్ అయ్యాను. అందులో ఎవరు చేస్తే బాగుంటుంది? ఎవరి డేట్స్ దొరుకుతాయి? అన్నది చూడాలి. అన్నింటికంటే ముఖ్యం డేట్స్ దరకడం కదా! జూన్, జూలైలో ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్తుంది. పవన్ కల్యాణ్‌ను నేను కలవలేదు, ప్రస్తుతానికైతే ఆయన్ను అయితే అనుకోలేదు అని చెప్పుకొచ్చాడు.

Printed, Published, Owned by & Editor: MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, Published From SPOORTHI PUBLICATIONS,
# : 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Telangana - 508001, # : F-7, Cherukuri Mini Towers, Road No.4, Jadges colony, Vanasthalipuram, Hyderabad-500070.
epaper.dharmaganta.com, www.dharmaganta.com, dharmagantasp@gmail.com, +919440994108, +919885826108, +919440828108

# సిరిసిల్ల ప్రజల ఆశీర్వాదం తో మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయం కేటీఆర్

**సిరిసిల్ల అభివృద్ధి ప్రజల కళ్ల ముందే ఉంది  కాంగ్రెస్ మాటలే మిగిలాయి**

**ప్రతి ఇంటికి బీఆర్ఎస్ అభివృద్ధి ప్రతి గడపకు కాంగ్రెస్ బాకీ కార్డు**

**సిరిసిల్ల మున్సిపల్ వార్డు ఇంచార్జిలతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశం**



**ధర్మఘంట, జనవరి 22, రాజన్న సిరిసిల్ల :** సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదంతో  గులాబీ జెండానే ఎగరబోతుందని మెజారిటీ వార్డులను గెలవడమే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ ముందుకు సాగుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్, సిరిసిల్లలో మున్సిపల్ ఎన్నికలపై వార్డు ఇంచార్జిలతో నిర్వహించిన సమావేశంలో ఆయన దిశానిర్దేశం చేశారు.సిరిసిల్ల ఒకప్పుడు ఎలా ఉందో, బీఆర్ఎస్ పాలనలో ఇప్పుడు ఎలా అభివృద్ధి చెందిందో ప్రజలకు స్పష్టంగా వివరించాలని కేటీఆర్ సూచించారు. “మన పని మనమే చెప్పుకోవాలిఁ వేరే ఎవరు చెప్పరు” అని ఆయన స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత ఇక స్థానిక ఎన్నికలు ఉండవని, నేరుగా సాధారణ ఎన్నికలే ఉంటాయని పేర్కొంటూ, సిరిసిల్ల మున్సిపాలిటీ గెలవడమే కాదు  అన్ని వార్డులను బీఆర్ఎస్ కైవసం చేసుకోవాల్సిందే అని స్పష్టంగా చెప్పారు.కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాల పునర్విభజన పేరుతో గందరగోళం సృష్టిస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. రాజన్న సిరిసిల్ల జిల్లాను ఎత్తివేయాలనే కుట్రలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని, ఈ అంశం సిరిసిల్ల ప్రజలు, న్యాయవాదులు, మేధావుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. జిల్లాలను ఎత్తివేయడానికి సిద్ధమైన ప్రభుత్వం సెస్‌ను కూడా ఎత్తివేయడంలో ఆశ్చర్యం లేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి పాలనను తుగ్లక్ తరహా నిర్ణయాల పాలనగా అభివర్ణించారు.సర్పంచ్ ఎన్నికల ఫలితాలతో కాంగ్రెస్ షాక్‌లో ఉందని, అందుకే కార్పొరేషన్ ఎన్నికలు పెట్టడానికి భయపడుతోందని కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో 40 శాతం పైగా సర్పంచ్ స్థానాలను బీఆర్ఎస్ కైవసం చేసుకుందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వేళ్ల మీద లెక్కపెట్టే స్థానాలను కూడా గెలవలేదన్నారు.సిరిసిల్ల పట్టణం గత 35 ఏళ్లుగా కాంగ్రెస్‌కు దూరంగా ఉందని, బీఆర్ఎస్ ఆవిర్భావం తర్వాత మున్సిపాలిటీపై పూర్తి ఆధిపత్యం సాధించామని కేటీఆర్ పేర్కొన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు సింగిల్ డిజిట్ కూడా దాటలేని పరిస్థితిలో ఉన్నాయని అన్నారు.బీఆర్ఎస్ చేసింది ప్రతి ఇంటికి చెప్పాలిఁ కాంగ్రెస్ బాకీ కార్డు ప్రతి గడపకు తీసుకెళ్లాలి అని కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఎంతవరకు అమలయ్యాయో, వృద్ధులు, మహిళలు, రైతులు, నేతన్నలు, రిటైర్డ్ ఉద్యోగులకు ప్రభుత్వం ఎంత బాకీ పెట్టిందో ప్రజలకు వివరించాలని సూచించారు. సంక్రాంతి దాటినా రైతు బంధు రాలేదని, బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వలేదని, రిటైర్డ్ ఉద్యోగులకు పింఛన్లు కూడా దిక్కు లేని పరిస్థితి ఉందని విమర్శించారు. నేతన్నలకు నిజమైన అండగా నిలిచింది కేవలం బీఆర్ఎస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు.సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికలను నేరుగా తానే పర్యవేక్షిస్తానని ప్రకటించిన కేటీఆర్, ప్రజలు ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ వైపే ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ ఫీవర్ పట్టుకుందని, సిరిసిల్ల ప్రజలంతా గులాబీ జెండా వైపే ఉన్నారని స్పష్టం చేశారు.సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త, ప్రతి వార్డు ఇంచార్జి ఇంటింటి ప్రచారం చేస్తూ ప్రజల మధ్యకు వెళ్లాలని, అభివృద్ధిని వివరించి కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

**హెల్మెట్ సీట్ బెల్ట్ తప్పనిసరి**

**గోదావరిఖని వన్ టౌన్ ఎస్ఐ మనోహర్**



**ధర్మఘంశీట,జనవరి:22 రామగుండం**  జాతీయ రోడ్డు భద్రత మసోత్సవాల, అరైవ్ - అలైవ్ కార్యక్రమం లో భాగంగా రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రాసేనా రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ ఐ మనోహర్, సిబ్బందితో కలిసి లక్ష్మి నగర్, కూరగాయల మార్కెట్ లోని వ్యాపారస్థులు, ప్రజలు, వాహనదారులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ రూల్స్, అరైవ్ - అలైవ్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ ఐ మాట్లాడుతూ,టూ వీలర్ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. ఫోర్ వీలర్ వాహనదారులు సీట్ బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలి, మద్యం సేవించి వాహనాలు నడపకూడదు,  త్రిబుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్ చేయరాదు, రాంగ్ రూట్లో ప్రయాణించ కూడదు, నడుపుతున్న సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించ కూడదు. ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలి అని ప్రజలకు సూచించారు. ట్రాఫిక్ నియమాలు పాటించకపోవడం వల్ల జరిగే రోడ్డు ప్రమాదాలలో అమాయకుల ప్రాణాలు కోల్పోతున్నారని, ఒక్క కుటుంబంలో ఒకరు మృతి చెందితే ఆ కుటుంబం మొత్తం ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుందని తెలిపారు. రోడ్డు ప్రమాదాల వల్ల ఒక్కరి ప్రాణం కూడా పోకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతతో వాహనాలు నడపాలి అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రత్యేకంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు  మీరు మీ ఇంట్లోని కుటుంబ సభ్యులకు, బంధువులకు, పిల్లలకు, యువకులకు హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని, త్రిబుల్ రైడింగ్ చేయవద్దని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, చెప్పాలన్నారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదు అని సూచించారు. మహిళల అవగాహనతోనే కుటుంబాలు, సమాజం సురక్షితంగా ఉంటుంది అని ఎస్ఐ పేర్కొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రమాద మరణాల నివారణ అందరి లక్ష్యం

**నేటిబాలలే రేపటి పౌరులు, రోడ్డు ప్రమాదాల నివారణలో భాగస్వామ్యం కావాలి..**

**విద్యార్థులు రోడ్డు ప్రమాదాల నివారణకు అంబాసిడర్స్ గా ఉండాలి..**

**తల్లిదండ్రులకు,చుట్టుప్రక్కల వారికి రోడ్డు భద్రత పట్ల అవగాహన కల్పించాలి..**

**ప్రయాణ సమయంలో నిర్లక్ష్యంగా ఉండొద్దు..**

**150మంది పౌరులకు హెల్మెట్ లు పంపిణీ.**

**సూర్యాపేట జిల్లా ఎస్పి కె నరసింహా..**




**ధర్మ ఘంట జనవరి 22,సూర్యాపేట జిల్లా ప్రతినిధి :** అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత మహా ఉద్యమం,జాతీయ రోడ్డు భద్రత మాసిత్సవాల్లో భాగంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో సూర్యాపేట పట్టణ పోలీసు, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం 2000 వేల మంది విద్యార్థులు, ఆటో, బారి వాహనాల డ్రైవర్స్, స్థానిక యువత, పౌరులతో కలిసి బారి రోడ్డు భద్రత అవగాహన ర్యాలీ నిర్వహించడం జరిగినది.  ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పి నరసింహా హాజరై ప్రారంభించారు. స్థానిక 60 ఫీట్ల రోడ్డు నుండి ప్రారంభమైన నల్లాభావి సెంటర్, వాణిజ్య భవన్, శంకర్ విలాస్ సెంటర్, ట్యాంక్ బండ్ చౌరస్తా ల మీదుగా ఏవియం స్కూల్ వరకు నిర్వహించారు. అనంతరం ఏవియం స్కూల్ నందు ఏర్పాటు చేసిన సమావేశం నందు ఎస్పి విద్యార్థులను, డ్రైవర్లను ఉద్యేసించి మాట్లాడారు.నేటి బాలలే రేపటి పౌరులు, రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, రోడ్డు ప్రమాదాల నివారణ కోసం విద్యార్థులు భాగస్వామ్యం కావాలి, అంబాసిడర్స్ గా ఉండాలి, తల్లిదండ్రులకు, చుట్టుప్రక్కల వారికి రోడ్డు భద్రత గురించి, ప్రయాణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులు తెలియజేయాలి అని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణ, రోడ్డు ప్రమాద మరణాల నివారణ ప్రతిఒక్కరి లక్ష్యం కావాలి, ప్రస్తుత సమాజంలో దేశరక్షణలో కంటే రోడ్డు ప్రమాదాల బారినపడి మృత్యువాత పడేవారు ఎక్కువగా ఉన్నారు. దేశంలో సంవత్సరానికి 5 లక్షలకు పైగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి వీటిల్లో 1.5 లక్షల పైగా పౌరులు మరణిస్తున్నారు, 4 లక్షల వరకు క్షతగాత్రులు అవుతున్నారు, మన తెలంగాణా రాష్ట్రంలో సంవత్సరానికి సగటున 7 వేల మందికి పైగా పౌరులు ఈ రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారు అన్నారు. ఈ ప్రమాదాలను నివారించడం, ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్యం చేరడం లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం,రాష్ట్ర పోలీస్ శాఖ, రాష్ట్ర డిజిపి అరైవ్ అలైవ్ అనే రోడ్డు భద్రత మహా ఉద్యమం కార్యక్రమం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో స్థానిక డిఎస్పీ ప్రసన్న కుమార్, పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, రూరల్ సీఐ రాజశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, ఆర్టిసి డివిజనల్ మేనేజర్ సునీత, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఆదిత్య, ఎస్ఐ లు సాయిరాం, ఏడుకొండలు, శివతేజ, మహేందర్ నాథ్,బాలు నాయక్, శ్రీకాంత్, మహేష్,ఆటోమొబైల్ షో రూమ్స్ అసోసియేషన్ అధ్యక్షులు కమలాకర్, పోలీసు సిబ్బంది, ఆర్టీఏ సిబ్బంది, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

## మద్యం మత్తులో డ్రైవింగ్ శిక్షగా ట్రాఫిక్ విధుల్లో మందుబాబులు



**ధర్మఘంట, జనవరి 22,పెద్దపల్లి,** మద్యం మత్తులో వాహనం నడుపుతూ పెద్దపల్లి ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడినా కాచాపూర్ గ్రామానికి చెందిన తీగల అజయ్ , చందపల్లి కి చెందిన పర్శ తిరుపతి, చిన్నకల్వల కు చెందిన మెరుగు సతీష్ మరియు ఖిలవనపర్తి కి చెందిన తలారి రాహుల్ అని నలుగురు వ్యక్తులను కోర్ట్ లో హాజరుపరచగా పెద్దపల్లి న్యాయమూర్తి మంజుల  రూ.500/- జరిమానా విధించడంతో పాటు, 2 రోజుల పాటు ట్రాఫిక్ డ్యూటీ నిర్వహించాల్సిందిగా ఆదేశాలు జారీ చేయడం జరిగింది. దానిలో భాగంగా గురువారం పెద్దపల్లి పట్టణంలో ట్రాఫిక్ విధులు నిర్వర్తించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో విచారణ ఎదుర్కొన్న మందుబాబులకు తీర్పుకు అనుగుణంగా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్ సమక్షంలో కమాన్, బస్టాండ్ కూడలిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ విధులు నిర్వర్తించారు.

## శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు పటిష్ట బందోబస్తు





**ధర్మఘంట జనవరి 22: కరీంనగర్,** స్థానిక మార్కెట్ రోడ్డులోని శ్రీ వేంకటేశ్వర దేవస్థానంలో నేటి నుండి ప్రారంభం కానున్న శ్రీ లక్ష్మి, పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం బందోబస్తు ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గురువారం ఆలయ ప్రాంగణాన్ని సందర్శించిన సీపీ, బందోబస్తు మ్యాప్‌ను నిశితంగా పర్యవేక్షించారు.శుక్రవారం  నుడి 29వ తేదీ వరకు వారం రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సీపీ అధికారులతో మాట్లాడుతూ స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా క్యూ లైన్ల వద్ద పటిష్టమైన బారికేడింగ్ ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. శ్రీవారి కళ్యాణం జరిగే మండపం వద్ద తోపులాట జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ప్రసాద వితరణ కేంద్రాల వద్ద క్రమశిక్షణతో కూడిన బందోబస్తు నిర్వహించాలన్నారు. మార్కెట్ రోడ్డులో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులకు సూచించారు. పర్యవేక్షణకు విచ్చేసిన సీపీకి ఆలయ కమిటీ సభ్యులు సాదర స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏసీపీలు వెంకటస్వామి, యాదగిరిస్వామి, ఇన్స్పెక్టర్లు రాంచందర్ రావు, తిరుమల్, ఖరీముల్లాఖాన్ మరియు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు : వరంగల్ కలెక్టర్



**ధర్మఘంట : వరంగల్**  జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నియంత్రణకు సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పని చేసి యువత, విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని జిల్లా కలెక్టర్ డా.సత్య శారద తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ.. గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకోవడంతో పాటు, మత్తు పదార్థాలకు అలవాటు పడితే కలిగే నష్టాలపై ప్రజలకు, ముఖ్యంగా యువతకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

## బాధితుల ఇంటి వద్ద నుండి తొలి ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సూర్యాపేట జిల్లా పోలీస్



**ధర్మ ఘంట,జనవరి 22,నడిగూడెం:-** బాధితుల ఫిర్యాదుపై ఇంటికి వెళ్లి ఫిర్యాదు స్వీకరించి అక్కడే ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయడం కార్యాచరణ అమలు చేయడంలో భాగంగా నడిగూడెం పోలీసులు జిల్లాలో మొదటి కేసు నమోదు చేసినారని ఎస్పీ నరసింహ ఐపిఎస్ తెలిపారు. నడిగూడెం మండలం తెల్లబెల్లి గ్రామానికి చెందిన వికాళాంగురాలు భూమా రమాదేవి భర్త వేధిస్తున్నాడు, కొడుతున్నాడు అని డయల్ 100 కు ఫోన్ చేయగా సంచారం అందుకున్న నడిగూడెం ఎస్ఐ అజయ్ కుమార్ తన సిబ్బందితో కలిసి బాధితురాలి ఇంటికి వెళ్లి ఫిర్యాదు స్వీకరించి అక్కడే కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్  కాపీని బాదితురాలికి అందించారు అని తెలిపినారు. ఎఫ్ ఐ ఆర్ ఎట్ డోర్ స్టెప్ కార్యక్రమం ద్వారా మహిళలపై, పిల్లలపై, వృద్దులపై దాడులు, దొంగతనాల, భౌతిక దాడులు, బాల్య వివాహాలు, వేదింపులు వట్టి సందర్భాల్లో బాధితులకు భరోసాగా ఉంటుంది, ఇంటికి వెళ్లి కేసు నమోదు చేయడం జరుగుతుంది అని ఎస్పీ తెలిపినారు. మొదటి కేసు నమోదు చేసిన

## అనాజపురం వద్ద రోడ్ ప్రమాదం, ఓ మహిళకు గాయాలు



**ధర్మ ఘంట, జనవరి 22 మోత్కూరు:** మోత్కూరు మండలం వలిగొండ, తొర్రూరు ప్రధాన రహదారి అనాజిపురం దగ్గర గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ గాయపడ్డారు. హైదరాబాద్ మీరపేట్‌కు చెందిన ఇన్నోవా కారు (౬+09జ0512) తొర్రూరు వైపు వెళు తుండగా, పొడిచేడు గ్రామం నుండి మోత్కూరు వైపు వస్తున్న షిఫ్ట్ కారును (టూ07ఫీ=3156) అనాజిపురం వద్ద ఢీకొట్టింది. రెండు వాహనాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదంలో పొడిచేడు గ్రామానికి చెందిన టి. సంతోష్ కుమారి గాయాలు కావడంతో స్థానికులు ఆమెను ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రధాన రహదారిపై ఇటీవల కొత్త రోడ్డు వేసినప్పటికీ ఎలాంటి ప్రమాద సూచికలు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడం ప్రమాదాలు జరిగేందుకు కారణమవుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా అనాజపురం చౌరస్తాలో రహదారి విస్తరణ చేపట్టినా, హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు వేగం తగ్గించే పరిస్థితి లేకుండా ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా ఇదే ప్రాంతంలో పలు ప్రమాదాలు జరిగినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వెంటనే స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## అగ్నిప్రమాద బాధితుడికి అండగా కాంగ్రెస్ యువ నేత యాదగిరి యాదవ్



**ధర్మఘంట జనవరి 22, నాంపల్లి:** నల్గొండ జిల్లా నాంపల్లి మండలం నేరళ్ళపల్లి గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పొగాకు నగేష్ అనే వ్యక్తి ఇల్లు (గుడిసె) విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూర్తిగా దహనమైపోయింది. ఈ ప్రమాదంలో నగేష్ కుటుంబం సర్వస్వం కోల్పోయి రోడ్డున పడింది. ఈ విషయం తెలుసుకున్న తక్షణమే కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు యాదగిరి యాదవ్ వెంటనే గ్రామాన్ని సందర్శించారు. బాధితుడి పరిస్థితిని చూసి చలించిన ఆయన, తక్షణ సహాయంగా 5,000 రూపాయల నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఏ కష్టం వచ్చినా మీ కుటుంబానికి నా సహకారం ఎప్పుడూ ఉంటుంది, ధైర్యంగా ఉండండి" అని భరోసా ఇచ్చారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం..

రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్



**ధర్మఘంట జనవరి:22 రామగుండం** గోదావరిఖని సింగరేణి ఏరియా హాస్పటల్‌లో ఏర్పాటు చేస్తున్న క్యాథ్ ల్యాబ్ సెంటర్ పనులను గురువారం రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ జీఎం లలిత్ కుమార్ తో కలిసి పరిశీలించారు పనుల పురోగతిని అడిగి తెలుసుకుని, నాణ్యతతో కూడిన పనులను వేగ వంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, క్యాథ్ ల్యాబ్ ప్రారంభమైతే రామగుండం పరిసర ప్రాంతాల ప్రజలు గుండె సంబంధిత చికిత్సల కోసం కరీంనగర్, హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే మెరుగైన వైద్యం పొందవచ్చని తెలిపారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ రాకపోకలకు సౌలభ్యంగా ఉండేలా హాస్పటల్‌కు రెండు ప్రవేశ మార్గాలు ఉండాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అనుగుణంగా మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## గణపతి హనుమాన్ ఆలయం లో ప్రత్యేక పూజలు



**ధర్మ ఘంట, జనవరి 22 మెట్టుపల్లి** పట్టణంలోని బస్టాండ్ ఇన్ గేటు వద్దగల ఆర్టీసీ గణపతి హనుమాన్ వద్ద భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా పూజలు నిర్వహించి ప్రసాదం పంపిణీ చేశారు . ఈ సందర్భంగా అయోధ్యలో రామాలయం నిర్మాణం జరిగి రెండు సంవత్సరాలు కలిగి పూర్తిచేసుకుని మూడో సంవత్సరంలో అడుగుపెట్టిన సందర్భంగా భక్తిశ్రద్ధలతో ఘనంగా పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో హిందువులు జాగృతి సంస్థలు స్వచ్ఛంద సంస్థలు పుర ప్రముఖులు అందరూ పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. తదనంతరం ప్రసాదం ను స్వీకరించారు.

# పర్యాటక కేంద్రంగా జిల్లాను అభివృద్ధి..

### తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి...





**ధర్మ ఘంట జనవరి 22,సూర్యాపేటజిల్లా ప్రతినిధి:** జిల్లాను పర్యాటకరంగా ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సద్దలచెరువు మినీ ట్యాంక్బండ్ వద్ద ఐదు కోట్ల నిధులతో ట్యాంక్ బండ్ ఆధునికర పనులను ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వం సూర్యాపేట సద్దలచెరువు మినీ ట్యాంక్ బండ్ ను నిర్లక్ష్యం చేస్తూ అభివృద్ధికి దూరం చేసింది అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మినీ ట్యాంక్బండ్ కు అనేక నిధులను కేటాయిస్తుందని కోటి రూపాయలతో 80 సీట్ల ఏసీ బోటింగ్, అదేవిధంగా 15 కోట్లతో ఇంటర్నేషనల్ పార్కును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పిల్లలు ఆడుకోవడానికి ప్లేయింగ్ జోన్ పార్కును ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజలందరికీ అన్ని రకాల సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా మినీ ట్యాంక్ బండ్లను తీర్చిదిద్దుతున్నా మన్నారు. మరువ వచ్చే ఆరు నెలల్లో మినీ ట్యాంక్ బండ్ రూపు రెక్కలు మారిపోతాయని ప్రజలందరికీ ఆహ్లాదని పంచుతుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పర్యాటక రంగానికి పెద్దపీట వేస్తున్నారని ఆయన ఆలోచనలకు తగిన విధంగా మంత్రులు జూ పల్లి కృష్ణారావు, ఉత్తంకుమార్ రెడ్డి పర్యాటక రంగానికి అన్ని విధాల సహకరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పెద్దిరెడ్డి రాజా వుర రామ్మూర్తి యాదవ్, వెలుగు వెంకన్న, ముదిరెడ్డి రమణారెడ్డి, ఫరూక్, వల్దాస్ దేవేందర్, నిమ్మల వెంకన్న, యాట వెంకన్న,పాలగాని కృష్ణ, కొండగడుపుల సూరయ్య, సైదిరెడ్డి, టూరిజం శాఖ ఏఈ మణికంఠ పాల్గొన్నారు.

# అలోవెరా సాగు రైతులకు లాభదాయకం

**ధర్మ ఘంట, జనవరి 22 మోత్కూరు:** అలోవెరా సాగు లాభదాయక పంటగా మారుతున్న నేపథ్యంలో దీన్ని మరింత విస్తృతం చేసే దిశగా రైతులకు అవగాహన కల్పిస్తామని గడ్డి పెల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కె.వి.కె) శాస్త్రవేత్తలు తెలిపారు. అలోవెరా ప్రాసెసింగ్ నుండి మార్కెటింగ్ వరకు రైతులు ఆర్థికపరంగా లాభపడే అవకాశాలు అధికంగా ఉన్నాయని వారు అన్నారు. మంగళవారం పాటిమెట్ల గ్రామంలో రైతు తేలుకుంట్ల రామ్మూర్తి 9 ఎకరాల్లో సాగుచేస్తున్న అలోవెరా తోటను సీనియర్ సైంటిస్ట్ డి. నరేష్, హార్టికల్చర్ సైంటిస్ట్ సిహెచ్. నరేష్, సాయిల్ సైన్స్ ప్రతినిధి ఏ. కిరణ్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా సాగు పద్ధతులు, మార్కెటింగ్ అవకాశాల గురించి రైతు మదూరి రాజి రెడ్డి నుంచి శాస్త్రవేత్తలు వివరాలు సేకరించారు. గత తొమ్మిదేళ్లుగా పూర్తి సేంద్రీయ పద్ధతుల్లో అలోవెరాను సాగు చేస్తున్నట్లు రాజి రెడ్డి శాస్త్రవేత్తలకు వివరించారు. కలబంద నుంచి సేకరించిన గుజ్జును నేరుగా కాస్మోటిక్, కూల్‌డ్రింక్, జ్యూస్ తయారీ కంపెనీలకు సరఫరా చేస్తూ స్థిరమైన ఆదాయం పొందుతున్నామని, ఈ ప్రక్రియలో మిగిలే అవశేషాలను తిరిగి ఎరువులుగా మార్చి పొలాల్లోనే వినియోగిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సుమారు పది నుంచి పదిహేను ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తే ఆర్థికంగా మంచి వృద్ధి సాధించవచ్చని, ప్రస్తుతం మార్కెట్‌లో అలోవెరాకు డిమాండ్ భారీగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. రైతుల అనుభవాలను అధ్యయనం చేసిన శాస్త్రవేత్తలు మాట్లాడుతూ, తక్కువ నీటి లభ్యత ఉన్న పొడి ప్రాంతాలకు అలోవెరా సాగు ఎంతో అనుకూలమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనే గుజ్జు ప్రాసెసింగ్ చేసే యంత్రాలు అందుబాటులోకి వస్తే సామాన్య రైతుల ఆదాయం మరింత పెరుగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. రాజి రెడ్డి వంటి రైతుల అనుభవాలను స్ఫూర్తిగా తీసుకుని, అలోవెరా సాగుపై త్వరలోనే ఇతర రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ పర్యటనలో తోట నీటి యాజమాన్యం పద్ధతులు గుజ్జు తీసే విధానాలను ప్రత్యక్షంగా పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.



# బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు






**కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి**

**ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి.**

**సమన్వయంతో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి.**

**ధర్మఘంట, జనవరి 22, కరీంనగర్:** ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రదేశాల్లో నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఆర్ అండ్ బి, పోలీస్, రవాణా, ఆర్టీసీ, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో జిల్లా రోడ్డు భద్రత కమిటీ, జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ గత రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలు ఏమిటని రవాణా, పోలీస్, రోడ్లు భవనాలు, మున్సిపల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్ లను గుర్తించి రోడ్డు ప్రమాదాలు, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాద ప్రదేశాలలో సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రమాద అవకాశం ఉన్న స్థలాల్లో వాహనాల వేగ నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. తరచుగా ప్రమాదాలు జరుగుతున్న చోట్ల వాటికి గల కారణాలను విశ్లేషించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. నేషనల్ హైవే అథారిటీ, పంచాయతీరాజ్, మున్సిపల్ కార్పొరేషన్, పోలీస్, రోడ్లు భవనాలు, రవాణా అధికారులు రోడ్ సేఫ్టీ కమిటీ మీటింగ్ లో చర్చించిన అంశాలపై, ప్రమాదాల నివారణకు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్టీసీ, ప్రైవేట్ బస్సుల్లో తప్పనిసరిగా ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉండాలని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ రూల్స్ పై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ కరీంనగర్- జగిత్యాల రోడ్డుకు ఇరువైపులా ఆరు అడుగుల మేర చదును చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని పలుచోట్ల స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక సైన్ బోర్డులు, లైటింగ్ తదితర ఏర్పాట్లు అవసరం ఉన్నాయని, తాము సూచించిన ప్రదేశాల్లో వీటిని ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ఎక్కువగా ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను, అక్కడ ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను గురించి వివరించారు. మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ గత సమావేశంలో చర్చించిన విధంగా నగరంలో అవసరమైన చోట్ల స్పీడ్ బ్రేకర్లు, ట్రాఫిక్ సిగ్నల్స్, సోలార్ లింకింగ్ సిస్టం వంటివి ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాజెక్ట్ డైరెక్టర్ కీర్తి భరద్వాజ్ మాట్లాడుతూ జాతీయ రహదారి 563లో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకున్న చర్యలను గురించి వివరించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ పురుషోత్తం, ఆర్టీసీ డిఎం సునంద, ఏసీపీ వెంకటస్వామి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధర్మఘంట

# అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా నిర్దేశిత కాలపరిమితిలో పూర్తి చేయాలి

**ధర్మఘంట జనవరి 22, వరంగల్ :**




వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధిపై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లోని ఎంపీ ఛాంబర్‌లో చీఫ్ ప్లానింగ్ (జ్యూా) అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనుల కోసం ఎంపీ నిధుల నుండి మొత్తం రూ. 8 కోట్ల 30 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులకు అడ్మినిస్ట్రేటివ్ సాంక్షన్ ఇచ్చిన తేదీ నుంచి మూడు నెలల లోపు పనులు ప్రారంభించాలని, లేనిపక్షంలో పనులు రద్దు చేయాలని అధికారులను స్పష్టంగా ఆదేశించారు. ఎంపీ నిధుల ద్వారా చేపట్టే ప్రతి అభివృద్ధి పనికి సంబంధించిన పురోగతి వివరాలు తప్పనిసరిగా పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని, ప్రజలకు పూర్తి సమాచారం అందుబాటులో ఉండేలా పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. పనుల అమలులో ఎలాంటి టెక్నికల్ సమస్యలు తలెత్తినా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు తెలిపారు.నియోజకవర్గంలోని మౌలిక వసతుల అభివృద్ధి, రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సరఫరా, ఆరోగ్యం, విద్య వంటి రంగాలతో పాటు ప్రజలకు ప్రత్యక్షంగా మేలు చేసే కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీ డా. కడియం కావ్య అన్నారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా నిర్దేశిత కాలపరిమితిలోనే పనులు పూర్తయ్యేలా కఠినంగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అధికారులు ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు, పెండింగ్ ప్రాజెక్టుల స్థితి, భవిష్యత్తులో అమలు చేయనున్న ప్రణాళికలను ఎంపీకి వివరించారు. ప్రజా ప్రయోజనమే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని చీఫ్ ప్లానింగ్ అధికారులు సత్యనారాయణ రెడ్డి, చంద్రకళ, కొట్యా నాయక్, బాబురావు, పంచాయతీరాజ్ అధికారులు ఆత్మా రామ్, రమేష్ బాబు, కిషన్, సతీష్ బాబు, ఆర్ అండ్ బి ఈఈ సురేష్ బాబు, టీజీఈడబ్ల్యూఐడిసీ అధికారి కిషన్, డిడబ్ల్యుఓ రాజమణి, మిషన్ భగీరథ అధికారి శ్రీకాంత్, ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ కు షాకిచ్చిన జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ విజయ గణపతి.

**బీఆర్ఎస్ నేతలతో కలిసి బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరిన దంపతులు.**

**ధర్మఘంట, జనవరి 22, కరీంనగర్:**




కరీంనగర్ జిల్లా పరిషత్ తాజా మాజీ చైర్మన్, బిఆర్ఎస్ నాయకురాలు కనుమల్ల విజయ గణపతి బీజేపీలో చేరారు. కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సమక్షంలో బీజేపీలో చేరారు. కనుమల్ల విజయ గణపతి దంపతులకు కాషాయ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.వారితో పాటు జమ్మికుంటకు చెందిన పలువురు బిఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాబోయే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతో మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో జరిగిన అభివృద్దే ఎజెండాగా ప్రజల్లోకి వెళతామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు.కరీంనగర్ కార్పొరేషన్ సహా తన పార్లమెంట్ నియోజకవర్గంలోని మున్సిపాలిటీల్లో అంతో ఇంతో అభివృద్ధి జరిగిందంటే కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులతోనే సాధ్యమైందని తెలిపారు. స్మార్ట్ సిటీ, అమ్రుత్ 1, 2, స్వచ్ఛ భారత్ వంటి పథకాలతోపాటు 14, 15, 16వ ఆర్థిక సంఘం విడుదల చేసిన నిధులతోనే కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో అభివ్రుద్ది పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే రాబోయే ఎన్నికల్లో “అభివ్రుద్దే మా విధానం... హిందుత్వమే మా నినాదం” పేరుతో ప్రజల వద్దకు వెళతామని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండేళ్లలో మున్సిపాలిటీలకు నయాపైసా ఇయ్యలేదని గుర్తు చేశారు. ఎన్నికలు వస్తున్నయని తెలియడంతో ఓట్ల కోసం అభివ్రుద్ధి పనులకు శంకుస్థాపనల పేరుతో కాంగ్రెస్ నేతలు హడావుడి చేసేందుకు సిద్ధమయ్యారని దుయ్యబట్టారు. అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో అధికారంలో లేని బీఆర్ఎస్ పార్టీకి ఓటేసి ఏం లాభమని, గెలిచిన తరువాత పార్టీ ఫిరాయింపులకు పాల్పడతారని పేర్కొన్నారు. ప్రజలు వాస్తవాలు గమనించాలని కోరారు. బీజేపీని ఆశీర్వదించి కరీంనగర్ కార్పొరేషన్ తోపాటు మున్సిపాలిటీల్లో అత్యధిక స్థానాల్లో గెలిపిస్తే కేంద్రం నుండి అత్యధిక నిధులు తీసుకురావడంతోపాటు సీఎస్సార్ నిధులను సైతం తీసుకొచ్చి అభివ్రుద్ధి అంటే ఏమిటో చూపిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, కరీంనగర్ మాజీ మేయర్ డి.శంకర్, డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్, బీజేపీ జమ్మికుంట నేతలు ఆకుల రాజేందర్, పుప్పాల రఘు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లు సిద్ధం చేయాలి

**- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని సమీక్ష**

**ధర్మఘంట, జనవరి 22(భువనగిరి జిల్లా బ్యూరో):**






మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అన్నారు. గురువారం హైదరాబాద్ నుండి నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్ల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఎన్నికలలో వినియోగించే బ్యాలెట్ బాక్సులు, సామాగ్రి, బ్యాలెట్ ప్రింటింగ్ కు అవసరమైన ఏర్పాట్లు, నామినేషన్ స్వీకరణ కేంద్రంలో ఏర్పాట్లు చేయాలని తెలిపారు. రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, జోనల్ అధికారులు, ఫ్లయింగ్, స్టాటిస్టిక్ సర్వేయలెన్స్ బృందాలు, పిఓ, ఓపిఓ లకు శిక్షణ, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్, సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్ లలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేందుకు అవసరమైన పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలుగా సన్నద్ధం అయి ఉన్నామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ దృష్టికి తెచ్చారు. జిల్లాలోని ఆరు మున్సిపాలిటీ పరిధిలో 104 వార్డు లకు గాను మొత్తం 212 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వీటి వివరాలను ఇప్పటికే టీ.పోల్ లో నమోదు చేయడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాల విషయమై వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించడం జరిగిందన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమించడం జరుగుతుందని తెలిపారు. బ్యాలెట్ బాక్సులు, ఇతర సామాగ్రి అందుబాటులో ఉన్నాయని, షెడ్యూల్ విడుదలైన వెంటనే ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా నిఘాను ఉంచేందుకు వీలుగా ఎస్.ఎస్.టీ, ఎఫ్.ఎస్.టీ టీమ్ లను నియమిస్తున్నామని అన్నారు. బ్యాలెట్ బాక్సులు, సామాగ్రి, బ్యాలెట్ పేపర్ల ప్రింటింగ్ కు అవసరమైన ఏర్పాట్లు, నామినేషన్ స్వీకరణ కేంద్రాలలో తగిన సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, జోనల్ అధికారులను నియమించేలా ఇప్పటికే సిబ్బందిని గుర్తించడం జరిగిందన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్, సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్ ల కోసం అవసరమైన ఏర్పాట్లు చేశామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ దృష్టికి తెచ్చారు. ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా ఎన్నికలను సాఫీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణీ కుముదిని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఆర్డీవోలు, కృష్ణా రెడ్డి, శేఖర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ లేక్ పోలీస్ అవుట్‌పోస్ట్ ఆధ్వర్యంలో ‘అరైవ్ అలైవ్‘ అవగాహన కార్యక్రమం





**ధర్మఘంట, జనవరి 22, కరీంనగర్ :** నగరంలోని మానేరు రివర్ ఫ్రంట్, లేక్ పోలీస్ అవుట్‌పోస్ట్ పరిధిలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ‘అరైవ్ అలైవ్‘ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కరీంనగర్ టౌన్ ఏసీపీ వెంకటస్వామి, వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ రాంచందర్ రావు హాజరయ్యారు.ఈ సందర్భంగా డ్యామ్ పరిసర ప్రాంతాల్లో వాకర్స్, విద్యార్థులతో కలిసి భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకటస్వామి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. బైక్‌లపై ముగ్గురు ప్రయాణించడం చట్టవిరుద్ధం మరియు ప్రమాదకరం అన్నారు.మద్యం సేవించి వాహనం నడపడం, మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, ఇతరుల ప్రాణాలకు నష్టం కలిగించకూడదన్నారు. వయసు నిండని పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని తెలిపారు. మితిమీరిన వేగం ప్రమాదాలకు ప్రధాన కారణం, వేగ నియంత్రణ పాటించాలన్నారు.అనంతరం, రోడ్డు నిబంధనలను పాటిస్తామని, తోటి వారికి అవగాహన కల్పిస్తామని, ప్రమాదాల రహిత సమాజం కోసం కృషి చేస్తామని విద్యార్థులు మరియు వాకర్స్‌తో అధికారులు ప్రమాణం చేయించారు.ఈ కార్యక్రమంలో వన్ టౌన్ ఇన్స్పెక్టర్ రాంచందర్ రావు, లేక్ పోలీస్ అవుట్‌పోస్ట్ ఆర్.ఎస్.ఐ రమేష్, ఇతర పోలీస్ సిబ్బంది, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## రేకుర్తి సమ్మక్క-సారక్క జాతరకు పటిష్ట బందోబస్తు

**క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించిన పోలీస్ కమిషనర్.**

**భక్తులకు అసౌకర్యం కలగకుండా బారికేడింగ్, ట్రాఫిక్ నియంత్రణపై కీలక ఆదేశాలు.**



**ధర్మఘంట, జనవరి 22, కరీంనగర్ :** రేకుర్తిలో జనవరి 28 నుండి 31 వరకు అత్యంత వైభవంగా జరగనున్న సమ్మక్క-సారక్క జాతరను పురస్కరించుకొని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం గురువారం బందోబస్తు ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. జాతర జరిగే ప్రాంతాన్ని సందర్శించిన సీపీ, బందోబస్తు మ్యాప్‌ను పర్యవేక్షించి అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, జాతరకు వచ్చే వేలాది మంది భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన భద్రత కల్పించాలని అధికారులను ఆదేశించారు. అమ్మవార్ల గద్దెల వద్ద భక్తుల రద్దీని నియంత్రించేందుకు పటిష్టమైన బారికేడింగ్ ఏర్పాటు చేయాలన్నారు. జాతర ప్రాంగణంలో నిరంతర నిఘా కోసం ప్రత్యేక పోలీస్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి, భక్తులకు అవసరమైన సహాయం అందించాలన్నారు. జాతర సమయంలో వాహనాల రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పార్కింగ్ స్థలాలను కేటాయించి, రాకపోకలను క్రమబద్ధీకరించాలని సూచించారు. భక్తుల దర్శనం సజావుగా సాగేలా ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు క్షేత్రస్థాయిలో సిబ్బందిని సమన్వయం చేసుకోవాలన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు పోలీసు కమిషనర్ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రూరల్ ఏసీపీ విజయకుమార్, కొత్తపల్లి ఇన్‌స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్, ఇతర పోలీసు అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.

## వసంత పంచమి మహోత్సవ వేడుకలకు ముస్తాబైన శ్రీ మహాశక్తి దేవాలయం.

**వసంత పంచమి పూజ వేడుకల్లో పాల్గొననున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్.**


**ధర్మఘంట, జనవరి 22 కరీంనగర్ :**



నగరంలోని మహిమాన్విత దివ్యక్షేత్రం శ్రీ మహాశక్తి దేవాలయం శుక్రవారం రోజున జరిగే వసంత పంచమి వేడుకల కోసం సర్వాంగ సుందరంగా ముస్తాబయింది. శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామివారి దివ్య ఆశీస్సులతో వసంత పంచమి మహోత్సవ పూజా వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఆలయ నిర్వాహకులు తగిన ఏర్పాటు చేశారు. దేవాలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలు, రకరకాలపూల అలంకరణతో ఆకర్షనీయంగా తీర్చిదిద్దారు. వసంత పంచమి సందర్భంగా శ్రీ మహాశక్తి దేవాలయంలో ఉదయం 4 గం.లకు శ్రీ లక్ష్మీ గణపతి స్వామివారికి, శ్రీ మహాదుర్గ, శ్రీ మహాలక్ష్మీ, శ్రీ మహాసరస్వతి అమ్మవార్లకు అభిషేకం, ఉదయం 7:30 నిమి.లకు శ్రీ మహాసరస్వతి దేవి పూజ, అభిషేకం (ఉత్సవ మూర్తికి), కుంకుమార్చన, విద్యార్థులచే సామూహిక పుస్తక పూజలు జరుగనున్నాయి. జ్ఞానాన్ని ప్రసాదించే వేద మాత, తన చల్లని చూపులతో ఆశీర్వదించే శక్తి స్వరూపిణి, అక్షరానికి ఆదిదేవత, ప్రణవ స్వరూపిణి శ్రీ మహాశక్తి శ్రీ మహా సరస్వతి అమ్మవారు. చిన్నారుల అక్షరాభ్యాసానికి కొంగు బంగారంగా ఇక్కడి “శ్రీ మహా సరస్వతి“ అమ్మవారు నిలిచారు. ప్రతి ఏటా వసంత పంచమి రోజున వేలాదిగా తరలివచ్చే భక్తులతో రాకతో మరో బాసర క్షేత్రంలా శ్రీ మహాశక్తి ఆలయం మారింది. ముఖ్యంగా వసంత పంచమి రోజున దేవాలయంలోని శ్రీ మహాశక్తి అమ్మవారిని పూజించిన వారికి, జ్ఞానం, వివేకం, వాక్చాతుర్యం, సృజనాత్మక శక్తి ,మేధో సామర్థ్యం పెరుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.. అందుకే ఇక్కడి చిన్నారుల అక్షరాభ్యాసానికి ఎంతో ప్రత్యేకత ఉంది. ప్రతి ఏటా వసంత పంచమి సందర్భంగా ఎంతోమంది చిన్నారుల అక్షరాభ్యాసానికి రాష్ట్రం నలుమూల నుండి ఇక్కడి శ్రీ మహాశక్తి దేవాలయానికి భక్తులు తరలివస్తున్నారు. శుక్రవారం రోజున జరిగే వసంత పంచమి మహోత్సవ వేడుకల, పూజా కార్యక్రమాల్లో కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ దంపతులు పాల్గొననున్నారు.సమస్త హిందూ బంధువులందరూ వసంత పంచమి పూజ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని దేవాలయ నిర్వాహకులు కోరారు.

## శీతాకాల సమావేశ సందర్భంగా శ్రమదానం

**ధర్మ ఘంట, జనవరి 22 నల్గొండ:**




కనగల్ మండలం దోరేపల్లి లో ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ ఆధ్వర్యంలో వాలంటీర్స్ శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించి పాఠశాల తోపాటు గ్రామంలోని పలు వీధుల్లో ఉన్నటువంటి కంప చెట్లను,పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేయడమే కాకుండా మురికి కాలువలో ఉన్న చెత్తా తొలగించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బక్క ఎల్లమ్మ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న సమస్యల పైన అవగాహన కల్పిస్తూ పరిసరాల పరిశుభ్రతను గుర్తించి ప్రజలలో చైతన్యం తీసుకురావాలని పేర్కొన్నారు.అదేవిధంగా పగిడిమర్రి గ్రామంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ సిక్స్ ఆధ్వర్యంలో వాలంటీర్లు గ్రామంలో రోడ్ల వెంట ఉన్న కంప చెట్లను తొలగించి రహదారుల వెంబడి పరిశు భ్రంగా ఉంచాలని ప్రజలను చైతన్యపరిచారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ ప్రోగ్రాం ఆఫీసర్ నర్సింగ్ కోటయ్య, ఎన్ఎస్ఎస్ యూనిట్ సిక్స్ ప్రోగ్రాం ఆఫీసర్ కంబాలపల్లి శివరాణి,అధ్యాపకులు కె. నాగరాజు,పంచాయతీ కార్యదర్శి గణేష్, పగిడిమర్రి గ్రామ సర్పంచ్ నాగవల్లి నాగమణి,జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్ రావు,బక్క రాజశేఖర్,గ్రామ ప్రజలు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచులు వాలంటీర్స్ ను అభినందించారు.

ధర్మఘంట

## పసునూరు నూతన సర్పంచ్‌కు ఘనంగా సన్మానం

**పాఠశాల సమస్యల పరిష్కారానికి వినతి పత్రం అందజేసిన ప్రధానోపాధ్యాయురాలు**




**ధర్మఘంట జనవరి 22,నాంపల్లి:** స్థానిక గ్రామ పంచాయతీ నూతన సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా, పసునూరు సర్పంచ్‌ను వార్డ్ మెంబర్లను గ్రామ ప్రముఖులు పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల అభివృద్ధిపై ప్రత్యేక చర్చ జరిగింది. గ్రామ అభివృద్ధిలో సర్పంచ్ చురుకైన పాత్ర పోషించాలని ఆకాంక్షిస్తూ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి ఉపాధ్యాయ బృందం సర్పంచ్‌ను శాలువాతో సత్కరించి, పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

**పాఠశాల సమస్యలపై విన్నపం**

సన్మాన కార్యక్రమం అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి పాఠశాల ఎదుర్కొంటున్న పలు సమస్యలను సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఆమె ఒక వినతి పత్రాన్ని అందజేశారు ప్రధానంగా పాఠశాల భవనానికి అవసరమైన మరమ్మతులు విద్యార్థులకు త్రాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ.

**పాఠశాల ప్రాంగణంలో పారిశుధ్యం మరియు ప్రహరీ గోడ నిర్మాణం.**

వినతి పత్రాన్ని స్వీకరించిన సర్పంచ్ సానుకూలంగా స్పందించారు. గ్రామ అభివృద్ధిలో విద్యా రంగానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని, త్వరలోనే పాఠశాలను సందర్శించి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు మరియు వీరమల్ల సందీప్ గ్రామస్తులు పాల్గొన్నారు

## డా. శ్రీనివాస్ రావు కావేటికి సూర్యాపేట లో ఘన సన్మానం

**బిషప్ దుర్గం ప్రభాకర్**

**తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి**





**ధర్మ ఘంట జనవరి 22,సూర్యాపేటజిల్లా ప్రతినిధి:** స్థానిక సూర్యాపేట జిల్లా కేంద్రం నందు బిషప్ దుర్గం ప్రభాకర్ నివాసంలో అంతర్జాతీయ ప్రముఖ న్యాయవాది డా. శ్రీనివాస రావు కావేటి స్వదేశం వచ్చిన సందర్భంగా గురువారం సూర్యాపేట జిల్లా కు రావడం పట్ల హార్షం వ్యక్త పర్చుతు వారికీ ఘన స్వాగతం పలికి సన్మానం చేసిన తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిషప్ దుర్గం ప్రభాకర్,పాల్వాయి అజయ్ లు శాలువా, మెమెంటో తో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డా శ్రీనివాస్ రావు కావేటి అతర్జాతీయ న్యాయవాది గత సంవత్సరం పాస్టర్ ప్రవీణ్ పగడలా మృతి పై అతర్జాతీయ న్యాయ స్థానంలో సుప్రీమ్ కోర్టు లో కేసు వేసి క్రైస్తవుల తరుపున వాదించిన గొప్ప వ్యక్తి వారని,ఇండియా, సోలిసిటర్, యూకే, నోటరీ పబ్లిక్ న్యూయర్క్ లో వదిస్తూ, ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ మథెర్ తెరిస్సా సోషల్ ఆర్గనైజేషన్ కు చీఫ్ ప్యాటారాన్ గా సేవా లందిస్తూ క్రైస్తవుల గొంతుక నేడు సూర్యాపేట లో వారిని కలుసుకోవడం సంతోషం గా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ మథెర్ తెరిస్సా సోషల్ ఆర్గనైజేషన్ (యన్. జి. ఓ. ) నెట్ వర్క్ చైర్మన్ ఏడ్వాడ్ సామెల్ మద్దెల తదితరులు పాల్గొన్నారు

## ఆస్తి పన్ను వసూళ్లలో వేగం పెంచి నూరు శాతం లక్ష్యాన్ని సాధించాలి..

**=అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ**



**ధర్మఘశీట జనవరి:22 రామగుండం** ఆర్థిక సంవత్సరం ముగింపు సమీపిస్తున్నందున ఆస్తి పన్ను వసూళ్లలో వేగం పెంచి నూరు శాతం లక్ష్యాన్ని సాధించాలని అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) , రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ అన్నారు. వార్డు అధికారులు , సహాయకులు , సిబ్బందితో గురువారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ భారీ బకాయలు ఉన్న వ్యక్తులు , సంస్థలపై మొదటగా దృష్టి సారించాలని అన్నారు. అలాగే నీటి సరఫరా ఛార్జీలు , ట్రేడ్ లైసెన్స్ రుసుంలు కూడా లక్ష్యం ప్రకారం వసూలు చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల డేటా క్షేత్ర స్థాయిలో సేకరించి ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు . ఇటీవల కొంత మంది పేదలకు స్థలాల పట్టాలు ఇచ్చిన నేపథ్యంలో వారు ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవడానికి వీలుగా ఎల్ టూ కేటగిరీ నుండి ఎల్ వన్ కు మార్చాలని అన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ పై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ప్రతి స్వచ్ఛ వాహనం డి ఆర్ సి కేంద్రానికి వెళ్ళాలని అన్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో మరుగు దొడ్లు , నీటి సరఫరా , లైటింగ్ , ర్యాంప్ తదితర అవసరమైన వసతులు కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ ఎస్ . ఇ. గురువీర , ఇ . ఇ. పి. వి. రామన్ , సెక్రెటరీ ఉమా మహేశ్వర్ రావు , అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు , ఎ సి పి . శ్రీ హరి , డి . ఇ లు షాభాజ్ , శాంతి స్వరూప్ , జగదీష్ , సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# అక్షర సేవకు గుర్తింపుగా అక్షర ప్రవీణ జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్న పోతుగంటి వీరాచారి





**ధర్మ ఘంట జనవరి 22,సూర్యాపేట జిల్లా ప్రతినిధి :** ఆంధ్రప్రదేశ్లోని విజయవాడలో బుధవారం సాయంత్రం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో తెలుగు భాష - తెలుగు సంస్కృతి, తెలుగు వైభవం - తెలుగు సాహిత్యం - తెలుగు కళలు పరిరక్షణ కోసం నిరంతరాయంగా సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా కార్యక్రమాలతో సాహితీ ప్రభంజనం సృష్టిస్తున్న శ్రీశ్రీ కళావేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ అవార్డ్స్ మరియు గోదావరి సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో డా . కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో ప్రాచీన కవుల వారసులచే నిర్వహించిన సాహితీ సాంస్కృతిక పట్టాభిషేక మహోత్సవ సందర్భంగా తెలుగు సాహిత్యంలో విశేషమైన కృషి కవులకు, కళాకారులకు వివిధ రంగాల వారికి జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపిక చేశారు.మన సూర్యాపేట వాసి ప్రముఖ కవి,రచయిత, సామాజిక కార్యకర్త డా.పోతుగంటి వీరాచారి ఎంపికవడం గర్వించదగ్గ విషయం. ఈ సందర్భంగా శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ మాట్లాడుతూ ఈ సమాజంలో సాహిత్యానికి ప్రాధాన్యత తగ్గుతున్న కాలంలోనూ అక్షరాన్ని ఆయుధంగా చేసుకొని సామాజిక చైతన్యం కోసం వీరాచారి చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం సభాధ్యక్షతన జరిగిన సమావేశంలో , జాతీయ ప్రధాన కార్యదర్శి డా.టి పార్థసారథి , ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షణ దళ కమాండెంట్ ఎస్పీ (రాజమహేంద్రవరం ) డా.కొండానర్సింహారావు, అలివేలు మంగ దేవి దంపతులు, శ్రీనాథ మహాకవి వారసులగు శ్రీ కావూరి శ్రీనివాసశర్మ, కంచర్ల గోపన్న వారసులగు శ్రీనివాసరావు, ఏనుగు లక్ష్మణ కవి వారసులగు శివ ప్రసాద్ ల చేతులమీదుగా పోతుగంటి వీరాచారికి అక్షర ప్రవీణ పురస్కారాన్ని, మెమోటో, ప్రశంస పత్రం, దుశ్శాలువా, పూలదండతో ఘనంగా సన్మానించారు. సమావేశానంతరం ఎస్పీ మాట్లాడుతూ.. నిజమైన సాహిత్యాన్ని సృజించే కవులకు ప్రాచీన కవులు పొందిన గౌరవాన్ని ఈ కాలంలో కూడా పొందేలా చేయడమే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్న శ్రీశ్రీ కళావేదిక ఆశయం గొప్పదని, కవులు కూడా ఆ తరహా కవిత్వాన్ని సృష్టించడానికే ప్రయత్నిస్తే బాగుంటుందని సలహానిచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం మాట్లాడుతూ అక్షరాన్ని గౌరవించే కవితా బంధువుల ఆత్మీయ స్నేహ బంధమే శ్రీ శ్రీ కళా వేదిక అని, తెలుగు సాహిత్యాన్ని విశ్వవ్యాప్తం చేయడమే లక్ష్యంగా శ్రీ శ్రీ కళావేదిక కృషి చేస్తుందని అన్నారు.రెండు తెలుగు రాష్ట్రాలే కాకుండా వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన 250 మంది కవులు పాల్గొన్నారు. వీరాచారిని సాహితీవేత్తలు బంధు మిత్రులు అభినందనలు తెలియజేశారు

# డైవర్షన్ పాలిటిక్స్ తో ప్రజలను తప్పు దోవ పట్టిస్తున్న రేవంత్

**పగటిపూట సొంత పార్టీ నేతలు టార్గెట్....రాత్రి మోడీ చంద్రబాబుతో చీకటి ఒప్పందాలు...**

**కాంగ్రెస్ స్కాంలను ఎండగట్టినందుకు హరీష్ రావు పై అక్రమ కేసులు**

**అక్రమ ఇసుక,మట్టి దందాలకు పాల్పడుతున్న స్థానిక ఎమ్మెల్యే..**

**కక్ష సాధింపు చర్యలో భాగంగానే హరీష్ రావుకు నోటీసులు**

**నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య**



**ధర్మ ఘంట,జనవరి 22,నల్గొండ:** కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ తో ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని ఎలక్షన్స్ వస్తేనే కెసిఆర్ పై కాళేశ్వరం కేసు,కెటిఆర్ పై ఫార్ములా ఈ రేసు కేసు,హరీష్ రావుపై ఫోన్ ట్యాపింగ్ కేసులు అంటూ వేధింపులు చేస్తోందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా రేవంత్ రెడ్డి తీరు మారలేదు భాష మారలేదని ఆరోపించారు. ముఖ్యమంత్రి అయిన నాటినుండి సామాన్య ప్రజలే కాదు ఆ పార్టీ నాయకులు కూడా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.మొదటి నుండి కాంగ్రెస్ జెండా మోసిన కార్యకర్తలు రేవంత్ రెడ్డి తీరుతో విసుగు చెందిపోయారని గుర్తు చేశారు.పగటి పూట సొంత పార్టీ నేతలనే టార్గెట్ చేసి ఇబ్బందులు పెడుతున్న రేవంత్ రెడ్డి రాత్రి మోడీ చంద్రబాబు లతో చీకటి ఒప్పందాలు చేస్తున్నాడని రేవంత్ రెడ్డి అక్రమాలను కాంగ్రెస్ పార్టీ ఆగడాలను,తప్పిదాలను ఎప్పటికప్పుడు ఎక్కడికక్కడా బిఆర్ఎస్ పార్టీ ప్రశ్నిస్తూనే ఉందన్నారు.ప్రజాక్షేత్రంలో అరాచక కాంగ్రెస్ పార్టీకి బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కేటీఆర్ హరీష్ రావు చుక్కలు చూపిస్తున్నారని తెలిపారు.బొగ్గు కుంభకోణం, కాంగ్రెస్ పార్టీ స్కాంలను ఎండగట్టినందుకే హరీష్ రావుపై అక్రమ కేసు బనాయించి కక్ష్య సాధింపు చర్యలతో హరీశ్ రావుకి రాత్రికి రాత్రే నోటీసులు ఇచ్చారని అన్నారు.ఫోన్ ట్యాపింగ్ కేసులో కోర్టులు క్లీన్ చిట్ ఇచ్చినా సిగ్గులేని రేవంత్ రెడ్డి సర్కార్ మళ్లీ విచారణ అంటూ హరీష్ రావుని ఇబ్బందులు పెడుతుందని అన్నారు.హరీష్ రావు మాట్లాడిన విషయంలో ఏ ఒక్క మంత్రి కూడా ఇప్పటివరకు స్పందించలేదన్నారు.ఇన్నిసార్లు నల్లగొండ జిల్లాకు వచ్చిన ఒక్క పైసా కూడా నిధులు ఇవ్వని అసమర్థ సీఎం రేవంత్ రెడ్డి.అధికారం,ధనం,పోలీసు యంత్రాంగంతోనే ఈ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని నడుపుతుందని పంపించారు.సీనియర్ కాంగ్రెస్ మంత్రులందరి ఫోన్ లు రేవంత్ రెడ్డి ఫోన్ ట్యాపింగ్ చేయిస్తున్నాడని అధికారులు పై స్థాయి నుండి కిందిస్థాయి వరకు అందరూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలానే వ్యవహరిస్తున్నారని అన్నారు.పేద బడుగు బలహీన వర్గాల ప్రజలను ప్రభుత్వం పీడిస్తోందని కోదాడలో దళితబిడ్డ కర్ల రాజేష్ మృతికి పోలీసులే కారకులయ్యారని అన్నారు.ప్రశ్నించే గొంతుకులను అణగదొక్కుతుందన్నారు.రాజేష్ మృతికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.నకిరేకల్ లో స్థానిక ఎమ్మెల్యే అక్రమ ఇసుక, మట్టి రవాణా యదేచ్ఛగా చేస్తున్నాడని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ఈ రెండేళ్లలో కాంగ్రెస్ పార్టీనీ పాతాళంలో కలిపి మళ్ళీ తెలంగాణలో చంద్రబాబు తెలుగుదేశం పార్టీనీ తీసుకురావడం ఖాయం అన్నారు.

# విద్యార్థులు లఘు చిత్రాన్ని నిర్మించడం అభినందనీయం

**శ్రీ సాయి త్రివేణి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ పెసర జనార్దన్ రెడ్డి**

**ఆదిత్యం షార్ట్ ఫిలిం నేడే విడుదల**




**ధర్మ ఘంట జనవరి 22,సూర్యాపేట జిల్లా ప్రతినిధి :** విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా లక్ష్య సాధన తో ముందుకెళ్లాలని ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదని శ్రీ సాయి త్రివేణి డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు ఆదిత్యం షార్ట్ ఫిలిం ను పాషా అనిల్,లు డైరెక్టర్లుగా నిర్మించడం అభినందనీయమని శ్రీ సాయి త్రివేణి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ పెసర జనార్దన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని విద్యానగర్ సాయి త్రివేణి డిగ్రీ కళాశాల నందు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో గురువారం ఆదిత్యం షార్ట్ ఫిలిం నేడు (శుక్రవారం) మధ్యాహ్నం 3:30 కు ఎం వై ఆర్ మ్యూజిక్ మూవీస్ లో (ఎఎతీ ఎబంఱఎ ఎశీజఱవం) యూట్యూబ్ ఛానల్ వీక్షించాలని కోరారు. డైరెక్టర్లు పాషా, అనీల్ లు మాట్లాడుతూ విద్యార్థులు చదువుకున్న సమయంలో వచ్చే ఒడిదుడుకులను అధిగమించి చేరుకోవాల్సిన గమ్యాలను సాధించేలా విద్యార్థులు కృషి చేసేలా బాహుబలి చిత్రంలో నటించిన రాయల హరిచంద్ర ఈ చిత్రంలో ముఖ్యపాత్రను పోషించారని కావున తమ షార్ట్ ఫిలిం చిత్రాన్ని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో షార్ట్ ఫిలిం పాటల రచయిత ఉదయ్ కిరణ్, నటులు సాయికుమార్, ఇర్ఫాన్,శ్రీ సాయి త్రివేణి డిగ్రీ కళాశాల డైరెక్టర్ దిర్శనపు అనీల్ కుమార్, ప్రిన్సిపాల్ తన్నీరు ఉపేందర్, అధ్యాపకులు గంజికుంట్ల గోపీనాథ్, జక్కి రెడ్డి వెంకట్ రెడ్డి,పరకాల శ్రీనివాస్ రెడ్డి, ఉయ్యాల నర్సయ్య,డి, రమేష్ ,కట్టంగూరి వెంకట్, బెజవాడ నాగేశ్వరరావు, మండల్ రెడ్డి మల్లారెడ్డి, రేగట్టే మల్సూరు, రవళి, కళాశాల సిబ్బంది లింగయ్య, ప్రకాష్, విద్యార్థి, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు